ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 21, ఆగస్టు 2025





డీసీసీబీలో అవకతవకలపై సెక్షన్ 51 విచారణ

- విచారణాధికారిగా గౌరీశంకర్
- 4 నెలల్లో నివేదికకు ఆదేశం
- తొలుత ఆయన నియామకంపై కీలక ప్రజాప్రతినిధులు అభ్యంతరం
- ఇప్పటికే విచారణాధికారికి టచ్‌లో బ్యాంకు ఉద్యోగులు

డీసీసీబీలో చోటుచేసుకున్న అవకతవకలపై సెక్షన్ 51 విచారణ సజావుగా సాగేనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకులో వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు ఏ మేరకు వెలుగులోకి వస్తాయన్న సంశయం సహకార శాఖ వర్గాల్లో నెలకొంది. అందుకు గతంలో జరిగిన పరిణామాలు ఊతం ఇస్తున్నాయి. ఒక అధికారిని నాలుగు నెలల క్రితమే విచారణాధికారిగా నియమించుకోవాలని సహకారశాఖ ఉన్నతాధికారులు సూచించగా జిల్లా ప్రజాప్రతినిధులు వ్యతిరేకించడం, ప్రత్యామ్నాయంగా మరొకరిని వారు సూచించినా పట్టించుకోకపోవడం, పైగా తొలుత జిల్లా నేతలు వ్యతిరేకించిన అధికారినే విచారణాధికారిగా నియమించడం లాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అక్రమాలకు పాల్పడ్డ బ్యాంకు ఉద్యోగులు ఇప్పటికే సదరు అధికారికి టచ్‌లోకి వెళ్లారని, ఇక విచారణ అటకెక్కినట్లేనన్న ప్రచారం విస్తృతంగా సాగుతోంది.

అక్రమాల నిగ్గు తేలేనా?


ఒంగోలు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. వీటిపై ఎట్టకేలకు కీలకమైన సెక్షన్ 51 విచారణకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం సహకారశాఖ కమిషనర్ కార్యాలయంలో అదనపు రిజిస్ట్రార్ హోదాలో పనిచేస్తున్న వి.గౌరీశంకర్ విచారణాధికారిగా నియమితులయ్యారు. నాలుగు నెలల్లో ఆ విచారణ పూర్తిచేసి ఇవ్వాలని ఆ అధికారిని ఆదేశిస్తూ సహకార శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు ఇచ్చారు.

అసలు విషయమిదీ..

బ్యాంకులో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదుల నుంచి ఇప్పటివరకు అనేక మలుపులతో పెద్ద తతంగమే జరిగింది. గత వైసీపీ పాలనలో డీసీసీబీలకు, పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ కమిటీలతో కాలం వెళ్లబుచ్చారు. ఆ సమయంలో డీసీసీబీ పాలక మండలిగా ఉన్నవారు కొందరు ఉద్యోగులతో కలిసి భారీగా అవినీతి, అక్రమాలకు, నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు ప్రస్తుత ప్రజాప్రభుత్వం వచ్చాక ఉన్నత స్థాయికి ఫిర్యాదులు వెళ్లాయి. సమగ్ర విచారణ చేయించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి కోరారు. జిల్లా మంత్రి డాక్టర్ స్వామి కూడా ఉన్నత స్థాయిలోని వ్యవహారంపై మాట్లాడారు.

త్రీమెన్ కమిటీతో విచారణ

బ్యాంకుపై విచారణ విషయంలో తొలుత సహకారశాఖ ఉన్నతాధికారులు అయిష్టంతో ఉండి జాప్యం చేయగా ఉన్నతస్థాయి జోక్యంతో ప్రాథమిక విచారణ చేయించాలని కలెక్టర్‌కు వారు సూచించారు. తదనుగుణంగా గత ఏడాది అక్టోబరులో అప్పుడు ఇక్కడ ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో జిల్లా ఆడిట్ అధికారి, ఎల్‌డీఎంలతో కూడిన త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమించారు. ఆ కమిటీ 15 రోజులపాటు పలు అంశాలపై విచారణ చేసి అనేక అవకతవకలు, భారీగా అవినీతి, అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. కొందరు బ్యాంకు ఉద్యోగుల పాత్ర ఆయా అక్రమాల్లో ఉన్నట్లు తేల్చి నివేదికను ఇచ్చింది. సమగ్ర విచారణ కోసం బ్యాంకుపై సెక్షన్ 51 విచారణ చేయించాలని నవంబరులో కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. దానిపైనా సహకార శాఖ ఉన్నతాధికారులు తక్షణం



మిగతా 6లో...



జరుగుమల్లిలో స్వామిత్వ సర్వేను పరిశీలిస్తున్న డీపీవో వెంకటనాయుడు

- జిల్లావ్యాప్తంగా 300 పంచాయతీల్లో సర్వే
- సర్వే పూర్తిచేశాక అన్ని హక్కులూ కల్పించేందుకు శ్రీకారం
- ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

స్వామిత్వ సర్వేతో ఆస్తులకు హక్కులు

గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఆర్థికంగా సంపన్నులు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వారి పిల్లల చదువులు, అత్యవసరాల కోసం ఒకరిపై ఆధారపడకుండా తాము ఉంటున్న ఇంటికి హక్కులు కల్పించడం ద్వారా బ్యాంకుల్లో రుణాలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. అందుకోసం జిల్లాలోని 300 గ్రామ పంచాయతీల్లో స్వామిత్వ సర్వేకు శ్రీకారం చుట్టారు.

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని నివాసాలు, స్థలాలు పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్నాయి. అయితే ఇప్పటివరకు వాటికి పన్ను మినహా ఎలాంటి హక్కుపత్రాలు లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆ కుటుంబ యజమానులు ఆ గృహాలు, ఇంటి స్థలాలను చూపించి రుణాలు తీసుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ప్రజా ప్రభుత్వం అందుకోసం ప్రత్యేక దృష్టిసారించింది. గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్తుల విలువలను ధ్రువీకరించేందుకు కేంద్రప్రభుత్వం 2021లో స్వామిత్వ సర్వేకు అవకాశం కల్పించినా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయింది. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఆ సర్వేపై ప్రత్యేక దృష్టి సారించింది.

జనవరి ఆఖరిలోపు పూర్తి

ప్రస్తుతం జరుగుతున్న

మిగతా 6లో...

గ్రామకంఠంతో సమస్యలు

గతంలో గ్రామీణ ప్రాంతాల్లోని గృహాలు, ఇంటి స్థలాలు గ్రామకంఠంగా నమోదు చేశారు. క్రయవిక్రయాల సమయంలో సాంకేతిక సమస్యలు కూడా వస్తున్నాయి. ప్రస్తుతం చేస్తున్న సర్వే ద్వారా రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాలకు హద్దులతో పాటు చెరువులు, పాఠశాలలు, రహదారులు, పార్కులు, ఆలయాలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్తులను లెక్క తేలుస్తారు. ఆ తర్వాత పంచాయతీరాజ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో గృహ సర్వే చేపట్టి ఇంటి యజమాని పేరు, డోర్ నెంబరు, ఎప్పుడు నిర్మాణం చేశారని తదితర వివరాలను సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ గృహ సర్వేలో సర్వేయర్, వీఆర్వో, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు ఉంటారు.



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కోతల్లేని నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. విద్యుత్ సిబ్బంది ప్రవర్తన వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం విద్యుత్ శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయం, పరిశ్రమలకు సరఫరా, పీఎం సూర్యఘర్, స్మార్ట్‌మీటర్లు, నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణాలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఆయా అంశాలపై విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా వివరించారు. ఖాళీగా ఉన్న ఏఈఈ పోస్టులను భర్తీచేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందితో నిర్వహణ విధులను చేస్తున్నామని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అన్సారియా పనిచేసే ప్రాంతంలోనే సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా సేవలలో నాణ్యత పెరుగుతుందన్నారు. ప్రజల్లోనూ సానుకూల దృక్పథం ఏర్పడుతుందన్నారు. ప్రధానంగా ఐవీఆర్ఎస్ సర్వేలో విద్యుత్ శాఖ సేవలపై ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంటుందన్నారు. దోర్నాల, మార్కాపురం, ముండ్లమూరు, చీమకుర్తి, పెద్దారవీడు, వైపాలెం, ఎస్ఎన్‌పాడు, పామూరు, మద్దిపాడు మండలాలపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ఆర్‌డీఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలకు కొత్తగా వేస్తున్న 3ఫేజ్ విద్యుత్ లైన్ల పనులను కూడా వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఈఈలు, డీఈఈలు, నెడ్‌క్యాప్ అధికారులు పాల్గొన్నారు.

టీచర్ల అంతర్ జిల్లాల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

ఒంగోలు విద్య, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల అంతర్‌జిల్లాల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యా కార్యదర్శి కోనశశిధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీచర్లు, హెడ్మాస్టర్లకు అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టమని కోరుతూ శాసనమండలి సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. వీరి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం అంతర్ జిల్లాల బదిలీలకు ఆమోదం తెలిపింది. భార్యాభర్తలు, పరస్పర బదిలీలకు మాత్రమే అంతర్ జిల్లాల బదిలీల్లో అవకాశం ఇచ్చారు. వ్యక్తిగత కారణాలు, ఆరోగ్య కారణాలతో అంతర్ జిల్లాల బదిలీలకు ప్రతిపాదనలు పంపవద్దని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశించారు. ఈ నిబంధనలకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేయమని పాఠశాల విద్యా డైరెక్టర్‌ను శశిధర్ కోరారు.

డీఎస్సీ ద్వారా 672 పోస్టులు భర్తీ

ఒంగోలు విద్య, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా 672 టీచర్ పోస్టులు భర్తీకానున్నాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్, గిరిజన సంక్షేమ పాఠశాలలు, చెంచు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు నిండనున్నాయి. ఆయా పాఠశాలల్లో ఖాళీలను వేర్వేరుగా చూపించారు. 672 పోస్టుల్లో ఏ యజమాన్యానికి ప్రకటించిన పోస్టులు ఆ పాఠశాలల్లోనే భర్తీ చేస్తారు. ఒకే రాత పరీక్షలో టీచర్ అభ్యర్థులు ఆప్షన్లు, ప్రాధాన్యతలను బట్టి ఆయా యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పోస్టింగులు ఇస్తారు. సెప్టెంబరు 5న గురుపూజోత్సవం నాటికి వీరం దరికి నియామకపు ఉత్తర్వులు ఇచ్చి, వారు ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరేలా పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈక్రమంలో బుధవారం సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాటు చేసిన కమిటీల్లోని సభ్యులకు శిక్షణ కూడా ఇచ్చారు. జిల్లాలో గురువారం మెరిట్ జాబితాలోని అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. ప్రస్తుతం మెరిట్ జాబితాలోని అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం టీచర్ల ఎంపిక తుది జాబితాను ప్రకటిస్తారు. ఏడేళ్ల తర్వాత ఇప్పుడు కొత్త టీచర్లు పాఠశాలల్లోకి అడుగుపెట్టనున్నారు.

ప్రభుత్వ, జడ్పీ యాజమాన్యాలకు 599 పోస్టులు

ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లోని ఖాళీలకు 599 పోస్టులు ప్రకటించారు. స్కూలు అసిస్టెంట్ తెలుగు 38, హిందీ 23, ఇంగ్లీషు 94, గణితం 92, ఫిజికల్ సైన్స్ 24, బయలాజికల్ సైన్స్ 70, సోషల్ 106, వ్యాయామ విద్య 72, సెకండరీ గ్రేడ్ పోస్టులు 80 కలిపి 599 పోస్టులు ప్రకటించారు. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో పాఠశాలల్లో ఖాళీల భర్తీకి 30 పోస్టులు ప్రకటించారు. స్కూలు అసిస్టెంట్ తెలుగు 1, ఇంగ్లీషు 1, గణితం రెండు, ఎస్జీటీ 26 పోస్టులు ప్రకటించారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, చెంచు పాఠశాలల్లో 43 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్కూలు అసిస్టెంట్ తెలుగు 2, హిందీ 4, ఇంగ్లీషు 4, గణితం 1, ఫిజికల్ సైన్స్ 2, బయలాజికల్ సైన్స్ 2, సోషల్ 2, సెకండరీ గ్రేడ్ టీచర్లు పోస్టులు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 19, చెంచు పాఠశాలల్లో 7 కలిపి 43 ప్రకటించారు. ఈ పోస్టులను భర్తీచేయడం ద్వారా జిల్లాలోని ప్రభుత్వరంగ పాఠశాలల్లో టీచర్ల కొరత కొంతమేర తగ్గనుంది.

పొలాల్లో చిరుత అడుగులు

- ఎల్.కోట, ఔరంగాబాద్ గ్రామాల్లో సంచారం
- అటవీ అధికారులు అప్రమత్తం
- ప్రజలకు జాగ్రత్తలపై సూచనలు



ఎల్.కోటలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

కంభం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం ఎల్.కోట, నడింపల్లి, ఔరంగాబాద్, లింగోజిపల్లి గ్రామాల పంట పొలాల్లో చిరుతపులి పాదముద్రలు కనిపించడంతో ప్రజాలు భయాందోళన చెందుతున్నారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో బేస్తవారిపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆనందరావు వెంటనే తన సిబ్బందితో కలసి ఆయా గ్రామాల్లో పర్యటించి గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఎల్.కోట, ఔరంగాబాద్ గ్రామాల మధ్య ఉన్న మొక్కజొన్న పంట సమీపంలో, గ్రామాల సమీపంలో చిరుత పాదముద్రలను పరిశీలించారు. చిరుత పులి సంచరించిందన్న ప్రాంతాలలో, మరికొన్ని చోట్ల ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బేస్తవారిపేట రేంజ్ అధికారి ఆనందరావు మాట్లాడుతూ ఎల్‌కోట గ్రామ సమీపంలోని ఏనుగు కొండ ప్రాంతంలో వేసిన మొక్కజొన్న చేలో చిరుత పులి పాదముద్రలు ఉన్నాయని రైతులు, గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో తాము నాలుగు గ్రామాల పొలాల్లో మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం విస్తృతంగా గాలించామని అన్నారు. ఆ పాదముద్రలు చిరుత పులివా, మరేదైనా జంతువుకు చెందినవా అని గుర్తించేందుకు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందుజాగ్రత్త

మిగతా 6లో...

ఆసరా..!

వయో వృద్ధులకు డిజిటల్ కార్డులు

- వివిధ ప్రయోజనాలు వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- సచివాలయాల్లో దరఖాస్తుకు అవకాశం
- నేడు సీనియర్ సిటిజన్స్ దినోత్సవం

7

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

- దర్శి ప్రజా వేదికలో వెలుగు చూసిన అవకతవకలు

7

బాలికను గర్భవతిని చేసిన యువకుడికి 20 ఏళ్ల జైలు

7

టీ తాగొస్తానని.. భర్త పరార్!

- పొదిలి స్టేషన్‌లో తెలంగాణ మహిళ ఫిర్యాదు

కుడికాలువ ఆయకట్టుకు సాగునీటి సరఫరా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

6



ఒంగోలు నుంచి కొప్పోలు మీదుగా కొత్తపట్నం వరకు సాగుతున్న భారీ ట్రాక్టర్ ర్యాలీ (ఇన్‌సెట్‌లో) ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే జనార్దన్, ఒడా చైర్మన్ రియాజ్

ఇది రైతు ప్రభుత్వం

- కొత్తపట్నం మండలాభివృద్ధికి కృషి చేస్తా
- వంతెనల నిర్మాణంతో వరదలొచ్చినా ప్రజలు సాఫీగా రాకపోకలు
- అన్నదాత సుఖీభవ విజయోత్సవ సభలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్
- భారీ సంఖ్యలో ట్రాక్టర్లతో ర్యాలీ

6

సాగర్ కుడికాలువ ఆయకట్టుకు సాగునీటి సరఫరా

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్,ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కుడికాలువ ఆయకట్టుకు సాగునీటి సరఫరాకు నీటిని విడుదల చేసినట్లు కలెక్టర్ తమీమ్అన్సారియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుడికాలువ కింద ఐదు నియోజకవర్గాల్లోని 14 మండలాల్లో 1.04 లక్షల ఎకరాల మాగాణి, 1.49 లక్షల ఎకరాల మెట్టకలిపి 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని పేర్కొన్నారు. 97 తాగునీటిచెరువులు, నాలుగు ఎస్ఎస్ ట్యాంకులకు మంచినీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. కుడికాలువ కింద పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాలోని ఆయకట్టు, తాగునీటి అవసరాలకు 132 టీఎంసీల నీటి కేటాయింపు ఉందని, అందులో 43శాతం పూర్వపు ప్రకాశం జిల్లాలోని ఆయకట్టు, తాగునీటి అవసరాలకు కేటాయించారని పేర్కొన్నారు. 2025-26 సంవత్సరానికి ఆగస్టు చివరి వారం నుంచి 85/3వద్దనుంచి నీటిని విడుదల చేస్తారని తెలిపారు. సాగర్ నీటిని ఆగస్టు చివరి వారం నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు అందించనున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి అవసరాల కోసం నింపిన చెరువుల్లోని నీటిని ఆ అవసరాలకు మాత్రమే వినియోగించాలని కోరారు.

ఇది రైతు ప్రభుత్వం

కొత్తపట్నం మండల అభివృద్ధికి కృషి చేస్తా

వంతెనల నిర్మాణంతో వరదలొచ్చినా ప్రజలు సాఫీగా రాకపోకలు

అన్నదాత సుఖీభవ విజయోత్సవ సభలో ఎమ్మెల్యే దామచర్ల

భారీ సంఖ్యలో ట్రాక్టర్ల ర్యాలీ

కొత్తపట్నం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని కోరేదని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ చెప్పారు. బుధవారం కొత్తపట్నంలోని బస్టాండ్ సెంటర్‌లో జరిగిన అన్నదాత సుఖీభవ విజయోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. వైసీపీ అరాచక పాలనలో ఖజానాను పూర్తిగా ఖాళీ చేసి పోయారని, ప్రస్తుతం ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రైతుల కోసం అన్నదాతసుఖీభవ పథకాన్ని వేల కోట్ల రూపాయలతో అమలు చేస్తోందన్నారు. మండలంలో అభివృద్ధి అంటూ జరిగిందంటే అది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనేనని చెప్పారు. తాను గతంలో శాసనసభ్యునిగా ఉన్న సమయంలోనే కొత్తపట్నం-ఒంగోలు, ఈతముక్కల-ఒంగోలు రోడ్డులో వంతెనలను నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. దీంతో మండలంలోని ప్రజలు వరదలు వచ్చినా ప్రశాంతంగా రాకపోకలు సాగిస్తున్నారన్నారు. రైతుకూలీలు, మత్స్యకారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానన్నారు. కొత్తపట్నంలో బీచ్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని చెప్పారు. మోటుమాల, గుండమాల రోడ్డు పనులు కూడా త్వరలోనే ప్రారంభమతాయన్నారు. కొత్తపట్నం తీరం అభివృద్ధి పరిచే దిశగా త్వరలోనే ఫిషింగ్ హార్బర్ పనులు కూడా ప్రారంభం అయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఢిల్లీ నుంచి కేంద్ర బృందం ఇటీవలే వచ్చి తీరాన్ని పరిశీలించి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

వెళ్లిందన్నారు. సభకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ద్వారగాపుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. సభలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒడా చైర్మన్ రియాజ్, ఒంగోలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ రామచంద్రగౌడ్, జిల్లా మత్స్యకార ఫెడరేషన్ అధ్యక్షుడు పేరయ్య, తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నాయకులు గేనం సుబ్బారావు, గ్రామ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు సింగిరి శ్రీనివాసులు, ఒంగోలు నగర క్లస్టర్ ఇన్‌చార్జి కటారి నాగేశ్వరరావు, రైతు నాయకులు మాలంపాటి యానాదినాయుడు, కాట్రగడ్డ నాగేశ్వరరావు, నడిపినేని భాస్కర్, గౌడకార్పొరేషన్ డైరెక్టర్ రామచంద్ర గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. కొప్పోలు చెరువు వద్ద నుంచి కొత్తపట్నం వరకు ర్యాలీ జరిగింది.

కాలువల పూడికతీత పనుల్లో నాణ్యత పాటించాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నీటి కాలువల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనుల్లో నాణ్యత ముఖ్యమని కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో బుధవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.ముందుగా నాగార్జున సాగర్, రామతీర్థం, మోపాడు, కంభం చెరువుల నుంచి నీళ్ల సరఫరా అయ్యే కాలువల్లో చేపట్టిన పనులను ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మీ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎస్ఏడీఎంఎఫ్ పనులకు టెండర్ల ద్వారా చేపట్టామని చెప్పారు. రూ.10 లక్షలలోపు పనులను ఆయా సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్నామని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆయాఅంశాలపై



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ ఆయా పనులను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పనులను నాణ్యతతో చేసేందుకు సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి చెరువులను కూడా పూర్తి స్థాయిలో నింపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భూగర్భ నీటి మట్టం పెంచేందుకు ఆయా ప్రాంతాలను బట్టి నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు కూడా రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలోశాఖలఅధికారులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు దృష్టిసారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం మునిసిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మునిసిపాలిటీల వారీగా కార్యాలయంలో ఉన్న పారిశుధ్య కార్మికుల వివరాలు, ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరణ, డ్రైనేజీలు శుభ్రం చేయడం, తాగునీటి సరఫరాపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. పారిశుధ్య నిర్వహణపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తున్నందున పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఒంగోలులో మునిసిపల్ కార్పొరేషన్ విషయంలో ఆయా విషయాలలో ఇతర మునిసిపాలిటీలకు ఆదర్శంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ వెంకటేశ్వరరావును ఆదేశించారు. డ్రైనేజీలను శుభ్రం చేసేందుకు నగరంలో 15 రోజుల పాటు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలన్నారు. అన్న క్యాంటీన్లలోనూ పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు కీలకమని కమిషనర్లకు సూచించారు. వీధి కుక్కలను కట్టడి చేయడం, వాటికి వ్యాక్సిన్ వేయించడంపైనా దృష్టి సారించాలన్నారు. జంతుప్రేమికుల సహకారం కూడా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్లతో పాటు పబ్లిక్‌హెల్త్ అధికారులు కూడా ఉన్నారు.

దొరువును ఆధ్యాత్మిక ప్రాంతంగా మారుస్తా..!

ఎమ్మెల్యే ఉగ్ర

డయాలసిస్ సెంటర్ నిర్మాణ పనుల పరిశీలన

కనిగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : దొరువు ప్రాంతాన్ని అధ్యాత్మిక ప్రాంతంగా మారుస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని దొరువు పరిసర ప్రాంతాలలో ఎమ్మెల్యే బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో ఆహ్లాదకరమైన శోభతో ఉండాల్సిన దొరువు ప్రాంతం ఆక్రమణలు, అపరిశుభ్రంగా ఉండటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. దొరువు కట్ట ప్రాంతం అంతా కలియ తిరగారు. వంతెన గుండా దుర్గాదేవి ఆలయంలోకి ప్రవేశించి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆలయం ఏ కాలంలో నిర్మించింది స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆలయం కార్యక్రమాల్లోని ఫొటోల గ్యాలరీని తిలకించారు. అనంతరం దొరువులో ఉన్న వ్యర్థాలను చూసి వాటిని శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా కొండపైకి వెళ్లే మార్గం, దొరువు కరకట్ట ఆక్రమణలు తొలగించే చర్యలు తీసుకుంటామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో దొరువు అభివృద్ధికి కేటాయించిన నిధులు ఏమయ్యాయో తేలుస్తామన్నారు. 2019కు ముందు ఎన్నికల ప్రచారంలో దొరువు అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పిన వైసీపీ నేతలు ఆ దిశగా అడుగులు వేయకపోవటం బాధాకరమన్నారు. కొండపైన శివాలయంకు వెళ్ళే మార్గాన్ని సుందరంగా మార్చేందుకు అవసరమైన ప్రక్రియపై సమాలోచనలు చేస్తున్నట్లు చెప్పారు. దొరువు వద్దకు వచ్చిన ప్రజలు, భక్తులు ఆహ్లాదంగా గడిపి ఆధ్యాత్మిక వాతావరణంలో శివాలయాన్ని దర్శించుకునేందుకు అవసరమైన ఏర్పాటు చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కొండపైన విజయమార్తేండేశ్వరస్వామి ఆలయ భూములను బయటికి తీసి దేవాలయాభివృద్ధికి వెచ్చిస్తామన్నారు. అనంతరం పట్టణంలోని నగరికంటి బసవయ్య సెంటర్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న శివాలయ రూముల నిర్మాణ పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, నాయకులు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, సుబ్రహ్మణ్యం, వెంకటరెడ్డి, యారవ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



డయాలసిస్ సెంటర్ నిర్మాణ పనులపై మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అధునాతన సౌకర్యాలతో డయాలసిస్ కేంద్రం నిర్మించాలి

కనిగిరి ప్రాంతంలో పెరుగుతున్న డయాలసిస్ బాధితులకు అనుకూలంగా అధునాతన సౌకర్యాలతో డయాలసిస్ సెంటర్ భవన నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న డయాలసిస్ సెంటర్‌ను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్ ఈ ప్రాంతంలోని బాధితులకు ఏ విధంగా సరిపోకపోవటంతో నూతన భవన నిర్మాణం చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. అందుకోసం త్వరతి గతిన భవన నిర్మాణం పూర్తి చేయాలని టీమ్ మేనేజర్ దిలీప్‌కు సూచించారు. బెడ్‌ల వసతితో పాటు వాటి వద్ద డయాలసిస్ మిషన్‌ను అనుకూలంగా ఏర్పాటు చేసుకునేవిధంగా అమర్చాలన్నారు. పంపింగ్ మిషన్ పైపులు నాణ్యమైనవి ఏర్పాటు చేయాలన్నారు. నాణ్యమైన పరికరాలను అమర్చి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధిపనులపై సామాజిక తనిఖీ

ప్రజా వేదికలో వెలుగు చూసిన అవకతవకలు

దర్శి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలో జరిగిన ఉపాధిపనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. జిల్లా డ్వామా పీడీ జి.జోషప్ కుమార్‌ఆధ్వర్యంలో ప్రజావేదిక జరిగింది. 15 రోజులుగా సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి పనుల్లో జరిగిన అవకతవకలను గుర్తించింది. ఆవివరాలను ప్రజావేదిక సభలో పంచాయతీల వారీగా వివరించారు.మండలంలో 2024ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మొత్తం1,444 పనులను రూ. 19.21కోట్ల విలువైన పనులుజరిగాయి. మొత్తం 5లక్షల 35వేల పనిదినాలు కల్పించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం పలుగ్రామాల్లో ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలను వివరించారు. తొలి రోజు పోతవరం, తూర్పుచవటపాలెం, కొర్లమడుగు,సామంతపూడి, వెంకటాచలంపల్లి, జముకులదిన్న, పెద్దఉయ్యాలవాడ, రాజంపల్లి, మారెడ్డిపల్లి తదిరత గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా మస్టర్లలో అవకతవకలు, పనులకొలతల్లో తేడాలు గుర్తించారు. పలు చోట్ల పని తెలుపు బోర్డుల్లు ఏర్పాటు చేయలేదని, కూలీలకు నీడ,మంచి నీటి వసతి ఏర్పాటు చేయని విషయాన్ని గుర్తించి వివరాలను ప్రజా వేదికలో వెల్లడించారు. ప్రస్తుతం వెలుగు చూసిన అవకతవకలకు ఎవరు బాధ్యులో సామాజిక తనిఖీ విచారణలో వెల్లడికావాల్సి ఉంది. అవకతవకల వివరాలను వివరించారు. మిగిలిన పంచాయతీలకు ప్రజావేదిక గురువారం నిర్వహిస్తారు. సోషల్ అడిట్ ప్రోగ్రాం మేనేజర్ ఈశ్వర్, ఆడిటర్ నాగరాజు, ఎంపీపీ సుధారాణి, ఎంపీడీవో వసంతరావునాయక్, ఏపీవో కల్యాణి, మురళి, ఈసీ ప్రసాద్, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

బార్ లైసెన్స్ దరఖాస్తులకు ఆహ్వానం

పొదిలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పొదిలి పరిధిలో బార్ ఏర్పాటుకు లైసెన్స్‌లను ఆహ్వానిస్తున్నటు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పీఈ వెంకట్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా మొత్తం 26 బార్‌లు ఉన్నాయి. వాటికి ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఫీజు రూ.5లక్షల 10వేలు చెల్లించి నమోదు చేసుకోవాలని తెలిపారు. 2025 సెప్టెంబర్ నుంచి 2028 ఆగస్టు 31 వరకు మూడేళ్ల పాలసీకాలం ఉంటుందన్నారు. 50వేల జనాబా ఉంటే రూ.35లక్షలు, 50వేల జనాబా నుంచి 5 లక్షల వరకూ ఉంటే రూ.55లక్షలు చెల్లించాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో చేసుకోవచ్చన్నారు. సమావేశంలో సీఐ అరుణకుమారి ఉన్నారు.

ఇసుక నిబంధనలు పాటించకుంటే చర్యలు

రేట్ల పట్టికలు, బోర్డులను ఏర్పాటు చేయాలి: అసిస్టెంట్ జియాలజిస్ట్

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఇసుక అమ్మకాలు జరగాలని అలా కాకుండా అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని ఒంగోలు అసిస్టెంట్ జియాలజిస్ట్ రవి వర్మ అన్నారు. ఎర్రగొండపాలెంలోని ఇసుక డంపింగ్ పాయింట్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆమె అదేశాలతో తనిఖీలు చేసినట్లు తెలిపారు. డంపింగ్ పాయింట్‌కు సంబంధించి బోర్డులు, రేట్ల వివరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అధిక ధరలకు అమ్మిన, సబ్ డంపింగ్ పాయింట్లు పెట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట టీఏ బాలరాజు, నాగేశ్వరరావు, రాజనాయుడు ఉన్నారు.

అక్రమాలు తేలేనా?

అవీఇవీ

(5వపేజీ తరువాయి)

స్పందించకుండా జాప్యం చేశారు.

విచారణకు సహకరించని ఉన్నతాధికారులు

సక్రమంగా విచారణ జరగాలంటే పల్నాడు జిల్లాలో అప్పుడు డీసీసీవో కేడర్‌లో పనిచేస్తున్న ఒక అధికారిని నియమించాలని జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులకు సూచించారు. అయితే కొంత జాప్యం తర్వాత వారి సూచనలకు విరుద్ధంగా జిల్లాలో అందుబాటులో ఉన్న అధికారితో విచారణ చేయించాలని, వీలు కాకపోతే కమిషనర్ కార్యాలయలోని అదనపు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గౌరీశంకర్‌ను వినియోగించుకోవాలని డిసెంబరులో సహకార శాఖ ఉన్నతాధికారులు కలెక్టర్‌కు సూచిస్తూ సెక్షన 51 విచారణకు అనుమతించారు. తాము సూచించిన అధికారిని విచారణకు నియమించకపోవడంపై జిల్లా కీలక ప్రజాప్రతినిధులు అభ్యంతరం చెప్పగా జిల్లాలో సహకారశాఖ అధికారుల పనితీరు పట్ల అప్పటికే తీవ్ర అసంతృప్తితో ఉన్న కలెక్టర్ ఇక్కడే ఆ శాఖ అధికారులతో విచారణకు ఇష్టపడలేదు.

డీసీవోపై వేటు.. పైన అసంతృప్తి

విచారణ ప్రక్రియ అంతటితో ఆగిపోగా అనంతరం ఇక్కడ డీసీవోగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి వ్యవహారంపై ఇటు కీలక ప్రజాప్రతినిధులు, అటు కలెక్టర్ అసంతృప్తితో ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఈ పరిణామాలన్నింటిపైనా సహకారశాఖ ఉన్నతాధికారులు అసంతృప్తితో ఉండి సకాలంలో ఇక్కడ డీసీవో నియామకం చేయకుండా డీసీసీబీలో ఓఎస్‌డీగా ఉన్న డీసీసీవో హోదా కలిగిన ఇందిరాదేవిని ఇన్‌చార్జి డీసీవోగా కలెక్టర్ నియమించారు. దీనిపై ఉన్నతాధికారులు మరింత ఆగ్రహం చెందడం, ఇన్‌చార్జి డీసీవోగా ఇందిరాదేవికి శాఖాపరంగా అవసరమైన గుర్తింపు ఇవ్వకపోవడంతో దాదాపు మూడునెలల పాటు ఆ జిల్లా కార్యాలయ ఉద్యోగులకు జీతాలు కూడా ఆగిపోయి వారు రోడ్డెక్కారు. ఈ అంశాలను వెలుగులోకి తీసుకు వస్తూ ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించడంతో జిల్లా మంత్రి డాక్టర్ స్వామి స్పందించి ఉన్నతస్థాయిలో మాట్లాడటంతో గత నెలలో ఇందిరాదేవికి ఇన్‌చార్జి డీసీవోగా అధికారాలను ఉన్నతాధికారులు ఇచ్చారు. అనంతరం సిబ్బందికి జీతాలు రావడం, ఇతర శాఖపరమైన వ్యవహారాలు సాగుతున్నాయి.

వద్దు అన్న వారినే నియమించారు..

డీసీసీబీపై ప్రభుత్వం ఆదేశించిన సెక్షన్ 51 విచారణపై ఈ పరిణామాల అనంతరం మళ్లీ కదలిక వచ్చింది. ఆ విచారణను కమిషనరేట్‌లో అదనపు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గౌరీశంకర్‌ను నియమించుకోవాలని సహకారశాఖ కమిషనర్ కలెక్టర్‌కు సూచిస్తూ సహకార శాఖ ముఖ్య కార్యదర్శి గత నెలలో సర్క్యులర్ ఇచ్చారు. అయితే తదనుగుణంగా సహకారశాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉండగా కలెక్టర్ ద్వారా ఆ ఉత్తర్వులు ఇవ్వాలని జిల్లా అధికారులకు సూచించినట్లు సమాచారం. చివరకు తొలుత జిల్లా ప్రజాప్రతినిధులు వద్దన్న గౌరీశంకరనే విచారణాధికారిగా నియమిస్తూ సెక్షన్ 51 విచారణకు నాలుగు మాసాల్లో పూర్తి చేసి నివేదించాలని కోరుతూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఈ విషయాన్ని ముందుగానే గుర్తించిన కొందరు ఉద్యోగులు ఇప్పటికే విచారణాధికారికి టచ్‌లోకి వెళ్లినట్లు సహకారశాఖ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అలా సంప్రదింపులు జరిపిన వారిలో కొందరిపై లోకేశ్వరరావు కమిటీ నివేదికలో అభియోగాలు ఉన్నాయని అలాంటి వారు ముందుగానే విచారణాధికారిని కలవడం వల్ల ఇక విచారణ ఏ మేరకు పారదర్శకంగా జరుగుతుంది, ఎంతవరకు గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు వెలుగుచూస్తాయన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

స్వామిత్వ సర్వేతో ఆస్తులకు హక్కులు

(5వపేజీ తరువాయి)

రీసర్వేలో వీఆర్వోలు, సర్వేయర్లు ఉంటున్నందున ప్రస్తుతం పంచాయతీ అధికారులు మాత్రమే సర్వే చేస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని సెప్టెంబరు ఆఖరు నాటికి పూర్తిచేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు వారి ఆస్తులకు పూర్తి హక్కులను కల్పించనున్నారు. మిగిలిన 270 గ్రామపంచాయతీల్లో నవంబరులో సర్వే ప్రారంభించి వచ్చే ఏడాది జనవరి ఆఖరు లోపు సర్వే ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించడంతో అందుకు అనుగుణంగా జిల్లా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఆదేశాలతో జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ప్రతిరోజు గ్రామాల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించడంతోపాటు అందుకు అవసరమైన సూచనలు, సలహాలను క్షేత్రస్థాయి సిబ్బందికి ఇస్తున్నారు. వారంలో నాలుగైదు రోజులపాటు డీపీవో ఆయా ప్రాంతాల్లో పర్యటించే విధంగా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అందులోభాగంగా బుధవారం మండల కేంద్రమైన జరుగుమల్లిలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను పరిశీలించి సూచనలు చేశారు.

పొలాల్లో చిరుత అడుగులు

(5వపేజీ తరువాయి)

చర్యలో భాగంగా ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడమే గాక పొలాల్లోకి రాత్రివేళ ఇంటి నుంచి ఒంటరిగా బయటకు రాకూడదని, ఇంటి ముందు లైట్ వేసి ఉంచాలని సూచించినట్లు ఆనందరావు తెలిపారు. ఏది ఏమైనా ఇప్పటివరకు అటువైపు సమీప గ్రామాలలోనే పెద్ద పులులు, చిరుత పులులు ఆవులు, గేదెలపై దాడి చేయడం చూశామే తప్ప అటవీ ప్రాంతానికి దూరంగా ఉన్న కంభం మండలంలోకి చిరుత ఎలా వచ్చిందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

సమస్యల పరిష్కారం కోసం విశాల ఉద్యమాలు

- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మస్తాన్‌బీ
- ముగిసిన సభలు



మహాసభలో మాట్లాడుతున్న మస్తాన్‌బీ

కొండపి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళల సమస్యల పరిష్కారం కోసం విశాల ఐక్య మహిళా ఉద్యమాలు చేపట్టాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్‌కె మస్తాన్‌బీ చెప్పారు. ఐద్వా జిల్లా మహాసభల సందర్భంగా ముగింపురోజైన బుధవారం కొండపిలోని పొదిలి రోడ్డులోని కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర నేరపరిశోధనా సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం దేశంలో గడచిన ఏడాది 35వేల మంది మహిళలపై అఘాయిత్యాలు జరిగాయన్నారు. ఇది అత్యంత దారుణమని తెలిపారు. మద్యం, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా మహిళలు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అశ్లీల వెబ్‌సైట్లు, పోర్న్ వీడియోలు మహిళలపై వయస్సులతో పనిలేకుండా మగాళ్లుగా మృగాళ్లుగా మారే దుశ్చర్యలకు ప్రేరేపిస్తున్నాయని చెప్పారు. పితృస్వామిక భావజాలం మహిళల అణచివేతకు తోడ్పడుతోందని, అధికారం ప్రభావితం చేసి బాధిత మహిళల కేసుల్లో దోషులు రక్షణ పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాలమైన ఉద్యమాలను నిర్మించడం ద్వారానే ఇవన్నీ అరికట్టవచ్చన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు జి. ఉమామహేశ్వరి, శ్రామిక జిల్లా మహిళా కన్వీనర్ పి. కల్పన, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి, ప్రజానాట్యమండలి గాయకులు ఎ. సూరిబాబు, వి. రూబెన్, మల్లెల బాబూరావు, ఆహ్వాన సంఘం సభ్యులు కేజీ మస్తాన్, మల్లెల కొండయ్య, అంగలకుర్తి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నీట్ జాతీయ స్థాయిలో దీప్తికి 3,100ర్యాంక్

మర్రిపూడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నీట్ పీజీ పరీక్షలలో మర్రిపూడికి చెందిన ఇనుకొల్లు దీప్తిరెడ్డి జాతీయస్థాయిలో 3100ర్యాంక్, రాష్ట్రస్థాయిలో 161వ ర్యాంక్ సాధించింది. రైతు కుటుంబం నుంచి వచ్చన ఆ యువతి పొదిలిలోని ప్రైవేటు పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించింది. విజయవాడలోని ప్రైవేటు పాఠశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. అనంతరం నీట్ పరీక్షలో నెగ్గి గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోసం నిర్వహించిన నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంక్ సాధించింది. దీప్తిరెడ్డిని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెంకటరెడ్డి తహసీల్దార్ జనార్దన్, ఎంపీడీవో ఖాశింపీరా, ఎస్ఐ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి, దీప్తిరెడ్డి తండ్రి మాదిరెడ్డిలు సత్కరించారు. దీప్తిరెడ్డి మాట్లాడుతూ రేడియాలజీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తానని చెప్పారు.

ఆసరా..!

వయోవృద్ధులకు డిజిటల్ కార్డులు

- వివిధ ప్రయోజనాలు వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- సచివాలయాల్లో దరఖాస్తుకు అవకాశం
- నేడు సీనియర్ సిటిజన్స్ దినోత్సవం

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్లకు డిజిటల్ కార్డులు అందించే కార్యక్రమానికి శ్రీకారం పలికింది. 60 ఏళ్లు నిండిన వృద్ధులందరికీ వీటిని అందించనుంది. వాటి కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ కార్డు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు, ఆర్టీసీ బస్సుల్లో టికెట్ రాయితీ సహా ఇతర సదుపాయాలను పొందవచ్చు. నేడు సీనియర్ సిటిజన్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...



● వయోవృద్ధులకు ప్రజా ప్రభుత్వం తోడ్పాటు

అమ్మానాన్నలు.. బిడ్డల ఉన్నతికి కారకులు. జన్మనివ్వడంతోపాటు వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు రెక్కలు ముక్కలు చేసుకుంటారు. తమ కాళ్లపై తాము నిలబడిన తర్వాత బిడ్డలు రెక్కలు వచ్చిన పక్షుల్లా ఎగిరిపోతున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారు. పాశ్చాత్య ధోరణి పెరిగిపోవడం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడంతో అనుబంధాలకు అడ్డుగోడలు ఏర్పడుతున్నాయి. ఈపరిస్థితుల్లో వయోవృద్ధుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాలన్నీ తీసుకురాగా, రాష్ట్ర ప్రభుత్వం వారి కోసం సీనియర్ సిటిజన్ డిజిటల్ కార్డులు అందిస్తోంది. వీటి ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు అర్హులు, ఈ ప్రయోజనాలతో కొంతమేర ఖర్చులు తగ్గించుకుని ఆర్థికంగా లబ్ధిపొందవచ్చు.



కార్డుతో ప్రయోజనాలు

- ఆర్టీసీ బస్సుల్లో టికెట్‌లో 25 శాతం రాయితీ కల్పిస్తారు. దూర ప్రాంతాల బస్సులు మినహా ఇతర బస్సు సర్వీసుల్లో వృద్ధులకు రెండు సీట్లు రిజర్వు చేస్తారు.
- రైల్వేస్టేషన్లలో వృద్ధులకు ప్రత్యేకంగా టికెట్ కౌంటర్లు ఉంటాయి. అవసరమైన వారికి వీల్ చైర్ సదుపాయం కల్పిస్తారు. 60 ఏళ్లు వయస్సు దాటిన వృద్ధులు, 45ఏళ్లకు పైబడి, ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు, గర్భిణులకు లోయర్ బెర్త్‌ల రిజర్వేషన్ కేటాయింపుల్లో ప్రాధాన్యత కల్పిస్తారు.
- ఈ కార్డు కలిగి ఉంటే కోర్టు కేసుల విచారణలోనూ ప్రాధాన్యత లభిస్తుంది.
- పాస్‌పోర్టు సేవా ఫీజుల్లో 10 శాతం రాయితీ
- బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై 0.5 శాతం అదనపు వడ్డీ, 80 ఏళ్లు దాటితే 1 శాతం వడ్డీ అదనంగా లభిస్తుంది.
- 60 ఏళ్లు పైన వయసు ఉంటే రూ.3లక్షల వరకు 80 ఏళ్లు దాటితే రూ.5లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది.
- హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం తీసుకుంటే సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు ఉంటుంది.

ఏటా ఆగస్టు 21న

ప్రతి సంవత్సరం ఆగస్టు 21న ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ వేడుక మొదటిసారిగా 1991లో భారత ప్రభుత్వం అమలు చేసింది. నిరాదరణకు గురవుతున్న వయోవృద్ధుల కోసం ప్రత్యేక చట్టాన్ని అమలు చేయడంతోపాటు, వారి సంరక్షణ బాధ్యత పిల్లలదే నంటూ న్యాయస్థానాలు వెల్లడించాయి. దీంతో 2025 సీనియర్ సిటిజన్ థీమ్ సమగ్ర భవిష్యత్ కోసం వృద్ధుల స్వరాలను శక్తివంతం చేయడంగా ప్రకటించారు.

● దేశంలో ఎక్కడైనా చెల్లుబాటు

సీనియర్ సిటిజన్ కార్డుతో దేశవ్యాప్తంగా ఎక్కడైనా ప్రభుత్వ సేవలను సులభంగా, వేగంగా పొందవచ్చు. ఈ కార్డు ఉంటే ఇతర గుర్తింపు పత్రాలు చూపాల్సిన అవసరం లేదు. వృద్ధాప్యంలో కన్న బిడ్డల నిరాదరణకు గురైన వారికి, ఎవరూ లేని అనాథ వృద్ధులు. అనాథ ఆశ్రమాల్లో సేవలు పొందేందుకు సైతం ఈ కార్డు ఉపయోగపడుతుంది.

● కార్డు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి ?

డిజిటల్ కార్డుల కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. అలాగే జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ సమయంలో పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్ బుక్, బ్లడ్ గ్రూప్, ఆధార్ హిస్టరీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో కార్డు అందుతుంది. 60 ఏళ్లు దాటిన పురుషులు, 58 ఏళ్లు దాటిన మహిళలు అర్హులు.

సర్టిఫికెట్ల పరిశీలనకు సిద్ధంగా ఉండాలి

ఒంగోలు విద్య, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డీఎస్సీ రాతపరీక్షకు హాజరై మార్కుల వివరాల కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు సిద్ధంగా ఉండాలని డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పాఠశాల విద్యా శాఖ ప్రకటించే మెరిట్ జాబితాలోని అభ్యర్థులు.. పరిశీలనకు సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల మొబైల్‌కు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని మెసేజ్ వస్తుందని పేర్కొన్నారు. వాటి ఆధారంగా అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్లను మూడు సెట్ల జెరాక్స్ కాపీలను అటెస్టేషన్ చేయించుకొని తీసుకురావాలన్నారు.

అభ్యర్థుల్లో అయోమయం

పాఠశాల విద్యాశాఖ తీరుతో డీఎస్సీ అభ్యర్థుల్లో అయోమయం నెలకొంది. ముందస్తు షెడ్యూల్ ఇవ్వకుండా మెసేజ్‌తో నడిపించడంపై నిరసన తెలుపుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇంత గందరగోళ పరిస్థితులులేవని వారు చెప్తున్నారు. టీచర్ల ఎంపికకు సంబంధించి స్పష్టమైన షెడ్యూల్‌ను ముందుగా ప్రకటించి ఆ మేరకు సర్టిఫికెట్ల పరిశీలన వంటి ముఖ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు.

మెరిట్ జాబితా మరింత జాప్యం

ఒంగోలు విద్య, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ మెరిట్ జాబితా ప్రకటనలో జాప్యం జరిగే అవకాశం ఉంది. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు సంబంధించిన వివరాలను క్రీడలశాఖ మంగళవారం పొద్దుపోయిన తర్వాత పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు సమర్పించారు. ఆ జాబితా ప్రకారం స్పోర్ట్స్ కోట అభ్యర్థులకు రోస్టర్ పాయింట్ల కేటాయింపులో జాప్యం జరుగుతోంది. మొదట భావించినట్లుగా 21, 22 తేదీల్లో జాబితా ప్రకటించే అవకాశం లేదు. జిల్లాలో సర్టిఫికెట్ల పరిశీలనకు కమిటీలు బుధవారం విజయవాడలో శిక్షణ ఇవ్వగా మళ్లీ ఈనెల 23వ తేదీన జిల్లాలో వారికి శిక్షణ ఇవ్వనున్నారు. అదే రోజు మెరిట్ జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో సర్టిఫికెట్ల పరిశీలన ఆదివారం చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రహసనంగా డిగ్రీ అడ్మిషన్లు

- జిల్లాలోని అనేక కళాశాలల్లో తరగతులు ప్రారంభం
- తాపీగా ఇప్పుడు ప్రవేశాలకు నోటిఫికేషన్

ఒంగోలు విద్య, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ ప్రహసనంగా మారింది. ఆ అడ్మిషన్లకు సంబంధించి రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉత్తర్వుల కోసం ఎదురు చూడకుండా జిల్లాలోని అనేక ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్మీడియేట్ పాసైన విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చి తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. పొరుగు రాష్ట్ర తెలంగాణాలో జూన్ 30 నాటికి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు పూర్తి కాగా రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది. డిగ్రీ విద్యలో సంస్కరణల పేరుతో కాలయాపన చేసిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఎట్టకేలకు బుధవారం డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి మార్గదర్శకాలను వెబ్‌సైట్‌లో పెట్టింది. అడ్మిషన్లలో సింగిల్ మేజర్ విధానం స్థానంలో డబుల్ మేజర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఉన్నత విద్యా మండలి ప్రయత్నించింది. చివరకు సింగిల్‌మేజర్ విధానాన్ని కొనసాగిస్తూ డిగ్రీ సబ్జెక్టుల కాంబినేషన్‌లో మార్పులు చేశారు. సకాలంలో అడ్మిషన్లు చేసుకోకపోతే విద్యార్థులు ఇతర కోర్సులకు వెళ్తారన్న భావనతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభించారు. ఉన్నత విద్యా మండలి ఉత్తర్వులు లేకపోయినా విద్యార్థులను కళాశాలల్లో చేర్చుకొని రెండు నెలలుగా వారికి తరగతులు నిర్వహిస్తున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించేందుకు ఉన్నత విద్యా మండలి ఉత్తర్వులు ఇచ్చింది. గతంలో అడ్మిషన్లు కేవలం ఆన్‌లైన్‌లోనే నిర్వహించగా ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు స్వీకరించేందుకు అంగీకరించారు. ప్రవేశానికి ఈనెల 20నుంచి 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈనెల 25నుంచి 28వ తేదీ వరకు ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన, విద్యార్థులు తమకు ఏ కళాశాలలో అడ్మిషన్ కావాలో ప్రాధాన్యతా క్రమంలో వెబ్‌ఆప్షన్లు ఈనెల 24నుంచి 28వ తేదీ వరకు పెట్టుకోవచ్చు. 29న వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు అవకాశం ఇచ్చారు. 31న సీట్లు కేటాయించి సెప్టెంబరు 1నుంచి విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయి.

నేటి నుంచి ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో గ్రామసభలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలను సరఫరా చేసేందుకు గురువారం నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రత్యేకంగా సాయంత్రం వేళల్లో ఆయా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకోసం ఎస్సీ రైతులకు 56 గ్రామాలు, ఎస్టీ రైతులకు 11 గ్రామాలను గుర్తించి వందశాతం రాయితీతో డ్రిప్, స్ప్రింకర్లను అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో రైతు సేవా కేంద్రాల ద్వారా 8,915 మంది రైతులు 11,221.02 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింకర్లకు కలెక్టర్ ద్వారా పరిపాలన ఆమోదం తీసుకొని మెటీరియల్‌ను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన, వ్యవసాయశాఖ అనుబంధ శాఖలు, రెవెన్యూ శాఖల సహకారంతో జిల్లాలో రైతులకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో పదివేల హెక్టార్లలో డ్రిప్, స్ప్రింకర్లను సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి



ఎస్పీ దామోదర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఎస్సైలు

ఒంగోలు క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 9 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో సుభాన్ సాహెబ్, కె.మురళీధర్, ఎస్.ఆర్.ఖాశిం షరీఫ్, ఎస్.కె. జిల్లాసాహెబ్, ఐవి. శ్రీనివాసరావు, ఎస్‌కె.బాజీబాబు, ఎస్‌కె.ప్రవీణ్‌షా, వి.కోటేశ్వరరావులు ఉన్నారు. ఉద్యోగోన్నతి పొందిన వారు బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వినాయక మండపాలకు అనుమతులు తీసుకోవాలి

టంగుటూరు/కొండపి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వినాయక మండపాల నిర్వాహక కమిటీలు ముందుగా పోలీస్, రెవెన్యూ, విద్యుత్ శాఖల అనుమతులు తీసుకోవాలని ఎస్సై నాగమల్లేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండపాల వద్ద పెద్ద శబ్దాలు నిషేధమని పేర్కొన్నారు. రాత్రి పది గంటల తర్వాత డీజే సౌండ్స్ సిస్టమ్ ఆపాలని సూచించారు. వలంటీర్లను నియమించుకోవాలని, అశాంతి, అసాంఘిక కార్యక్రమాలను మండపాల వద్ద చేయకూడదని తెలిపారు. నిమజ్జనం సజావుగా జరిగే వరకు ఆయా కమిటీలు బాధ్యత తీసుకుని శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని ఆయన సూచించారు.

ఎంపికైన వారు డాక్యుమెంట్లు ధ్రువీకరించుకోవాలి

ఒంగోలు క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుళ్లుగా ఎంపికైయిన వారు ఈనెల 22వ తేదీన జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే డాక్యుమెంట్లు ధ్రువీకరణకు హాజరు కావాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకోవాలని, దరఖాస్తు చేసిన సమయంలో జత పరిచిన సర్టిఫికెట్లు ఒరిజనల్స్ తీసుకురావాలని తెలిపారు. అన్నీ సర్టిఫికెట్లు మూడు సెట్ల జిరాక్స్ తీయించుకొని గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ తప్పనిసరిగా చేయించాలని పేర్కొన్నారు. పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని చెప్పారు.

బాలికను గర్భవతిని చేసిన యువకుడికి జైలు

ఒంగోలు క్రైం, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి) : మైనర్ బాలికకు వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి గర్భిణిని చేసిన బత్తుల చంటి అలియాస్ విల్సన్‌కు 20 ఏళ్లు జైలుతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ బుధవారం పోక్సో కోర్టు న్యాయాధికారి కె.శైలజ తీర్పు ఇచ్చారు. అదే విధంగా బాధితురాలికి రూ.3లక్షలు, ఆమె బిడ్డకు రూ.3లక్షలు పరిహారం అందేలా చూడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థను ఆదేశించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... కొత్తపట్నం మండలానికి చెందిన మైనర్ బాలికకు అల్లూరుకు చెందిన బత్తుల చంటి అలియాస్ విల్సన్ పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లొంగదీసుకొని గర్భవతిని చేశాడు. ఈమేరకు 2019 ఆగస్టు 6నబాలిక తల్లిదండ్రులు కొత్తపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్లు కారాగార శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తు న్యాయాధికారి తీర్పు నిచ్చారు. బాధితురాలు పక్షాన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు తమ వాదనలు వినిపించారు.

డబ్బు కోసమే బాలిక కిడ్నాప్

- విలేకరుల సమావేశంలో
- మార్కాపురం డీఎస్పీ నాగరాజు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం అనుమలవీడు హైస్కూలులో 4వ తరగతి చదువుతున్న మూడమంచు గురుఅంజలి (8 సంవత్సరాలు) అనే బాలికను డబ్బు కోసమే కిడ్నాప్ చేశారని డీఎస్పీ యు.నాగరాజు చెప్పారు. బుధవారం గిద్దలూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల మేరకు... నిందితులైన ప్రవీణ్‌కుమార్, శివాజీలు వరుసకు సోదరైన గురుదేవి వద్ద ఉన్న కారును రూ.1.70లక్షలకు కొని, మిగిలిన ఫైనాన్స్‌ను ఈఎంఐలు కట్టుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. వారు కారును తీసుకుని హైదరాబాద్ వెళ్లారు. వారు 6 నెలల వరకు ఈఎంఐలు కట్టకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ కారును తీసుకెళ్లిపోయారు. దీంతో ప్రవీణ్, శివాజీ ఆ విషయాన్ని సోదరి గురుదేవికి చెప్పి రూ.1.70లక్షల డబ్బు తిరిగి ఇవ్వాలని అడగడంతో ఆమె తిరస్కరించారు. ఆమె భర్త పాపయ్య సైతం ఆ విషయం తమకు సంబంధం లేదని చెప్పారు. దీంతో నిందితులు ప్రవీణ్, శివాజీలు బావ వద్ద డబ్బు లాగాలని పథకం వేసుకుని గిద్దలూరు వచ్చి ఈనెల 12న ఉదయం సెల్ఫ్ డ్రైవింగ్ పేరుతో కారును బాడుగకు తీసుకుని అనుమలవీడు హైస్కూలు వద్దకు వెళ్లారు. మేనకోడలి వరుసైన గురుఅంజలిని పాఠశాలకు రావడాన్ని చూసిన నిందితులు పాపను పిలిచి కారులో ఎక్కించుకొని ఒద్దులవాగుపల్లి, రంగారెడ్డిపల్లి మీదుగా హైవేకి చేరుకుని అక్కడ నుంచి మార్కాపురం వైపు బయలుదేరారు. బాలిక కనిపించలేదని పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ విషయాన్ని ఎస్ఐ కోటేశ్వరరావు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పీ దామోదర్ వెంటనే నంద్యాల, పల్నాడు, కడప జిల్లాల ఎస్పీలతో మాట్లాడి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న నిందితులు బాలికను దేవరాజుగట్టు ప్రాంతంలో వదిలి మరో మార్గంలో పారిపోయారు. ఈ కేసుకు సంబంధించి రూరల్ సీఐ రామకోటయ్య, రాచర్ల ఎస్సై కోటేశ్వరరావు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టి నిందితులను మంగళవారం గిద్దలూరులోని ప్రతాపరెడ్డి కాలనీలో అరెస్టు చేశారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్సైలను, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



మాట్లాడుతున్న మార్కాపురం డీఎస్పీ నాగరాజు

టీ తాగివస్తానని చెప్పి భర్త పరార్

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఓ వివాహిత
- తెలంగాణలో ఘటన
- పొదిలి పంచాయతీలోని పోతవరం గ్రామానికి చెందిన యువకుడి మోసం

పొదిలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : టీతాగి వస్తానని తెలంగాణ రాష్ట్రం ఆర్మూర్ బస్టాండ్‌లో వదిలేసి పత్తాలేకుండా పోయాడు భర్త. అతని జాడ కోసం తెలంగాణాకు చెందిన ఓ వివాహిత బుధవారం పొదిలి పోలీసులను ఆశ్రయించింది. పొదిలి నగరపంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామానికి చెందిన బత్తుల కార్తీక్ బేల్దారి పనుల నిమిత్తం నిజామాబాద్ జిల్లాకు వెళ్లారు. అక్కడ అనూషతో పరిచయం ఏర్పడింది. ప్రేమించుకొన్నారు. కుటుంబ పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కూలినాలీ చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె గర్భం దాల్చింది. ఇటీవల కార్తీక్ తమసమీప బంధువు వేడుకల్లో పాల్గొనేందుకు భార్యతో సహా దర్శి వచ్చారు. అతని కుటుంబ సభ్యులు ఏదో విధంగా అనూషను వదిలించుకొని వస్తే మరో వివాహం జరిపిస్తామని గట్టిగా పట్టుబట్టారు. దీంతో తల్లిదండ్రుల ఒత్తిడికి తలొగ్గిన కార్తీక్ భార్యతోసహా తిరిగి తెలంగాణా రాష్ట్రానికి పయనమై వెళ్లారు. ఆర్మూర్ బస్టాండ్‌లో టీతాగి వస్తానని చెప్పి భార్యను వదిలేసి పత్తాలేకుండా పోయాడు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆమె తిరిగి అత్తగారి ఊరైన పోతవరం చేరుకుంది. ఇంటికిరాగానే తాళం వేసి ఉండటంతో అవాక్కైన ఆమె అత్తామామలకు ఫోన్ చేసింది. రూ.10లక్షలు తేవాలని వారు ఖరాఖండీగా తేల్చి చెప్పడంతో ఏమిపాలుపోని అనూష బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామని ఎస్ఐ వేమన తెలిపారు.

ఒంగోలు డెయిరీ పునరుద్ధరణపై దృష్టి

- పాడిరైతులతో సమావేశం
- నిర్వహించిన జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్,ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో మూతపడిన ఒంగోలు డెయిరీ పునరుద్ధరణపై ప్రభుత్వం దృష్టిసారించింది. గత ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్‌లు మూతపడిన డెయిరీ పునరుద్ధరణ చేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా పాడిరైతులతో బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాడి రైతులతో పాటు గతంలో పాల ఉత్పత్తిదారుల సహకారసంఘాల అధ్యక్షులుగా పని చేసిన ప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా వారి నుంచి జేసీ అభిప్రాయాలను సేకరించారు.

డెయిరీకి 78.1ఎకరాల భూమి ఉందని, ప్రస్తుతం రూ.43 కోట్లు బకాయిలు ఉన్నాయని సమావేశం దృష్టికి వచ్చింది. డెయిరీ 2021 జనవరి 31న మూతపడటంతో పరికరాలు, మిషనరీలు వాడకపోవడం వల్ల పాడైపోయినట్లు నిర్ధారించారు. కనిగిరిలో 3.8 ఎకరాలు, కంభంలో 5.34ఎకరాలు, కొండమంజులూరులో 12.07 ఎకరాలు, దర్శిలో 4 ఎకరాల్లో పాల శీతలీకరణ కేంద్రాల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని రైతులు జేసీని కోరారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో 2007నుంచి 2012వరకు విజయవంతంగా నడిచినప్పుడు బకాయిలు మాఫీ చేసి లాభాల్లో నడిపిన విషయాన్ని గుర్తు చేశారు. మదర్ డెయిరీ మోడల్ అమలు చేస్తే మంచి ధరలు రైతులకు లభిస్తాయని ఆ దిశగా చర్యలుతీసుకోవాలని జేసీని రైతులు కోరారు.

ఆయా అంశాలపై జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ అన్ని రకాలుగా ప్రయత్నాలు చేసి డెయిరీ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ రవికుమార్, ఒంగోలు డెయిరీ సీఈవో రాజమోహన్, వివిధ ప్రాంతాలకు చెందిన పాడిరైతులు, సంఘాల ప్రతినిధులు మద్దినేని హరిబాబు, అబ్బూరి శ్రీనివాసరావు, బాచిన నాగేశ్వరరావు, కాట్రగడ్డ వెంకట కృష్ణయ్య, నాగినేని అవనీంద్రప్రసాద్, ఉందూరు నాగేశ్వరరావు, చెరుకూరి బోసు, అడకా స్వాములు, ఎం.మధు పాల్గొన్నారు.



పాడిరైతుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

కొండపి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కొండపి గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అరికట్ల రవితేజ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బుధవారం పరామర్శించారు. కట్టావారిపాలెం గ్రామంలోని రవితేజ ఇంటికి వెళ్లిన జనార్దన్ రవితేజ భార్య ఊహను పరామర్శించారు. కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రవితేజ ఇద్దరు కూతుళ్ల జోషిక్శ్రీ, తన్విశ్రీ పేరున రెండు లక్షల రూపాయల డిపాజిట్ చేసిన బాండ్లను అందజేశారు. ఇద్దరు చిన్నారులకు 18 సంవత్సరాలు నిండేసరికి చెరొక ఆరు లక్షల రూపాయల చొప్పున వస్తాయని వివరించారు. రవితేజ పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. జోషిక్శ్రీ, తన్విశ్రీలను చక్కగా చదివించాలని ఊహకు సూచించారు. ప్రభుత్వపరంగా, చిన్నారుల చదువుకు తమవంతు సహకారం అందిస్తానని జనార్దన్ హామీ ఇచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నియోజకవర్గ పరిధిలోని పలువురికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బుధవారం తన నివాసంలో అందజేశారు. రూ.కోటి 7.5 లక్షల చెక్కులను 58 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

నూతన బార్ పాలసీపై సదస్సు


మాట్లాడుతున్న ఈఎస్ ఆయేషాబేగం

చీమకుర్తి, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రూపొందించిన నూతన బార్ పాలసీలో జరిగిన మార్పులు, చేర్పులపై బుధవారం చీమకుర్తిలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఔత్సాహికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషాబేగం మాట్లాడుతూ బార్ లైసెన్స్ ఫీజును ప్రభుత్వం తగ్గించిందన్నారు. అప్లికేషన్ ఫీజు రూ.5లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలను మాత్రమే చెల్లించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఈనెల 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 28న లాటరీ ద్వారా లైసెన్స్‌దారులను ఎంపిక జరుగుతుందన్నారు. లైసెన్స్ దక్కించుకున్నవారు ఏడాది కాలానికి రూ.35లక్షలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. చీమకుర్తిలో ఒక బార్ లైసెన్స్‌కు లాటరీ ద్వారా లైసెన్స్‌దారుడిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ సుకన్య, వైన్స్‌షాపు ఓనర్లు, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కందుకూరు సబ్‌కలెక్టర్


కలెక్టర్ అన్సారియాకు మొక్కను అందజేస్తున్న సబ్‌కలెక్టర్ హిమవంశీ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కందుకూరు సబ్‌కలెక్టర్ డి.హిమవంశీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ అన్సారియాకు మొక్కను అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో జాయింట్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను కూడా ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉత్సాహంగా రైతు కృతజ్ఞతా ర్యాలీ


ర్యాలీగా వెళుతున్న ట్రాక్టర్లు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం ద్వారా సీఎం చంద్రబాబునాయుడు రైతుల ఖాతాల్లో నగదు చేయడంపై కృతజ్ఞతగా ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని రైతులు బుధవారం కొప్పోలు చెరువు వద్ద నుంచి కొత్తపట్నం వరకు ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఒంగోలు మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులు తమ ట్రాక్టర్‌తో కొప్పోలు చెరువు కట్ట వద్దకు చేరుకుని అక్కడ నుంచి కొత్తపట్నం వరకు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లపై కూటమి పార్టీల జెండాలను ఏర్పాటు చేసి రైతులు ఉత్సాహంగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలవరపు వెంకట్రామయ్య, టీడీపీ మండల నాయకులు జి.శ్రీనివాసులు, నలమోతు బాలగంగాధర్, మక్కెన శ్రీనివాసరావు, యర్రంనేని నరసింహారావు, చుంచు శింగయ్య, వలేటి రాంబాబు, గడ్డె వెంకటకృష్ణ, చేజర్ల శ్రీనివాసరావు, చప్పిడి శేషయ్య పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు


శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం ఒంగోలు నగరంలో శ్రీకృష్ణ భగవానుడి విగ్రహాన్ని భక్తులు అంగరంగ వైభవంగా ఊరేగించారు. స్థానిక నెహ్రూనగర్ కాలనీ నుంచి ప్రారంభమైన ఊరేగింపు పలువీధులలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత ఉచ్చారణతో భక్తులు ఊరేగింపులో పాల్గొన్ని పరవశించి పోయారు. నెహ్రూనగర్‌లో ఈనెల 16నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదోరోజుల పాటు భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించి చేసి చివరిరోజు స్వామి వారి విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మునగపటి సుబ్బారావు, స్రవంతి, సురేష్, మాధవీలత, సుబ్బయ్య, కృష్ణ, శ్రీనివాసరెడ్డి, కాల శ్రీవాసులు తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడిచెత్తలపై ప్రజలకు అవగాహన


కరపత్రాన్ని అందజేస్తున్న డీపీవో వెంకటనాయుడు

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): తడిచెత్త, పొడిచెత్తను ఇళ్లలోనే వేరుగా డబ్బాల్లో వేసే విధానంపై అవగాహన కలిగిస్తూ ప్రచురించిన కరపత్రాలను డీపీవో జి.వెంకటనాయుడు జరుగుమల్లిలో ఇంటింటికీ తిరిగి బుధవారం ప్రచారం చేశారు. తడిచెత్త, పొడిచెత్తలను వేరు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను స్థానికులకు ఈ సందర్భంగా ఆయన వివరించారు. తడిచెత్తను వర్మి కంపోస్టుగా మార్చి తిరిగి భూమికి ఎరువుగా మార్చి అందించవచ్చని డీపీవో తెలిపారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఉప మండల పరిషత్ అధికారి కామేశ్వరరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి విద్యుల్లత పాల్గొన్నారు.

రేపు అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ

నాగులుప్పలపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ప్రజాప్రతినిధులకు పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ 2.0)పై ఈ నెల 22న నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిక్షణ లో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

అదనపు పొగాకుపై పెనాల్టీ లేకుండా చేయాలి

● రైతుల ఏకగ్రీవ తీర్మానం


రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న వేలం నిర్వహణాధికారి తులసి

ఒంగోలు(రూరల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అదనంగా పండించిన పొగాకు అమ్మకాలకు బోర్డు ఎలాంటి పెనాల్టీలు విధించకుండా కొనుగోలు చేయాలని రైతులు ఏకగ్రీవంగా తీర్మానించారు. బుధవారం ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో వేలం నిర్వహణాధికారి జె.తులసి అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి పొగాకు ఉత్పత్తి చేశారని, అయితే గిట్టుబాటు ధరలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు పొగాకు పేరుతో పెనాల్టీలు వేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, అందువల్ల పెనాల్టీలు లేకుండా చూడాలని కోరారు. బ్యారన్‌ల రిజిస్ట్రేషన్ విధానంలో కొన్ని మార్పులు చేర్పులు చేయాలని కోరారు. వృద్ధులైన రైతులు వ్యవసాయం చేసే పరిస్థితి ఉండదని, అలాంటి వారికి మూడేళ్లలో ఎప్పుడైనా ఎవరికైనా బ్యారన్ అమ్మకాలు చేసుకునే సౌలభ్యం కల్పించాలన్నారు. కౌలురైతులకు కూడా సానుకూలంగా ఉండే మార్పులు చేయాలని కోరారు. అనతరం వేలం నిర్వహణాధికారి తులసి మాట్లాడుతూ పొగాకు రైతులు బోర్డు నియమాలను తప్పక పాటించాలని స్పష్టం చేశారు. పంట నియంత్రణ పాటించాలన్నారు. పొగనారు కొనుగోలు సమయంలో తప్పక రశీదు పొంది దానిని బోర్డులో ఇవ్వాలని కోరారు. బ్యారన్‌కు 4.75 ఎకరాల్లో మాత్రమే పొగాకు సాగు చేయాలని, పంట ఉత్పత్తి కూడా 35క్వింటాల 65కేజీలకు మాత్రమే బోర్డు అనుమతి ఇచ్చిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న గిరాకీని బట్టి పొగాకు ధరలు ఉంటాయనే విషయాన్ని రైతులు తప్పక తెలుసుకోవాలన్నారు. ఈ ఏడాది పొగాకు బోర్డు ద్వారా ఎరువులు సరఫరా చేయటం లేదన్నారు. కార్యక్రమంలో బోర్డు సభ్యులు పొద వరప్రసాద్, రైతు నాయకులు వడ్డెళ్ల ప్రసాద్, పోలవరపు వెంకటరామయ్య, పెనుబోతు సునీల్, యర్రంనేని వెంకటశేషయ్య, బండారు రామాంజనేయులు, దుగ్గినేని మల్లికార్జునరావు, వలేటి రాంబాబు, దొడ్డా సీతారామయ్య, చెరుకూరి వాసుబాబు, పి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహ భూమిపూజ అడ్డగింత

● స్థానికుల అభ్యంతరం


నాయకులతో మాట్లాడుతున్న స్థానికులు

ఒంగోలు క్రైం, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో కాంగ్రెస్ పార్టీ రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు భూమిపూజ చేయగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కబాడీపాలెంలో గల రోడ్డు మధ్యలో గతంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఉండేది. అయితే అక్కడ విగ్రహం ఉన్నందున తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేషన్ అధికారులు దానిని అక్కడి నుంచి తొలగించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఆందోళనకు దిగడంతో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని రోడ్డుకు అడ్డుగా లేని చోట అదేప్రాంతంలో ఏర్పాటు చేస్తామని కార్పొరేషన్ అధికారులు అప్పట్లో హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో అధికారికంగా రాజీవ్‌గాంధీ జయంతి రోజు విగ్రహానికి భూమిపూజ జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రకటించారు. అయితే కార్పొరేషన్ అధికారులు ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా నేతృత్వంలో భూమిపూజ నిర్వహించారు. దీంతో స్థానిక యువకులు దీనిని అడ్డుకున్నారు. ఇక్కడ విగ్రహం ఏర్పాటుకు అవకాశం లేదంటూ అక్కడ ఏర్పాటు చేసిన రాళ్ళను తొలగించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సైదా మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు రాజ్‌విమల్ ఆధ్వర్యంలో అడ్డుకోవడం సరికాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అనుమతితో అధికారులు టెండర్ పిలిచి రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. అయితే మాజీ ప్రధాని విగ్రహం ఏర్పాటుకు ఆటకం కలిగించడం సరైన చర్య కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు కైపు వెంకటకృష్ణారెడ్డి, శ్రీపతి సతీష్, మన్నం ప్రసన్నరాజు, తురకపల్లి నాగలక్ష్మి తదితరుల పాల్గొన్నారు.

ప్రకృతి సంపదను కార్పొరేటర్లకు దోచిపెడుతున్న కేంద్రం

మోదీ పాలనపై సాహితీవేత్త జయరాజ్ ధ్వజం ● ఒంగోలులో ఘనంగా ప్రారంభమైన కళా ఉత్సవాలు


సభలో ప్రసంగిస్తున్న జయరాజ్, వేదికపై నల్లూరి వెంకటేశ్వర్లు


నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సంపదను కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు దోచిపెడుతోందని, ప్రధాని మోదీ చౌకీదార్ కాదని, చోర్‌దార్ అని ప్రముఖ గాయకుడు, సాహితీవేత్త జయరాజ్ ఆరోపించారు. ఏపీ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో సీపీఐ 18వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని ఒంగోలులో ఏర్పాటు చేసిన కళా ఉత్సావాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణంలో జరిగిన మొదటి రోజు కార్యక్రమానికి ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ అధ్యక్షత వహించగా, జయరాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచలోని అన్ని దేశాలలో ధనిక, పేద వర్గం అనేవి రెండుగా ఉన్నాయన్నారు. ఆయా దేశాల్లో సమసమాజం నిర్మించడం కమ్యూనిస్టులకు పోరాట మార్గం కొంతమేర అనువుగా ఉందని, అయితే భారతదేశంలో కమ్యూనిస్టులకు పేద, ధనిక వర్గాలతోపాటుగా కులం, మతం పెద్ద అడ్డుగోడలుగా నిలిచాయని చెప్పారు. ఇలాంటి సమాజంలో కమ్యూనిస్టు పార్టీలు పేదలను చైతన్య పరుస్తున్నాయని చెప్పారు. సీపీఐ ఒకవైపు పార్టీగా పోరాటాలు సాగిస్తూ, మరోవైపు ప్రజలను చైతన్యపరుస్తూ ముందుకు సాగడం అభినందనీయం అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశ చరిత్రలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం అన్నారు. ప్రజల హక్కులు, కార్మిక చట్టాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. దర్శకులు టి.కృష్ణ, నటులు మాదాల రంగారావు, సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్, బాబ్జీ, అజయ్ ఘోష్ వంటి ఎంతోమంది కళాకారులను సినిరంగానికి పరిచయం చేసిన ఘనత నల్లూరి వెంకటేశ్వర్లుకు, ప్రజానాట్యమండలికి దక్కుతుందన్నారు. ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ కళ కళ కోసం కాదు.. ప్రజల కోసమని చాటి చెప్పింది కమ్యూనిస్టు పార్టీ అన్నారు. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి.

ఎల్‌ఐసీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● ఏజెంట్లు డిమాండ్



ధర్నా చేస్తున్న ఏజెంట్లు

ఒంగోలు(రూరల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీ యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏజెంట్లు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఒంగోలులోని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసీ ఏజెంట్ల సంఘ నాయకులు మాట్లాడుతూ ఏజెంట్‌లకు 85 సంవత్సరాల వరకు గ్రూప్ ఇన్సూరెన్స్ ఇస్తామన్నా హామీని అమలు చేయాలన్నారు. అలాగే పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పాలసీల ప్రీమియంలపై వేసిన పన్నులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెంట్ల కమీషన్‌పై ప్రొఫెషనల్ టాక్స్‌ను విరమించుకోవాలని కోరారు. ఎల్‌ఐసీ సంస్థను నీరుగార్చే విధానాలు ప్రభుత్వాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.తిరుపతి నాయుడు, బి.వెంకట్రావు, సీహెచ్‌వీ.సుబ్బారెడ్డి, పి.ఆంజనేయులు, కె.వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీనివాసరావు, డి.పురుషోత్తం, బి.కృష్ణమూర్తి, సీహెచ్.నరసింహారావు, బి.మురళి, కె.ఈశ్వరమ్మ, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతల పాడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన పనులపై బుధవారం సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని, తాగునీటి ఇక్కట్లు లేకుండా చూడాలని, వాటర్ ట్యాంకులను ఎప్పటికపుడు పరిశుభ్రం చేయాలన్నారు. అదేవిధంగా డ్వాక్రా గ్రూపులకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయాన్ని లక్ష్యం ప్రకారం అందించాలని, ఉన్నతి, స్త్రీనిధి పథకాల ద్వారా రుణాలు పొందిన వారు ఎప్పటికపుడు బ్యాంకుల్లో చెల్లించాలని తెలిపారు. ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన సోక్‌పిట్లు, ఫారంపాండ్స్, హార్టికల్చర్ పనులను పూర్తిచేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేయించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. చెత్తసేకరణ కూడా ప్రతీరోజు చేపట్టాలని, ఆయా గ్రామాల్లో చెత్తసంపద తయారీ జరగాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యూస్, ఉపాధిహామీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులోని గుండ్లకమ్మ ప్రాజెక్టు-1 కార్యాలయంలో రండీ టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ఆర్థికపరమైన అంశాలపై చర్చించారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్‌తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి వరకుమార్, కోశాధికారి రంగారెడ్డి, ప్రతినిధులు సురేష్‌బాబు, వెంకటేశ్వరరావు, రాంభూపాల్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ ఉద్యోగులు ఏసురత్నం, అంకబాబు, సునీల్, సుమతి, ప్రసన్న, సరస్వతి, రామాంజనేయులు, విజయ్, పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై దృష్టి సారించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

సంతనూతలపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణపై జిల్లా మలేరియా అధికారి మధుసూదనరావు, అసిస్టెంట్ మలేరియా అధికారి పి.శ్రీనివాసరావులు బుధవారం సంతనూతలపాడులో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో దోమలనివారణ చర్యల గురించి ర్యాలీ నిర్వహించారు. ఇళ్ల సమీపంలో పాతటైర్లలో, తాగి పడేసిన కొబ్బరిబొండాల్లో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. అలాగే దోమతెరలను వినియోగించాలని డాక్టర్ సుధామణి తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది సాగర్, సీహెచ్‌వో మాధవరావు, హెచ్ఎస్ కృష్ణ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. ముగ్గురికి గాయాలు

ఒంగోలు క్రైం, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ముగ్గురు విద్యార్థులు ద్విచక్రవాహనం నడుపుతూ ముందు వెళుతున్న మరో మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టారు. దీంతో ఇద్దరు విద్యార్థులు, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఒంగోలు నగరం వెంగముక్కపాలెం జంక్షన్ వద్ద బుధవారం జరిగింది. ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న హేమంత్, జయసూర్య, ఆనంద్‌లు తమ స్నేహితుడి ద్విచక్రవాహనం తీసుకుని వెళ్లి పూటుగా మద్యం తాగారు. అనంతరం నగరంలోని పలు వీధుల్లో విన్యాసాలు చేసుకుంటూ వాహనాన్ని నడిపారు. అయితే వెంగముక్కపాలెం జంక్షన్ వద్ద ఓ డిగ్రీ కళాశాలకు చెందిన సిబ్బంది మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా వెనుక నుంచి విద్యార్థులు ఢీకొట్టారు. దీంతో విద్యార్థులు హేమంత్, జయసూర్య, అలాగే మరో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగ్రాతులను 108 వాహనంలో ఆసుపత్రికి పంపిచారు. అయితే హేమంత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు తాలుకా పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి అక్కడ ఉన్న ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

విధులకు ఆటంకం కలిగించాడని కేసు నమోదు

నాగులుప్పలపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించాడంటూ యువకుడిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రేమ వివాహం చేసుకున్న యువకుడికి కోసం మంగళవారం నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన చినగంజాం గ్రామంలోని మార్కెట్ సెంటర్‌కు చెందిన సూదనగుంట ప్రేమ్‌కుమార్ అనే యువకుడు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడు. దూషించి విధులకు ఆటంకం కలిగించడంతో కానిస్టేబుల్ వెంకటేష్ ఫిర్యాదు మేరకు సదరు యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రజియాసుల్తానా తెలిపారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

నాగులుప్పలపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో కండ్లగుంట గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సదర్భంగా 260 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు వైద్యశాల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు.

వినాయక మండపాలకు అనుమతులు తీసుకోవాలి

టంగుటూరు (కొండపి), ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహక కమిటీలు ముందుగా పోలీస్, రెవెన్యూ, విద్యుత్‌శాఖల అనుమతులు తీసుకోవాలని టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండపాల వద్ద పెద్ద శబ్దాలు నిషేధమన్నారు. రాత్రి పది గంటల తర్వాత డీజే సౌండ్ సిస్టమ్ ఆపాలని సూచించారు. నిమజ్జనం సజావుగా జరిగే వరకు ఆయా కమిటీలు బాధ్యత తీసుకుని శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని సూచించారు.

సుఖవ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

నాగులుప్పలపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సుఖవ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థ సూపర్‌వైజర్ వినయ్ సూచించారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్, ఏపీ సాక్స్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో అమ్మనబ్రోలులో జడ్పీ హైస్కూలు విద్యార్థులకు హెచ్‌ఐవీ, సుఖవ్యాధుల సంక్రమణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యవతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల నడక గస్తీ


విచారిస్తున్న సీఐ శ్రీకాంత్, ఎస్ఐ రజియాసుల్తానా

నాగులుప్పలపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలో రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా బుధవారం రాత్రి పోలీసులు నడక గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధులలో సీఐ శ్రీకాంత్, ఎస్ఐ రజియాసుల్తానా సిబ్బంది నడుస్తూ గస్తీ చేపట్టారు. ఈక్రమంలో పలు ఇళ్ల వద్ద మాట్లాడారు. అనుమానితులను విచారించారు.

దబోల్కర్‌కు నివాళులు


మాట్లాడుతున్న బేగ్

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ హేతువాద సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రముఖ హేతువాది, రచయిత నరేంద్ర అచ్యుత్ దబోల్కర్ వర్ధంతి జిల్లా అధ్యక్షుడు శిఖా చంద్రశేఖర్‌బాబు అధ్యక్షతన ఒంగోలులో నిర్వహించారు. ఈ సభలో హేతువాద సంఘం నాయకుడు ఎంకే.బేగ్ మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం శృతిమించి ఉందని, ఈ విధానం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. డాక్టర్ దబోల్కర్ ప్రజా వైద్యునిగా, నిరంతరం ప్రజలను మూఢనమ్మకాల నుంచి విముక్తి చేసేందుకు పాటుపడ్డారని చెప్పారు. మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం కావాలని చేస్తున్న పోరాటాన్ని సహించలేని మతోన్మాదులు దబోల్కర్‌ను కాల్చి చంపారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రావు, రంగారెడ్డి, ప్రభుదాస్, సుభాని, పేరయ్య, గుమ్మళ్ల నరసింహరావు, వీరాంజనేయులు, ఉప్పుటూరి ప్రకాశరావు, దూళ్ళ అప్పారావు, పవన్‌కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో కూరగాయల సాగు


కూరగాయల సాగు చేపడుతున్న సిబ్బంది

కొండపి, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): కొండపిలోని అంబేడ్కర్ బాలికల గురుకులంలోని ఖాళీ స్థలంలో ఏటీఎం పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరల సాగును బుధవారం ప్రకృతి వ్యవసాయం అధికారులు ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎం సుభాషిణి ఆధ్వర్యంలో సిబ్బంది విత్తనాలను విత్తారు. దీని ప్రధాన ఉద్దేశం విద్యార్థులకు రసాయనాలు లేని కూరగాయలతో చేసిన ఆహారాన్ని అందించి వారికి అవగాహన కల్పించడమని అన్నారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ వైస్ చైర్మన్ మార్బూరి వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి సాగులో మెలకువలు పాటించాలి

ఒంగోలు(రూరల్), ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వరి మెట్ట పంట సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఏవో రమేష్‌బాబు సూచించారు. బుధవారం కొప్పోలు, ఎన్.అగ్రహారం గ్రామాల్లో పొలంపిలుస్తోంది నిర్వహించారు. ముందుగా దుక్కిలో ఎలాంటి కలుపు లేకుండా చేసుకోవాలని, ఎరువులు కూడా వేయాలని చెప్పారు. కార్యక్రమంలో కాట్రగడ్డ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాశినాయనకు పూజలు

గిద్దలూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలో బుధవారం కాశినాయనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం దాతల సహకారంతో భక్తులకు, పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దేవస్థాన కమిటీ ప్రతినిధులు, దాతలతోపాటు యోగా గురూజీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతి బరిలో తెలుగు వ్యక్తి గర్వకారణం

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఉపరాష్ట్రపతి బరిలో తెలుగు వ్యక్తి ఉండడం గర్వకారణమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు సయ్యద్ జావీద్ అన్వర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తెలుగు రాష్ట్రాలకు చెందిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరు ఖరారు చేయడం తెలుగు జాతి ప్రజలకు గర్వకారణం అన్నారు. రాజకీయాలకు అతీతంగా సుదర్శనరెడ్డికి మద్దతుగా నిలవాలన్నారు.

1,484 పాసు పుస్తకాలు

- రాజముద్రతో భూ యాజమాన్య హక్కు పత్రాలు సిద్ధం
- త్వరలో పంపిణీ
- రైతుల హర్షం

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల భూములకు సంబంధించి కీలకమైన పట్టాదారు పాసు పుస్తకాలకు రాజముద్ర పడింది. ఈ మేరకు రాజముద్రదతో కూడిన పుస్తకాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. వైసీపీ పాలనలో రీ-సర్వే ప్రారంభించి రైతుల భూ హక్కు పత్రాలను జగన్ ఫొటోతో పంపిణీ చేసిన విషయం తెలిసిందే. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మా భూముల హక్కు పత్రాలు, పాసు పుస్తకాలపై జగన్ ఫొటో ఏంటని పెద్ద ఎత్తున రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి రాగానే రైతుల పాసుపుస్తకాలకు రాజముద్రతో ముద్రించి ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు జగన్ ఫొటోతో ఉన్న పాసు పుస్తకాలను రద్దు చేశారు. వాటి స్థానంలో రాజముద్రతో కొత్త పుస్తకాలను ముద్రించారు. కొత్త పుస్తకాలు రెవెన్యూ కార్యాలయాలకు ఇప్పటికే చేరాయి. అందులో భాగంగా ఎర్రగొండపాలెం మండలంలో మొత్తం



రెవెన్యూ కార్యాలయాలకు చేరిన రాజముద్రతో ఉన్న పుస్తకం

1,484 పాసుపుస్తకాలు కార్యాలయానికి వచ్చినట్లు తహసీల్దార్ మంజునాథరెడ్డి తెలిపారు.

పలు గ్రామాలకు వచ్చిన పుస్తకాలివి

లింగవానిపల్లి గ్రామానికి 104, రాయవరానికి 252, బోయలపల్లికి 110, కటారువానిపల్లికి 166, కొలుకుల 704, లాలాపురానికి 148 మొత్తం 1,484 పుస్తకాలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. వాటిని త్వరలో రైతులకు నేరుగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దోమల పెరుగుదల ప్రమాదకరం

గిద్దలూరు టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవాళికి దోమల పెరుగుదల ఎంతో ప్రమాదకరమని గిద్దలూరు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఐ.రమేష్ అన్నారు. బుధవారం ప్రపంచ దోమల నిర్మూలన దినం సందర్భంగా పట్టణంలోని కోటగడ్డ అర్బన్ హెల్త్ సెంటర్ ఉంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దోమలు కుడితే మలేరియా, డెంగ్యూ, బోదకాలు, గున్యా, మెదడువాపు వంటి ప్రమాదకర జబ్బులు వ్యాపిస్తాయని తెలిపారు. దోమల పెరుగుదలకు కారణమైన ఇంటి పరిసరాలలో వృథా నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమతెరలను వాడుకోవాలని, కిటికీలకు మెస్‌లు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సూర్యచంద్ర, సూపర్‌వైజర్ ఎం.వి.సుధారాణి, హెల్త్ అసిస్టెంట్లు బి.శ్రీనివాసులు, గజ్జా వెంకటేశ్వర్లు, రాజు పారామెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రెండు చెక్‌బౌన్స్ కేసుల్లో ఒక వ్యక్తికి సంవత్సరం జైలు శిక్ష, రూ.3లక్షలు నెల రోజుల్లో చెల్లించాలని, లేనిపక్షంలో అదనంగా మరో నెల రోజులు జైలు శిక్ష అనుభవించాలని అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి కె.భరత్‌చంద్ర తీర్పునిచ్చారు. అందిన సమాచారం మేరకు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న పాలపర్తి వెంకటరమేష్‌బాబు గిద్దలూరు పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన మునగనూరి రంగ వెంకట శివకుమార్ వద్ద రూ.2లక్షలు, అలాగే రూ.లక్ష చేబదులుగా తీసుకున్నారు. తిరిగి చెల్లించే క్రమంలో రమేష్‌బాబు శివకుమార్‌కు 2 చెక్కును ఇచ్చారు. శివకుమార్ 2021లో బ్యాంక్ అకౌంట్‌లో డిపాజిట్ చేయగా డబ్బులు లేనందున ఆ చెక్కులు చెల్లలేదు. వెంటనే శివకుమార్ గిద్దలూరు క్రిమినల్ కోర్టులో చెక్‌బౌన్స్ కేసులను ఫైల్ చేశారు. విచారణ అనంతరం బుధవారం న్యాయాధికారి భరత్‌చంద్ర తీర్పు ఇచ్చారు.

అధికారులపై దాడికి ఖండన

కంభం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా శిఖరం అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ సిబ్బందిపై శ్రీశైలం ఎమ్మెల్యే, వారి అనుచరులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు సంఘం తాలూకా అధ్యక్షుడు ముక్కు ప్రసాదరెడ్డి ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉండాల్సిన వారే ఇలా దాడులు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ తాలూకా కార్యదర్శి రంగస్వామి రెడ్డి, ట్రెజర్ వెంకట రంగయ్య, అటవీశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏలియాకు సాయమందించిన టీడీపీ నేతలు



ఏలియాను పరామర్శిస్తున్న నేతలు

రాచర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఏలియాకు టీడీపీ నాయకులు బుధవారం ఆర్థిక సాయాన్ని అందించారు. ఫారం గ్రామానికి చెందిన నల్లగొండ ఏలియా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న రాచర్ల సొసైటీ బ్యాంక్ చైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కటిక యోగానంద్ పరామర్శించి రూ.5వేల సాయాన్ని అందించారు.

రాష్ట్ర మహాసభల్లో ప్రజా సమస్యలపై చర్చ

త్రిపురాంతకం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభల్లో ప్రజా సమస్యలపై చర్చిస్తారని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. బుధవారం త్రిపురాంతకంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాస్, రామయ్య, ఖాశిం, ఆంజనేయులు పాల్గొన్నారు.

బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలి



ప్రయాణికులతో మాట్లాడుతున్న శోభామంజరి

పొదిలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ టీ శోభామంజరి అన్నారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. అనంతరం స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలతో మాట్లాడారు. బస్టాండ్‌లో తాగునీటి వసతులు మెరుగుపరచాలని చెప్పారు. బస్సుల ఫిట్‌నెస్ గురించి గ్యారేజీలో కార్మికులతో మాట్లాడారు. బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా బస్సుల ఫిట్‌నెస్‌తోపాటు సిబ్బంది ప్రవర్తన మారాలన్నారు. డీఎం కార్యాలయంలో పలురకాల సిబ్బందితో మాట్లాడారు. ఆమె వెంట డీఎం శంకరరావు, సీఐ ధనలక్ష్మి ఉన్నారు.

35 గోవా మద్యం బాటిళ్లు సీజ్



గోవా మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ అధికారులు

కంభం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఓ వ్యక్తి అక్రమంగా గోవా మద్యం బాటిళ్లు కలిగి ఉండగా, అతనిని అదుపులోనికి తీసుకొని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. నెహ్రూ నగర్‌లో నివశిస్తున్న కవలకుంట్ల నరేష్ అనే వ్యక్తి గోవా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో అతని ఇంటిపై దాడి చేశామని సీఐ చెప్పారు. అర్ధవీడు మండలం పోతురాజుటూరు గ్రామానికి చెందిన నరేష్ 35గోవా మద్యం బాటిళ్లను కలిగి ఉండగా గుర్తించి అతనిపై కేసు నమోదు చేశామని, ఎవరైనా ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం సీసాలు అమ్మినా, బెల్టుషాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం తరలించినా, కలిగి ఉన్నా ఎక్సైజ్ వారికి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

హెచ్‌ఐవీకి నివారణ ఒక్కటే మార్గం

గిద్దలూరు టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీకి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అన్నారు. పట్టణంలోని రాచర్ల గేటు వద్ద హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సమగ్ర ఐఈసీ ప్రచార రథాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తూ సూచనలు, జాగ్రత్తలను వివరించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల చిన్నచూపు, వివక్ష చూపవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయకుమారి, ఓఆర్‌డబ్ల్యూ భవాని, రిబ్కా, సునీత, కరుణ పాల్గొన్నారు.

అదనపు బస్సులు నడపాలి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు, జనసేన పార్టీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి తర్లుపాడు మీదుగా కంభం, కనిగిరికి అదనపు బస్సులు నడపాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులకు తర్లుపాడు జనసేన పార్టీ నాయకులు, విద్యార్థులు వినతిపత్రం అందించారు. మార్కాపురం నుంచి తర్లుపాడు మీదుగా కంభం, మార్కాపురం నుంచి తర్లుపాడు మీదుగా తాడివారిపల్లి, కనిగిరికి అదనంగా బస్సులు నడిపి ప్రయాణికుల అవస్థలు తీర్చాలన్నారు. గతంలో చెన్నారెడ్డిపల్లె, కంభంలకు కూడా చాలా సర్వీసులు నడిపేవారని, ప్రస్తుతం ఆ సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమీక్షించి అదనపు బస్సులు నడుపుతామని డీఎం తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న సత్యనారాయణ

తర్లుపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రామారావు, అజయ్ కుమార్, మై భారత్ కోఆర్డినేటర్ వెంకట కాశయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సంస్కరణలతో నూతన ఆవిష్కరణలు

గిద్దలూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కొత్త విషయాలు, సంస్కరణల పట్ల ఆసక్తిని అభివృద్ధి చేస్తే నూతన ఆవిష్కరణలు మరిన్ని వస్తాయని జేవీవీ రాష్ట్ర నాయకుడు పి.స్వరూపారెడ్డి అన్నారు. పట్టణంలోని సాయి ఒకేషనల్ కళాశాల ఆవరణలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ శాస్త్రీయ దృక్పథపు దినోత్సవాన్ని నిర్వహించారు. సాయి ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్క విషయంలో ఎప్పుడు, ఏమిటి, ఎందుకు, ఎలా అని ప్రశ్నిస్తూ పోతే అపోహలు, మూఢనమ్మకాలు పోతాయన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు వెంకటేశ్వర్లు, కళాశాల డైరెక్టర్ శివశంకర్‌రావు పాల్గొన్నారు.

కొమరోలు వాసికి డాక్టరేట్

కొమరోలు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు న్యాయ సేవ లు అందిస్తున్న న్యాయ సలహాదారుడి కొమరోలు గ్రామానికి చెందిన సయ్యద్ అబ్దుల్ ఖాదర్ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఖాదర్ ఐదేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో న్యాయ సలహాదారుడిగా పేద ప్రజలకు న్యాయ సేవలు అందిస్తున్నారు. ఈ సేవలకు గాను లెజెండరీ పీస్ అవార్డు కౌన్సిల్ వారు ఢిల్లీలో డాక్టరేట్ అవార్డును బుధవారం అందజేశారు.



అబ్దుల్ ఖాదర్‌కు డాక్టరేట్‌ను అందజేస్తున్న ప్రతినిధులు

విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

వినాయక చవితి ఉత్సవాలపై సీఐ సుబ్బారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం సర్కిల్ పరిధిలో వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేసుకునే భక్తులు తప్పకుండా పోలీసు శాఖ అనుమతులు పొందాలని సీఐ పి.సుబ్బారావు అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించి ఆ శాఖ నుంచి అనుమతి పొందాలన్నారు. ఆ శాఖ అధికారులు సూచించే విధంగా సురక్షితమైన చర్యలు తీసుకోవాలన్నారు. మైక్ పర్మిషన్ తప్పనిసరి అన్నారు. ఇష్టారీతిన పెద్దపాటి సౌండ్‌లు ఏర్పాటుచేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయకూడదన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యుల పూర్తి సమాచారం ముందుగా పోలీసులకు ఇవ్వాలన్నారు. ఎన్ని రోజులు విగ్రహం ఏర్పాటు చేస్తారో తెలిపాలన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో అన్ని అంశాలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని లిఖిత పూర్వకంగా అందించాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలను కూడా తప్పక ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా మత విద్వేశాలను రెచ్చగొట్టేందుకు దుశ్చర్యలకు పాల్పడితే ఆధారంగా ఉంటుందన్నారు. రాత్రి వేళల్లో మండపాల వద్ద తప్పక ఒక్కరైనా కాపలాగా పడుకోవాలన్నారు. నిమజ్జనం రోజున ఎటువంటి డీజేలు ఏర్పాటు చేయడానికి వీల్లేదన్నారు. మద్యం సేవించి గొడవలు పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో టౌన్, రూరల్ ఎస్సైలు ఎ సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, అంకమ్మరావులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : వినాయక చవితి పండుగ సందర్భంగా గణేశుని మండపాలను ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ పీ చౌడయ్య ఉత్సవ కమిటీలకు సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆగస్టు 27 నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండపాల వద్ద, నిమజ్జనాలకు మైకులు, డీజే సౌండ్స్ ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలన్నా రు. పర్మిషన్ లేకుండా మైలుకు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.



గీత కార్మికులు, వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ

గీత కార్మికులకు రెండు బార్లు

26లోపు దరఖాస్తు చేసుకోవాలి : ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి

మార్కాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంలో గీత కార్మికుల కోసం ఎక్సైజ్ శాఖ రెండు బార్ అండ్ రెస్టారెంట్లు కేటాయించినట్లు సీఐ ఎం.వెంకటరెడ్డి అన్నారు. ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో బుధవారం గీత కార్మికులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఐదు బార్‌లకు జనరల్ కేటగిరీలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మరో రెండు బార్లను గీత కార్మికుల కోసం ఇక్కడకు కేటాయించారన్నారు. ఈ బార్లకు దరఖాస్తు చేసుకునే వాళ్ల రూ.5లక్షల నాన్ రిఫండబుల్ ఫీజుతోపాటు మరో రూ.10వేలు ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 30న జిల్లా కలెక్టర్ లాటరీ ద్వారా బార్లు కేటాయిస్తారన్నారు. గీత కార్మికులకు సంబంధించిన బార్లకు లైసెన్స్‌కు సంవత్సరానికి రూ.27.50లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మూడు సంవత్సరాలపాటు ఈ లైసెన్స్ రెన్యువల్ అవుతూనే ఉంటుందన్నారు. గీత కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్సై గోపాలకృష్ణ, సిబ్బంది. గీత కార్మికులు, వ్యాపారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

మార్కాపురం రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని ఎంపీడీవో శ్రీనివాసులు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండలంలోని సచివాలయ, ఇతర శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలు సకాలంలో అందేలా చూడాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సర్వేలను సమగ్రంగా సకాలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాలు పడుతున్న క్రమంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముండడంతో వైద్య అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో నాగరాజు, వెలుగు ఏపీఎం పిచ్చయ్య, పీఆర్ఏఈ మోహన్‌రాజ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

ఎర్రగొండపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.15వేల విలువైన ప్రింటర్‌ను హెచ్‌ఎం నాగరాణికి ఉపాధ్యాయుడు వీరాచారి బహూకరించారు. అతనిని హెచ్‌ఎం, సిబ్బంది అభినించారు.

పంటలకు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి



బొందలపాడులో పొలాన్ని పరిశీలిస్తున్న ఏవో బుజ్జిబాయి

గిద్దలూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంగళవీడు, పొదలకొండపల్లి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి ఎం.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు జరుగుతున్నదని పేర్కొన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను రైతులు వెంటనే ఈ క్రాపింగ్ చేయించుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవ నగదు జమలు కాని రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదించి మీకోసంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ప్రీమియాన్ని చెల్లించేందుకు ఈనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించిన దృష్ట్యా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం నువ్వు పంటను పరిశీలించి చీడపీడలు, నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శ్రీనివాసరెడ్డి, సురేఖ పాల్గొన్నారు.

రాచర్ల : రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగులో రసాయన మందులు వాడాలని వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా అన్నారు. మండలంలోని ఆకవీడు, ఆరవీటి కోట గ్రామాల్లో బుధవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీవోఏ శ్రీనివాసరెడ్డి, వీఏఏలు ఫాతిమా, శివరాములు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : పొలంలో వర్షపు నీరు అధికంగా ఉండకుండా రైతులు చూసుకోవాలని వ్యవసాయాధికారి బుజ్జిబాయి సూచించారు. మండలంలోని బొందలపాడు, మాల్యవంతుని పాడు గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సాగులో ఉన్న వరి, పత్తిని పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ఏవో జవహర్‌లాల్ నాయక్ అన్నారు. ఎగువ చెర్లోపల్లి, చిలకచెర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏవో ఆయా గ్రామాల్లో సాగు చేసిన టమాటా, వంగ, పొగాకును పరిశీలించారు. వాతావరణం చల్లగా ఉండడంతో దోమ ఆశించాన్ని గమనించారు. తక్షణమే సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శివ నాయక్, ఏపీసీఎన్ఎఫ్ సి బ్బంది పాల్గొన్నారు.


కట్టకిందపల్లిలో బస్సు వద్ద మహిళలు

ఉచిత ప్రయాణంతో బస్సులలో రద్దీ

పామూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకానికి రోజురోజుకు మహిళల నుంచి ఆదరణ పెరుగుతోంది. బస్సుల్లోని సీట్లన్నీ మహిళలతో నిండిపోతున్నాయి. ముఖ్యంగా పామూరు నుంచి నెల్లూరుకు వైద్య పరీక్షల అవసరాలకు ఎక్కువ మంది వెళుతుంటారు. అల్ట్రా పల్లె వెలుగు బస్సు సర్వీసులు పుష్కలంగా ఉండటంతో ఉచిత ప్రయాణ పథకాన్ని సద్వినియోగం చేసుకొంటున్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల నుంచి మహిళలు పామూరుకు రావాలంటే గతంలో ఆటోలను ఆశ్రయించేవారు. ప్రస్తుతం బస్సులలో ఉచితంగా ప్రయాణిస్తుండటంతో మహిళలతో కిక్కిరిస్తున్నాయి. పామూరు నుంచి ఒంగోలుకు, నెల్లూరుకు, కనిగిరికి వెళ్లాలన్నా పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు మాత్రమే ఎక్కువగా తిరుగుతుంటాయి. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తక్కువగా ఉంటున్నాయి, గుంటూరు, విజయవాడకు వెళ్లాలంటే ఒంగోలుకు గాని ఇటు కనిగిరికి వెళ్లి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా మహిళలు ప్రయణిస్తున్నారు.


విద్యార్థులకు పలకలు, నోట్సులు అందించిన హెచ్ఎం ప్రభుదాస్

విద్యార్థులకు హెచ్ఎం సహకారం

దొనకొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల విద్యాభివృద్ధి నిమిత్తం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదిమూలపు ప్రభుదాస్ తన సొంత ఖర్చులతో తనవంతు సహకారం అందించారు. మండలంలోని పోలేపల్లి ఎస్సీ కాలనీలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 1, 2 తరగతులు చదువుతున్న పేద విద్యార్థులకు హెచ్ఎం ప్రభుదాస్ పలకలు, నోట్సులు, పెన్నులు పంపిణీ చేశారు. పోలేపల్లి ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకారం అందిస్తున్న హెచ్ఎంను ప్రజలు అభినందిస్తున్నారు.

రేపు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణ

మండలంలోని సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వసంతరావునాయక్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిక్షణలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు సకాలంలో హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.


కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో

బాలికలు ఉన్నత స్థాయికి ఎదిగేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలి

సీఎస్‌పురం(పామూరు) ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : బాలికలు ఉన్నత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈవో రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని గుమ్మినేనిపల్లి ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ విద్యాలయంలో విజయపథం కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థినుల కోసం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. ఇంటర్ బాలికలకు ఒకేషనల్ సబ్జక్టుల బోధన, ప్రాక్టికల్స్ నిర్వహణ పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ షేక్ రేష్మ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గుమ్మినేనిపల్లి పాఠశాల వైద్య సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎంఈవో పరిశీలించారు. క్రమం తప్పకుండా తల్లిదండ్రులు పిల్లలకు వ్యాక్సినేషన్ వేయించి ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు, ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు మింగించాలన్నారు.


మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

ఎల్ఐసీ ఏజెంట్లకు మెడిక్లయిమ్ వర్తింపజేయాలి

కనిగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఐసీ ఏజెంట్లకు మెడి క్లయిమ్ వర్తింప చేయాలని కోరుతూ ఏవోఐ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎల్ఐసీ శాటిలైట్ కార్యాలయం ఆవరణలో ఎల్ఐసీ ఏజెంట్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు ఆయా బ్రాంచి మేనేజర్ సాయికుమర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏవోఐ యూనియన్ నెల్లూరు డివిజన్ నాయకులు వీకేరావు, ఎస్.కొండలరావు, కే అనూక్, షేక్ షఫీ, కె. సునీల్, జీ కోటిరెడ్డి, జీవీ రమణయ్య, పీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బార్ కోసం దరఖాస్తులు చేసుకోవాలి

కనిగిరిలో నూతన బార్ (మద్యం షాపు) కోసం ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ విజయభాస్కర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మున్సిపాల్టీ పరిధిలో ప్రస్తుతం కొనసాగుతున్న బార్‌కు ఈనెలాఖరుతో గడవు ముగుస్తుందని,నూతనంగా కావాల్సిన వారు దరఖాస్తును ఎక్సైజ్ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని,పూర్తి వివరాలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం

తోపుడుబండ్ల వ్యాపారుల్లో ఆందోళన

మా పొట్టకొడుతున్నారని ఆవేదన

బడాబాబుల జోలికెళ్లని అధికారులు

దర్శి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : దర్శి పట్టణంలో రోడ్డు మార్జిన్‌లోని చిరువ్యాపారుల ఆక్రమణల తొలగింపునకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ప్రతిసారి రెక్కడాతేగాని డొక్కాడని నిరుపేదలైన చిరువ్యాపారుల మీద అధికారులు ప్రతాపం చూపిస్తున్నారు. రోడ్డు స్థలం ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేసిన బడావ్యాపారుల జోలికివెళ్లటం లేదు. దర్శి పట్టణంలోని రోడ్డు మార్జిన్‌లు తొలగిస్తున్నట్లు మున్సిపల్, రెవెన్యూపోలీస్ అధికారులు ప్రకటించటంతో చిరువ్యాపారుల్లో ఆందోళన మొదలైంది. ఎంతో కాలంగా చిరువ్యాపారాలపై జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలు ఏమి చేయాలో పాలు పోక దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు. ఆ క్రమణలతో రోడ్డుకు చించుక పోవటంతో ట్రాఫిక్ సమస్యఏర్పడి రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు గాయాలపాలవుతున్నారని అధికారులు ఈచర్యలకు పూనుకున్నారు. వాస్తవంగా అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఆర్‌అండ్‌బీ రోడ్డు స్థలం ఎంత వరకు ఉందో కొలిచి పూర్తిగా తొలగించి నట్లయితే రోడ్లు విశాలంగా ఉంటాయి. అప్పుడు ఫుట్‌పాత్ మీద తోపుడు బండ్లు పెట్టుకునే అవకాశం కల్పించినా ఇబ్బందులు ఉండవు. అయితే అధికారులు అక్రమనిర్మాణాల జోలికి వెళ్లకుండా ప్రతిసారి చిరువ్యాపారుల పైనే జులుం ప్రదర్శిస్తున్నారు. వాసవ్తవంగా దర్శి గడియారస్తంభం సెంటర్‌లో ఎన్నో ఏళ్లుగా పేదలు చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.బిల్డింగ్ యజమానులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి మురుగు కాలువలను పూడ్చి కట్టడాలు చేశారు. వర్షం పడితే చాలు మురుగు కాలువలు సరిగా లేక వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉంటుంది. మున్సిపల్ అధికారులు అసలు సమస్యలను గుర్తించకుండా చిరువ్యాపారులపైప్రతి సారిపడుతుండటంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


ప్రభుత్వ స్థలంలో తొలగిస్తున్న ఆక్రమణలు

వైసీపీ హయాంలోనూ ఇదే తంతు

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో సుమారు 3 ఏళ్ల క్రితం మున్సిపల్ అధికారులు ఇదే విధంగా రోడ్డు మార్జిన్ ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ట్రాఫిక్ సమస్యను నివారించడానికి చర్యలు చేపడుతున్నామని నమ్మబలికారు. ప్రధాన రహదారులైే దర్శి- అద్దంకి రోడ్డు, దర్శి -కురిచేడు రోడ్డు, దర్శి-పొదిలి రోడ్డులలో రోడ్డు మార్జిన్‌లలో ఆక్రమణలు తొలగించారు. ఆసమయంలో కొంత మంది ఆక్రమణదారులు అధికారులకు చేయి తడిపి వ్యవహారాన్ని తారు మారు చేశారు. అధికారులు ఆక్రమణలు తొలగించకుండా ముడుపులుతీసుకుని వదిలేశారు. కొద్ది రోజులు జరిగిన తరువాత ఆక్రమణదారులు యథావిధిగా తమ స్థలాల్లో వ్యాపారాలు సాగిస్తున్నారు. అప్పుడు కూడా చాలా రోజులు చిరువ్యాపారులు భయపడి వ్యాపారాలు మానుకున్నారు.ఎప్పుడైతే అధికారులు అక్రమార్కులకు అవకాశం ఇవ్వటంతో చిరువ్యాపారులు తమవ్యాపారాలు రోడ్డుపైనే చేస్తున్నారు. ఇప్పుడు అధికారులు మళ్లీ అదే తంతుకు తెరతీశారని ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారుల ఆక్రమణలు తొలగించాలన్న చిత్తశుద్ధి ఉంటే ముందుగా ఆక్రమణలను పూర్తిగా గుర్తించి తొలగించాల్సి ఉంది. అలాంటి చర్యలు చేపట్టకుండా కేవలం రోడ్డు మార్జిన్‌లో ఉన్న చిరువ్యాపారుల తొలగింపునకే అధికారులు నిర్ణయం తీసుకోవటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపునకు శ్రీకారం

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

దర్శి : దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డు ప్రభుత్వ దారిలో అక్రమ నిర్మాణాల తొలగింపునకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఆంధ్రజ్యోతి ప్రకాశంలో మంగళవారం 'ఖాళీస్థలం కనిపిస్తే కబ్జా' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దర్శి - కురిచేడు రోడ్డులోని బండిదారిలో అక్రమంగా నిర్మించిన గోడౌన్‌ను ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పటిష్టచర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ నిర్మాణాలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యవసాయ బోర్ల కింద ముమ్మరంగా వరి నాట్లు

● బిజీబిజీగా రైతులు

ముండ్లమూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్ల ఆధారంగా వారం రోజుల నుంచి ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి భూగర్భ జలాలు పెరగడం రైతులకు కలసి వచ్చింది. వరి నాట్లు నిమగ్నంలో రైతులు బిజీగా ఉన్నారు. మండలంలోని పెద ఉల్లగల్లు, లక్ష్మీనగర్, బసవాపురం, శ్రీనివాస నగర్, చింతలపూడి, పసుపుగల్లుతో పాటు గుడిపాడు, కమ్మవారిపాలెం, వేముల, ముండ్లమూరు, ఈదర, భీమవరం, తమ్మలూరు, సింగనపాలెం, పోలవరం గ్రామాలకు చెందిన రైతులు ఖరీఫ్ సీజ్‌లో వరి నాట్లు వేస్తున్నారు. వారం రోజుల నుంచి మాగాణి భూములను దమ్ము చేసి బీపీటీ రకం వరి వంగడాలను సాగు చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి రజానగరం మేజరు పరిధిలో సాగర్ నీరు కూడా రావటంతో వరి నాట్లు వేస్తున్నారు. ఇప్పటికే నాలుగు వందల నుంచి ఐదు వందల ఎకరాల వరకు వరి సాగు చేశారు.


పెద ఉల్లగల్లులో బోర్ల కింద మాగాణి భూముల్లో వరి నాట్లు వేస్తున్న కూలీలు


వరి నాటేందుకు మాగాణిని దమ్ము చేస్తున్న ట్రాక్టర్

రైతులకు డీఏపీ, యూరియా పంపిణీ

దొనకొండ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు రైతులకు అత్యాధునిక, సాంకేతికతో మనగ్రోమోర్ వారు ప్రవేశపెట్టిన మెటా డీఏపీ, యూరియాను మండల వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ ప్రారంభించి రైతులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యూరియా, డీఏపీ రైతులు సాగు చేసే పంటలకు ఆకు నుంచి వేరు వరకు ప్రతి కనంలోకి వెళ్లి పంటకు పోషణ ఇచ్చి అధిక దిగుబడిని అందిస్తుందన్నారు. అవసరమైన రైతులు మన గ్రోమోర్‌లో అందుబాటులో ఉన్న డీఏపీ, యూరియాను పంటల సాగుకు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మన గ్రోమోర్ ఏరియా మార్కెటింగ్ మేనేజర్ గోపి, స్థానిక గ్రోమోర్ మేనేజర్ దొండపాటి బ్రహ్మయ్య, రైతులు పాల్గొన్నారు.


రైతులకు డీఏపీ అందజేస్తున్న వ్యవసాయాధికారి

పంటల బీమాకు 31 వరకు అవకాశం

కంది, మిరప పంటలు సాగు చేసిన రైతులు పంటల బీమా కట్టుకునేందుకు ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కే బాలాజీనాయక్ స్పష్టం చేశారు. మండలంలోని కొచ్చెర్లకోట, సిద్దాయిపాలెం గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు వ్యవసాయపరమైన అనేక విషయాలను వివరించారు. మండలంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ డబ్బులు పడని రైతులు గ్రీవెన్స్ మాడ్యూల్‌లో వీఏఏ వద్ద అప్లై చేసుకోవాలన్నారు. పంటలు సాగు చేసిన రైతులందరూ ఖచ్చితంగా గ్రామ వ్యవసాయ సహాయకులతో ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం దొనకొండలోని ఎరువుల షాపులను తనిఖీ చేసి మండలంలోని రైతులకు మాత్రమే యూరియాను విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాలలో సీసీరోడ్లు, మురుగుకాలువలు

దర్శి ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : దర్శి మున్సిపాలిటీలో సీసీరోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. పట్టణంలోని ఒకటో వార్డులో అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీరోడ్లు, మురుగుకాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలియజేయడంతో వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈలు శ్రీనివాస్, శ్రీరామ్‌మూర్తి, శ్రీరామ్ పాల్గొన్నారు.


దర్శి మున్సిపాలిటీలో సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ పిచ్చయ్య, అధికారులు

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

పామూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో తొలిసారిగా జరుగుతున్న సీపీఐ 28 వ రాష్ట్ర మహాసభల విజయవంతానికి ఆర్థిక సహకారం అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి కోరారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాల ప్రచార కార్యక్రమం బుధవారం చేపట్టారు. నియోజకవర్గ, సహాయ, మండల నాయకులు, కార్యదర్శులు వజ్రాల సుబ్బారావు, పి. ప్రభాకర్, మండల సహాయ కార్యదర్శులు పి. మస్తాన్‌రావు, ఆర్. సూరిబాబు, ఇర్రి వెంకటరెడ్డి, పి. రఘునాథరెడ్డి ఉన్నారు.

శాస్త్రీయ ఆలోచనలను అలవరుచుకోవాలి

విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్రీయ ఆలోచన విధానాన్ని అలవరుచుకోవాలని జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ టి. చెన్నకృష్ణ సూచించారు. స్థానిక ఆదిత్య జూనియర్ కళాశాలలో మండల జేవీవీ ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథం దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు

దివ్యాంగులకు వైద్యపరీక్షలు

దర్శి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ జి. సుధారాణి మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని రకాలుగా సహకారం అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వసంతరావ్ నాయక్, ఎంఈవోలు కె. రఘురామయ్య, పి. రమాదేవి, సమసన్వయ కర్త పి.నాగేంద్రనాయక్, జోగేంద్ర, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

పామూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జాబు కార్డు కలిగి ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పడమరకట్టకిందపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. గత ఏడాది ఏప్రిల్ నెల నుంచి 2025 మార్చి నెల వరకు జరిగిన హామీ పనులకు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో బి. మాల్యాద్రి, పంచాయతీ కార్యదర్శి, సీఆర్పీలు, ఉపాధి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యం

పథకాల అమలుకు సమన్వయంతో ముందుకు సాగాలి

తాళ్లూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) :క్షేత్రస్థాయిలో అభివృద్ధి పథకాల అమలు సక్రమంగా జరగాలంటే అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.సత్యం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమన్వయ సమావేశం బుధవారం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతమేర చేరువుతున్నాయో వాటి వివరాలు ఎప్పటికప్పుడు ఎంపీడీవో కార్యాలయానికి తమ శాఖల పరిధిలో సమాచారం అందజేయాలన్నారు.ప్రతి బుధవారం జరిగే సమావేశానికి తమ శాఖల పరిధిలో జరుగుతున్న అంశాలపై సమీక్ష జరిపి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జి.ఫణీంద్ర, వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు, ఏపీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం దేవరాజ్, హౌసింగ్ అధికారి హనుమంతరావు, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ వాలి, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎస్.సత్యం

తాళ్లూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా కార్యాలయ పర్యవేక్షకుడు సానికొమ్ము సత్యంను నియమిస్తూ జడ్పీ సీఈవో బి.చిరంజీవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేస్తున్న దారా హనుమంతరావు అనారోగ్యంతో సెలవుపై వెళ్లారు. గతవారం రోజులుగా ఎంపీడీవో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా తక్షణమే ఇన్‌చార్జి ఎంపీడీవోను నియమించాలని టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి రెండు రోజుల క్రితం జడ్పీసీఈవో దృష్టికి తీసుకువెళ్లారు. పాలనా సౌలభ్యం కోసం స్థానిక కార్యాలయ పర్యవేక్షకులు సానికొమ్ముసత్యంకు పూర్తిఅదనపు బాధ్యతలతో ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వినాయక చవితి మండపాలకు పోలీసు అనుమతి తప్పనిసరి


ఎస్ఐ కమలాకర్

ముండ్లమూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, అలా కాకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కే కమలాకర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మైకు, సౌండ్ బాక్స్ వాడాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు పేరిట అశ్లీల నృత్యాలు, రికార్డు డ్యాన్స్‌లు నిర్వహిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వినాయక మండపాల వద్ద ఫైర్, ఎలక్ట్రికల్ భద్రతా చర్యలు తప్పనిసరి అన్నారు. రాత్రి 10 గంటల తరువాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించ కూడదన్నారు. రహదారులు, ట్రాఫిక్ కూడళ్ళు, ప్రజా మార్గాలను ఆక్రమించ రాదన్నారు. అధిక శబ్దం చేసే డీజే సౌండ్ సిస్టమ్, లౌడ్ స్పీకర్లను వాడ రాదన్నారు. శోభాయాత్ర సమయంలో మద్యం సేవించి అసభ్యంగా ప్రవర్తించ కూడదన్నారు. ఎంత మంది కమిటీ నిర్వాహకులు ఉన్నారో వారందరి ఆధార్ కార్డులు తీసుకొని వచ్చినట్లయితే అనుమతి ఇస్తామన్నారు. అన్ని నిబంధనలు పాటిస్తూ వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే మండప నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు స్టేషన్‌లో అఫిడవిట్ దాఖలు చేయాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

రైతుసేవ కేంద్రాల్లో పుష్కలంగా ఎరువుల నిల్వలు

దర్శి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రైతుసేవ కేంద్రాల్లో ఎరువులు నిల్వలు పుష్కలంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కృషివిజ్ఞాన కేంద్రంలో బుధవారం వ్యవసాయాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈక్రాప్ నమోదును సకాలంలో పూర్తి చేయాలన్నారు. రైతులసాగు చేసే పంటలపై అవగాహన కల్పించి అధునాతన పద్దతులు అనుసరించేవిధంగా చైతన్య వంతులను చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంధిస్తున్న రాయతీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దర్శి ఏడీఏ కె బాలాజీనాయక్, ఏవోలు కే రాధ, డి శ్రీనివాసరెడ్డి, బాలకృష్ణనాయక్, ప్రసాద్, తిరుమలరావు, ప్రకాష్ రావ్, సంపత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై జొన్న విత్తనాలు

వీసీపల్లి :పశువుల గ్రాసం కోసం 50 శాతం రాయితీపై జొన్నవిత్తనాలు ఇస్తున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ ఆవులరెడ్డి తెలిపారు. 5కేజీల ఎర్రగడ్డి జొన్నలు రూ.89.38 పైసలకే ప్రభుత్వం అందజేస్తుందని ఆయన అన్నారు. ప్రస్తుతానికి పెదయిర్లపాడు, పెదఅలవలపాడు, పీసీపల్లి సచివాలయాలకు 9.5 టన్నుల జొన్న విత్తనాలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు.వీటిని గురువారం నుంచి పశుపోషకులకు పంపిణీ చేస్తామని ఆయన అన్నారు. అవసరమైన రైతులు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు తీసుకుని పశువైద్య సహాయకులను సంప్రదించాలని ఆయన కోరారు.

భూసార పరీక్షలు చేయించాలి

ముండ్లమూరు : మండలంలోని రైతులు పంటలు సాగు చేసే ముందుగా భూసార పరీక్షలు చేయించుకుని తదనుగుణంగా పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, లాభాలు సాధించ వచ్చునని మండల వ్యవసాయ అధికారి ఏ తిరుమలరావు అన్నారు. ఆయన బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన 2025 కింద ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ జిల్లా వనరు కేంద్రం వ్యవసాయ అధికారి శేషమ్మ విత్తనం వేసే దగ్గర నుంచి పంట కోసే వరకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వీరాంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

ట్రైకోడెర్మాతో తెగుళ్ల నివారణ

తాళ్లూరు : ట్రైకోడెర్మాతో తెగుళ్లను నివారించవచ్చునని వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని లింగాలపాడు, వెలుగువారిపాలెం, బొద్దికూరపాడు గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమం బుధవారం జరిగింది. రసాయనిక ఎరువులతో ట్రైకోడెర్మాను కలిపి వాడకూడదని తెలిపారు. సేంద్రియ ఎరువుల ఉపయోగం గురించి, పండ్లతోటల పెంపకం గురించి వివరించారు. కార్యక్రమంలో వీఏఏ ఆదినారాయణ, ప్రకృతి ఇన్‌చార్జి నరసింహం , రైతులు పాల్గొన్నారు.





● సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

జీజీహెచ్‌లో.. జన్యు పరీక్షల కేంద్రం



- ఏర్పాటుకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఆమోదం
- గుంటూరులో ఇక సికిల్‌సెల్ జబ్బు స్థాయి నిర్ధారణ

గుంటూరు మెడికల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ రంగ వైద్య సేవలకు స్టేట్ రిఫరల్ ఆస్పత్రిగా రూపుదాలుస్తున్న గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆస్పత్రికి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి జన్యు పరీక్షల కేంద్రం మంజూరైంది. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో ఈ కేంద్రం నిర్మించనున్నారు. గిరిజనుల ఆరోగ్య సంరక్షణ కోసం 'సెంటర్ ఆఫ్ కాంపెటెన్స్' (సీఓసీ)గా ఈ కేంద్రం పని చేయనున్నది. సికిల్ సెల్ జబ్బు స్థాయి తెలుసుకునేందుకు అవసరమైన జన్యు పరీక్షలు ఈ కేంద్రంలో నిర్వహిస్తారు. దంపతుల నుంచి సేకరించిన రక్త నమూనాల ద్వారా సికిల్‌సెల్ జబ్బు ఉందా? లేదా? ఉంటే ఏ స్థాయిలో ఉంది? రాబోయే రోజుల్లో వీరి ద్వారా సంతానానికి సంక్రమిస్తుందా? లేదా? అని తెలుసుకునేందుకు అవసరమైన జన్యు పరీక్షలు ఈ కేంద్రంలో జరుగుతాయి. శిశువుల నుంచి సేకరించిన రక్త నమూనాలను కూడా ఇక్కడ పరీక్షిస్తారు.

2047కి వ్యాధి నిర్మూలనే లక్ష్యం

గిరిజనులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న సికిల్‌సెల్ ఎనీమియా జన్యుపరమైన రక్తసంబంధిత రుగ్మత. 2047 నాటికి దేశంలో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే ధ్యేయంతో 'జాతీయ సికిల్‌సెల్ ఎనీమియా నివారణ మిషన్‌'ను కేంద్రం చేపట్టింది. ఇందులో భాగంగా సిల్‌సెల్ జబ్బు ప్రబలంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌తో పాటు మొత్తం 17 రాష్ట్రాల్లో సీఓసీలు ఏర్పాటు చేస్తున్నారు. ఏపీలో గుంటూరు జీజీహెచ్‌తో పాటు విశాఖలోని కింగ్ జార్జ్ ఆస్పత్రిలో సికిల్‌సెల్ జన్యు పరీక్షల కేంద్రాలకు కేంద్రం ఆమోదం తెలిపింది. కాగా గుంటూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసే జన్యు పరీక్షల కేంద్రంలో సికిల్ సెల్ ఎనీమియాతో పాటు థలసీమియా జన్యు పరీక్షలు అందుబాట్లోకి వస్తాయని వైద్యాధికారులు తెలిపారు. ఈ జన్యు పరీక్షల వైద్య పరికరాలను ఏపీ ఎంఎస్ ఐడీసీ ద్వారా టెంటర్లు పిలిచి కొనుగోలు చేయనున్నారు.

ఇన్నోవేషన్.. ఓ ఆశాకిరణం



- 20 వేల స్టార్టప్‌లు.. 5 లక్షల మందికి ఉపాధి
- ఔత్సాహికులను ప్రోత్సాహించేలా మంగళగిరిలో హబ్
- జాతీయ స్థాయి ప్రాముఖ్యత లభించేలా ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- నాలుగు వందల మందికిపైగా స్టార్టప్ కంపెనీల ప్రతినిధుల హాజరు
- ప్రతిపాదించిన ఏడాదిలోగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కార్యరూపం

మంగళగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సరికొత్త ఆలోచనలే కేంద్రంగా మంగళగిరిలో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ యువతకు ఓ ఆశాకిరణంగా మారనున్నది. ఇన్నోవేషన్ హబ్‌లు దేశంలో ఇప్పటికే కొన్ని ఉన్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం మంగళగిరిలోని మయూరి టెక్‌పార్కులో ప్రారంభించిన హబ్‌కు జాతీయస్థాయి ప్రాముఖ్యత నెలకొంది. దీని ప్రారంభోత్సవానికి ఆహ్వానితులు కాకుండా దాదాపు నాలుగు వందల మందికిపైగా కొత్త స్టార్టప్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. వీరు స్టార్టప్‌ల తాలూకు స్టాల్స్‌ను ప్రదర్శించగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తిగా పరిశీలించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను అమరావతి కేంద్రంగా ఏర్పాటు చేయాలని గత ఏడాది అక్టోబరులో తొలిసారిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపాదించారు. అయితే ఏడాదిలోగానే ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చేలా చేశారు. వచ్చే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లను ఏర్పాటుచేసి ఐదు లక్షల మందికి ఉపాధిని కల్పించడమే లక్ష్యంగా ఈ హబ్‌లను ఏర్పాటు చేశారు. నైపుణ్యం కలిగిన ఔత్సాహికులు, మహిళలు, యువతకు ఈ హబ్‌లలో అధిక ప్రాధాన్యతను ఇచ్చి ప్రోత్సహిస్తారు. వినూత్నమైన ఆలోచనలు కలిగిన యువత వీటిని వినియోగించుకుని బంగారు బాటలు వేసుకునే వీలు కలుగుతుంది. ఇక మంగళగిరిలో హబ్‌ను ప్రారంభించిన తొలి రోజునే రికార్డు స్థాయి

(మిగతా 6వ పేజీలో)



సజీవంగా టాటా

గివ్ బ్యాక్ టూ సొసైటీ అనే విధానాన్ని రతన్ టాటా ఆచరించి సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచారు. ఆయన ఆలోచనలు భావితరాలవారికి అందించాలన్న లక్ష్యంతోనే ఇన్నోవేషన్ హబ్‌లను ప్రారంభిస్తున్నాము. ఈ హబ్‌ల రూపంలో రతన్ టాటా ఆలోచనలు ఎప్పటికీ సజీవంగానే ఉంటాయి.

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



వచ్చే నెల 26 నుంచి.. బీచ్ ఫెస్టివల్

- సూర్యలంకకు రానున్న సీఎం చంద్రబాబు నాయుడు
- ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమావేశం

బాపట్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 26, 27, 28 తేదీల్లో సూర్యలంక సముద్రతీరంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించను న్నారు. ఇందుకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై బుధవారం కలెక్టర్ వెంకటమురళి కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. బీచ్ ఫెస్టివల్‌కు విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక, పర్యాటక, వినోద అంశాలను జోడించి జిల్లా ప్రత్యేకతను చాటేలా వేడుకలు ఉండాలన్నారు. మూడురోజులు సాంస్కృతిక ప్రదర్శనలు, బీచ్ క్రీడలు, సంగీత, నృత్య వినోద కార్యక్రమాలతో పాటు ఫుడ్ కోర్టులు సందర్శకులను ఆకట్టుకునేలా ఉండాలన్నారు. 27న ముఖ్యమంత్రి చంద్రబాబు సూర్యలంకకు రానున్నారన్నారు. రూ.97.52 కోట్లతో చేపట్టే పర్యాటక ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన చేసి బీచ్‌ఫెస్టివల్‌లో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ లక్ష్మీప్రసన్న, ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఏవో మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ఆర్ కాదు.. ఎస్ఐఆర్

- బోగస్ ఓటర్ల ఏరివేతకు రంగం సిద్ధం
- ఇంటింటికి వెళ్లి జీవించి ఉన్న ఓటర్ల వరకే నమోదు
- లోపాలు లేకుండా 2026 ఓటరు జాబితాల రూపకల్పన

గుంటూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఏటా ఆగస్టు నెల వస్తుందంటే ఓటర్ జాబితాలకు సంబంధించి స్పెషల్ సమ్మరి రివిజన్(ఎస్ఎస్ఆర్) ప్రారంభమయ్యేది. దాదాపుగా నాలుగైదు నెలల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహణ, ఓటర్ జాబితాల స్వచ్ఛీకరణ అనంతరం తదుపరి జనవరి మొదటి వారంలో తుది ఓటర్ల జాబితాని ఎన్నికల సంఘం ఆమోదంతో జిల్లా యంత్రాంగాలు ప్రకటించేవి. అయితే ఈ దఫా ఆగస్టు నెల చివరి వారం సమీపిస్తున్నా ఎస్ఎస్ఆర్ ఊసే లేదు. ఇందుకు కారణం బీహార్ రాష్ట్రంలో స్పెషల్ ఇన్‌క్లూజివ్ రివిజన్(ఎస్ఐఆర్) చేపట్టిన ఈసీ దాదాపుగా 65 లక్షల బోగస్ ఓటర్లను తొలగించడమే. అదే విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేసేందుకు మార్గదర్శకాలు రూపుదిద్దుకుంటున్నాయని, అందుకే ఓటర్ల జాబితాల సవరణ షెడ్యూల్ ఇంకా విడుదల కాలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఓటర్ జాబితాల సవరణ కార్యక్రమం మరి కొద్ది రోజుల్లోనే పెద్దఎత్తున జిల్లాల్లో జరగనున్నది. ప్రస్తుతం ఉన్న ఓటర్ల పేర్లన్నింటిని డేటా బేస్ నుంచి తొలగిస్తారని రెవెన్యూ అధికారులు తెలిపారు. బూత్ స్థాయి అధికారులు వారి పరిధిలో ప్రతీ ఇంటికి వెళ్లి అర్హులైన ఓటర్ల పేర్లను నమోదు చేస్తారు. దాంతో చనిపోయిన, డూప్లికేట్, బోగస్ ఓటర్ల ఏరివేత జరుగుతుంది. రాజకీయ పార్టీలు వేలు పెట్టి చూపడానికి చిన్న కారణం కూడా లేకుండా 2026 ఓటర్ జాబితాలు రూపుదిద్దుకుంటాయని తెలిపారు. ఆ ఓటర్ జాబితాల్లో పేరు, తండ్రి పేరు, ఫొటో, చిరునామా వంటి అన్ని వివరాలు కచ్చితత్వంతో కూడుకుని ఉంటాయని పేర్కొన్నారు. ఇందుకోసం ఎట్టలేదన్నా నాలుగు నెలలకు పైగా కసరత్తు జరుగుతుం దన్న అభిప్రా యాన్ని వ్యక్తపరుస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రామాణికం


వచ్చే ఏడాది మార్చిలో స్థానిక సంస్థల పదవీకాలం ముగుస్తుంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జిల్లా పరిష త్తులు, మండల పరిషత్తులకు ఎన్నికలు జరిపించాల్సి ఉంటుంది. ఎన్నికలు సకాలంలో జరిగి పాలకవర్గాలు ఏర్పడితేనే కేంద్రం నుంచి నిధులు విడుదలౌతాయి. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా ఎన్ని కలు జరుపుతుందన్న అభిప్రాయం అటు అధికార, ఇటు రాజకీయ వర్గాల్లో నెలకొని ఉన్నది. ఈ నేపథ్యంలో సమూలంగా ప్రక్షాళన చేసిన ఓటర్ జాబితాలు ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చేసేందుకు ఉపయోగపడతాయి.

శాంతించిన కృష్ణమ్మ

భట్టిప్రోలు, కొల్లూరు ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా లంక గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన కృష్ణమ్మ శాంతించింది. క్రమేపి నదిలో వరద ఉధృతి బుధవారం సాయంత్రానికి కొంతమేరకు తగ్గింది. అయితే కొల్లూరు మండలం దోనేపూడి కరకట్ట దిగువున ఉన్న పోతార్లంక చప్టాపై, భట్టిప్రోలు మండలం పెదపులివర్రు వద్ద ఉన్న చప్టాపైన వరద నీరు ప్రవహిస్తుండటంతో రెవెన్యూ, పోలీసు అధికారులు రాకపోకలను నిలిపి వేశారు. పెదల్లంక, చింతమోటు, పెసర్లంక గ్రామాల్లో ఉన్న లోతట్టు ప్రాంతాలు, కొల్లూరు మండలంలోని ఆవులవారి పాలెం, పెసర్లంక, గాజుల్లంక, పోతార్లంక, చింతల్లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వేసిన వాణిజ్య పంటలు వరద నీటిలో చిక్కుకున్నాయి. ఇటుక బట్టీలను నీరు చుట్టుముట్టింది. ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటితో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని నదీ తీర లోతట్టు ప్రాంతాల భూముల్లోని అరటి, కంద, పసుపు, కూరగాయ పంటలు ముంపునకు గురయ్యాయి. మళ్లీ నదిలో వరద పెరిగే అవకాశాలు లేకపోలేదని అధికారులు చెబుతున్నారు. వినాయక చవితి వెళ్లే వరకు వరద కొనసాగుతూనే ఉంటుందని ప్రజలు ఎవరూ నదిలోకి దిగరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు.



కొల్లూరు : ఇటుక బట్టీలను చుట్టుముట్టిన వరదనీరు



చీరాలలో బస్సుల కోసం వేచియున్న ప్రయాణికులు

ఉచితం సరే.. బస్సులేవి?

పలు గ్రామాల గడపెక్కని ఆర్టీసీ

చీరాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పతిష్ఠాత్మకంగా చేపట్టిన స్త్రీ శక్తి పథకంలో ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే బస్సు సౌకర్యం లేని గ్రామాల్లోని మహిళలు ఉచిత ప్రయాణ భాగ్యానికి నోచుకోవడంలేదు. వాడరేవు. గవినివారిపాలెం, కాపూరివారిపాలెం, దేవినూతల, బుర్లవారిపాలెం వంటి ప్రాంతాలకు బస్సులే లేవు. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన గ్రామీణ మహిళలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రైవేట్ వాహనాలపై ఆధారపడుతున్నారు. ఆటోల సంఖ్య పెరగడంతో పల్లె వెలుగు సేవలు ఈ గ్రామాలకు నిలిచిపోయాయి. నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ కూలీలు వేల సంఖ్యలో పట్టణాలకు ప్రయాణిస్తున్నారు. ప్రభుత్వం తాజాగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో తమ గ్రామాలకు బస్సులు వస్తాయని పలువురు ఎదురు చూస్తున్నారు. అయితే ఇంతవరకు ఆ ఊళ్లకు బస్సులే లేకపోవడంతో ఉచిత సేవలు అందని ద్రాక్షగా మారాయి.

సర్వీసులు ఏర్పాటు చేయండి

మా గ్రామంలో మత్స్యకార కుటుంబాలు అధికం. బతుకు తెరువు కోసంరోజూ చీరాల. బాపట్లకు వెళ్లి వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో బస్సు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నాం. కనీసం రెండు సర్వీసులు ఏర్పాటు చేయాలి. - చాపల లక్ష్మీ, వాడరేవు

ప్రభుత్వ స్థలాల్లో యథేచ్ఛగా కట్టడాలు

అద్దంకి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలకు అడ్డాగా అద్దంకి నిలుస్తోంది. ఎక్కడ చిన్న పాటి ప్రభుత్వ స్థలం కనిపించినా ఆక్రమించు కోవటం, కొంతకాలం ఆధీనంలో ఉంచుకోవడం, విక్రయించడం పరిపాటిగా మారింది. పట్టణంలోని శింగర కొండ రోడ్డులోని ప్రభుత్వ భూములు దశాబ్దాల తరబడి పరాదీనం లోనే ఉన్నాయి. నామ్ రోడ్డు నిర్మాణం జరిగిన తర్వాత స్థలాల విలువ పెరగడంతో ఈ ప్రాంతంలో ఆక్రమిత భూముల విక్రయాలతో పలువురు సొమ్ము చేసుకున్నారు. ఎన్‌టీఆర్ నగర్‌లో నామ్ రోడ్డు వెంబడి ఆక్రమిత భూముల్లో పెద్ద పెద్ద భవ నాలు, బహుళ అంతస్థుల భవనాలు వెలుస్తు న్నాయి. గతంలో చిన్న చిన్న ఇళ్లు ఉండగా, గత వైసీపీ ప్రభుత్వంలో పలువురు పెద్ద భవనాల నిర్మాణం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అదే పంథా కొనసాగుతుంది. మున్సిపల్ అనుమతులు లేకుండానే భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయి. సొంత స్థలాలలో ఇళ్ల నిర్మాణంలో చిన్న పాటి వ్యత్యాసం ఉంటేనే సవాలక్ష పత్రాలు అడిగే మున్సిపల్ అధికారులు కనీసం ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నా మిన్నకుండటం విమర్శలకు తావిస్తుంది. ఊర చెరువులో గతంలో ఆక్రమణలు జరిగినప్పుడు అప్పటి అధికారులు మిన్నకున్న ఫలితం ప్రస్తుతం అధికారులు బదనాం కావాల్సిన పరిస్థితి నెలకొంది.



ఎన్టీఆర్‌నగర్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనం



పోలీసుస్టేషన్ వద్ద గ్రానైట్ శ్లాబులు, ముడి రాయి లారీలు

మూడు గ్రానైట్ లారీలు స్వాధీనం

బల్లికురవ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మల్లాయపాలెం సమీపంలో మంగళవారం రాత్రి మూడు గ్రానైట్ శ్లాబులు, ముడి రాయి లారీలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌ఐ రాజు తెలిపారు. వేమవరం వైపు నుంచి మల్లాయపాలెం కూడలీలో శ్లాబులతో వెళుతున్న రెండు లారీలను అడ్డుకున్న విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. అలానే వేమవరం వైపు వెళుతున్న గ్రానైట్ ముడి రాయి లారీని తనిఖీ చేయగా బిల్లులు లేన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ మూడు లారీలను బల్లికురవ పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన మూడు లారీల్లోని సరుకుకు కొలతలు తీసి జరిమానా విధిస్తామని ఆర్‌ఐ రాజు తెలిపారు.

టిప్పర్లలో ఇసుక తరలింపు

- చోద్యం చూస్తున్న అధికారులు

కర్లపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన పాత నందాయపాలెం పంచాయతీ పరిధిలోని ఎకరన్నర పొలంలో ఇసుకకాసురులు ఇసుకను నింపుకుంటున్నారు. సామాన్యుడు ఇసుక కోసం ఇబ్బందులు పడుతున్న తరుణంలో నాలుగు రోజుల నుంచి వందలాది టిప్పర్లతో రాత్రిళ్లు ఇసుకను తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా బాపట్ల నుంచి నియోజకవర్గ నలుమూలలకు టిప్పర్ ఇసుకను రూ.8 వేల నుంచి రూ.9 వేలకు విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పాతనందాయపాలెం వీఆర్వో శివనాగరాజును వివరణ కోరగా బాపట్ల క్వారీ నుంచి ఇసుక వస్తుందని, పొలాన్ని పూడ్చుకుంటున్నారన్నారు. తహసీల్దార్ షాకీర్‌పాషాను వివరణ కోరగా మండలంలో ఇసుక తోలుకునేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు.

పాతనందాయపాలెం స్థలంలో ఇసుక టిప్పర్లు



నిధులున్నా పూర్తి కాని పనులు

పాత చెన్నై రహదారికి గ్రహణం వీడేనా?



దగ్గుబాడు వద్ద రోడ్డు పరిస్థితి

పర్చూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పర్చూరు - ఇంకొల్లు(పాత చెన్నై రహదారి) అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు ముందుకు సాగడంలేదు. ఏడేళ్లుగా ఈ రోడ్డు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉంది. మోకాలి లోతు గుంతల్లో రాకపోకలతో ప్రయాణికులు అల్లాడుతున్నారు. కాంట్రాక్టరు తాత్సారంతో రెండు నెలలుగా మరమ్మతులు ఒక కొలిక్కిరాలేదు. వర్షాల పేరుతో కాలయాపన చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ దేవుడికి ఎరుక కనీసం గుంతలు అయినా పూడ్చాలని వాహన దారులు కోరుతున్నారు. గుంటూరు - నాగలుప్పలపాడు వరకు జాతీయ రహదారుల జాబితాలో పాత చెన్నై రోడ్డును చేర్చాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కేంద్ర మంత్రి పెమ్మసానిలను కోరినా నేటికీ మోక్షం కలగలేదు.



ఇంకొల్లు వెళ్లే రోడ్డు

అవీ..ఇవీ..

గ్రానైట్ క్వారీలో డీఎంఎస్ పరిశీలన

బల్లికురవ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీర్లకొండ వద్ద సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో ప్రమాదవశాత్తు ఈనెల 3వ తేదిన ఒడిస్సాకు చెందిన ఆరుగురు కూలీలు మృతి చెందారు. ప్రమాదం జరిగిన గ్రానైట్ క్వారీని బుధవారం హైదరాబాద్ జోన్ మైన్స్ అండ్ సేఫ్టీ డెరెక్టర్ వేణుగోపాలరావు (డీఎంస్) బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ప్రమాదం ఎలా జరిగింది. క్వారీలో నిబంధనలు ఎలా ఉన్నాయి. పనులు జరిగిన సమయంలో ఫస్టు క్లాసు మేనేజర్, మేట్‌లు అందుబాటులో ఉన్నారా..? లేదా..? అని తనిఖీలు చేశారు. బెంచ్ పద్దతి ఎలా ఉంది. ర్యాంపు లు, రోడ్లు ఎలా ఉన్నాయి. పోల్యూషన్ ఎలా ఉంది. పనిచేస్తున్న కూలీలు భద్రత చర్యలు ఎలా చేపట్టారు వంటి అంశాలపై విచారణ చేశారు. పనుల వద్ద ఉన్న సిబ్బందిని అడిగి వివరాలను సేకరించారు. ప్రమాదాలు జరిగితే బాధ్యత క్వారీ యజమానులదే అని అన్నారు. నిబంధనలు అమలు చేయకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఇన్నోవేషన్.. ఓ ఆశాకిరణం

(5వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్లను నమోదు చేసుకున్నాయి. 24 గంటల్లోనే బిజినెస్ స్టార్టప్‌ల కోసం 1,67,321 మంది రిజిస్ట్రేషన్లు జరిపించుకున్నారు.

స్టార్టప్‌లకు ఊతం

'స్టార్టప్‌లకు ఊతమిచ్చేలా ఇన్నోవేషన్ హబ్‌లు పనిచేస్తాయి. యువతలోని వినూత్న ఆలోచనలను సరికొత్త ఆవిష్కరణల రూపంలో వెలికితీయడమే రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ల లక్ష్యం..' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళగిరిలోని మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు చేసిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌తోపాటు విజయవాడ, విశాఖ, తిరుపతి, అనంతపురంలో నెలకొల్పిన అనుబంధ కేంద్రాలను ఆయన బుధవారం టాటా గ్రూప్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌తో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని మయూరి టెక్‌పార్కులో ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు ప్రసంగించారు. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమన్నారు. ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఓ ఇన్నోవేషన్ హబ్ ఉండాలన్నదే తమ ఆశయమన్నారు. అగ్రిటెక్‌లో ఇన్నోవేషన్‌కు విస్తృతమైన అవకాశాలున్నాయన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ వంటి అనేక రంగాల్లో అపారమైన అవకాశాలున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబం నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే తన నినాదమన్నారు. ఈ లక్ష్య సాధన కోసమే రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓ వైపు సంపదను సృష్టిస్తూనే మరోవైపు పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పేదల జీవన ప్రమాణాలను మరింతగా మెరుగుపరుస్తూ వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

గ్రామస్థాయి నుంచి ఆవిష్కరణలు

గ్రామాల నుంచి గ్లోబల్ స్థాయి వరకు అన్ని రంగాల్లో ఆవిష్కరణలు రావాలని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. యువత వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలను చేయగలిగితే యావత్ ప్రపంచమంతా వాటిని ఆదరించి తీరుతుందన్నారు. ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న తమ సంకల్పంలో ఇదో తొలిమెట్టని తెలిపారు. ఈ కార్యాలయ భవనం లక్షలాది యువతకొక ఆశాకిరణన్నారు. అమరావతిని హైదరాబాద్ స్థాయిలో అభివృద్ధి చేయాలన్నదే బాబు లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టాటా గ్రూప్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్, మంత్రులు నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్డ్ ఛైర్మన్ బాబాకల్యాణి, అమర్ రాజా బ్యాటరీస్ ఛైర్మన్ గల్లా జయదేవ్, ఏపీ పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కుడికాలువ ఆయకట్టుకు సాగునీటి సరఫరా

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్,ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కుడికాలువ ఆయకట్టుకు సాగునీటి సరఫరాకు నీటిని విడుదల చేసినట్లు కలెక్టర్ తమీమ్‌అన్సారియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుడికాలువ కింద ఐదు నియోజకవర్గాల్లోని 14 మండలాల్లో 1.04 లక్షల ఎకరాల మాగాణి, 1.49 లక్షల ఎకరాల మెట్టకలిపి 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని పేర్కొన్నారు. 97 తాగునీటిచెరువులు, నాలుగు ఎస్‌ఎస్ ట్యాంకులకు మంచినీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. కుడికాలువ కింద పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాలోని ఆయకట్టు, తాగునీటి అవసరాలకు 132 టీఎంసీల నీటి కేటాయింపు ఉందని, అందులో 43శాతం పూర్వపు ప్రకాశం జిల్లాలోని ఆయకట్టు, తాగునీటి అవసరాలకు కేటాయించారని పేర్కొన్నారు. 2025-26 సంవత్సరానికి ఆగస్టు చివరి వారం నుంచి 85/3వద్దనుంచి నీటిని విడుదల చేస్తారని తెలిపారు. సాగర్ నీటిని ఆగస్టు చివరి వారం నుంచి వచ్చేఏడాది మార్చి వరకు అందించనున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి అవసరాల కోసం నింపిన చెరువుల్లోని నీటిని ఆ అవసరాలకు మాత్రమే వినియోగించాలని కోరారు.

దడ పుట్టిస్తున్న దమ్ము చక్రాలు

- రూ.కోట్లు వెచ్చించి వేసిన రోడ్లపైన నిర్లక్ష్యంగా ప్రయాణం
- ముందస్తు జాగ్రత్తలు పాటించకుంటే రహదారి ఛిద్రం ఖాయం



బల్లికురవ కొమ్మాలపాడు అర్‌అండ్‌బీ రోడ్డుపై వెళుతున్న దమ్ము ట్రాక్టర్

బల్లికురవ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ముందస్తు జాగ్రత్తలు పాటించకుంటే దమ్ముచక్రాల ట్రాక్టర్లతో కోట్ల రుపాయలతో చేపట్టిన రోడ్లుఛిద్రం అయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే పలు రోడ్లు దుమ్ము చక్రాలతో దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే వాటిలో కొన్ని రోడ్లను అభివృద్ధి పరిచింది. అయితే కొంత మంది రైతులు అవగాహన రాహిత్యం, మరికొంత మంది నిర్లక్ష్యంతో ఈ రోడ్లపై యథేచ్ఛగా దమ్ము చక్రాలను తిప్పుతున్నారు. దీంతో రహదారి దెబ్బతినే ప్రమాదం ఉందని పలువురు స్థానికులు వాపోతున్నారు. అధికారులు రైతులకు తగు సూచనలు చేసి దమ్ము చక్రాలకు రబ్బరు తొడుగులను అందజేయాలని ప్రజలు కోరుతున్నారు. వరిపంట సాగు సీజన్ ప్రారంభం కావడంతో దమ్ము చక్రాల ట్రాక్టర్ల రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. లేకుంటే రోడ్డు గతంలో మాదిరిగానే దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి.

మండలంలో వరిపంటను రైతులు అధికంగా సాగు చేస్తుంటారు. వరిపంట వేయాలంటే పొలం దమ్ము చేసేందుకు ఇనుప చక్రాల ట్రాక్టర్లు అవసరం. దీంతో ఏటా గ్రామాలలోని రోడ్ల పైకి ఇనుప చక్రాల ట్రాక్టర్లు వస్తున్నాయి. దీంతో రోడ్డుపై గుంతలలో గాడులు పడి వర్షాలు కురవగానే అవి పాడైపోతున్నాయి. మండలంలోని కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొణిదెన, వైదన, ఎస్ఎల్ గుడిపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, ముక్తేశ్వరం, వల్లాపల్లి, చెన్నుపల్లి, కొప్పెరపాలెం, కూకట్లపల్లి, కొప్పెరపాడు గ్రామాల పరిధిలో ఎక్కువ మంది రైతులు వరిసాగు చేసి దమ్ము చక్రాల ట్రాక్టర్లను వినియెగిస్తు న్నారు. అయా గ్రామాలలోని తారురోడ్లు, సీసీరోడ్లు దమ్ము చక్రాలతో పూర్తిగా దెబ్బతింటున్నాయి. గ్రామాల లో సీసీ రోడ్లపై దమ్ముచక్రాల ట్రాక్టర్లు పొలం వెళ్లేట ప్పుడు ఇంటికి వచ్చేటప్పుడు రోజుకు పలుమార్లు తిరగడంతో సిమెంట్ రోడ్లు గుల్లఅవుతున్నాయి. పొలాల్లోనే దమ్ము చక్రాలను వదిలి వస్తే కొంత వరకు రోడ్డు దెబ్బతినకుండా ఉండే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. అలానే ఇనుప చక్రాల మధ్య రబ్బరు తొడుగులు చుట్టి రోడ్లపై తిప్పితే రోడ్డు దెబ్బతినవని పలువురు చెబుతున్నారు. ఏటా వరి పంట వేసే ముందు దమ్ము చక్రాల ట్రాక్టర్ల గురించే ప్రతి ఒక్కరు చర్చించుకొంటున్నారు. అధికార్లు మాత్రం రైతులకు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలం అవుతున్నారు. తక్కువ ఖర్చుతో రబ్బరు తొడుగులు అందించి రైతులకు వాటిని అందజేయాలని, వారు వాటిని వినియోగించకుంటే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికే పలు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఇప్పుడు మరలా దమ్ము చక్రాల ట్రాక్టర్లు తిరిగితే ఇటీవల అభివృద్ధి పరిచిన రోడ్లు కూడా పనికి రాకుండా పోతాయని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు.





అభివృద్ధి చేసిన చెన్నుపల్లి వైదన తారు రోడ్డు, దమ్ము చక్రాల తాకిడికి తారు రోడ్లపై పడిన గాడులు

రబ్బరు తొడుగులపై అవగాహన కలిగించాలి

వరిపంట సాగు చేసే రైతులకు దమ్ము ట్రాక్టర్లు రోడ్ల పైకి వస్తే తప్పనిసరిగా రబ్బరు తొడుగు ఉంటేనే వచ్చేలా చర్యలు చేపట్టాలి. అలానే రైతుకు తక్కువ ఖర్చుతో రబ్బరు తొడుగులు అందజేసి వారికి అవగాహన కలిగించాలి. సంబంధిత రవాణా, పోలీసు శాఖల అధికారులు దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సి ఉంది. ముందుగా ట్రాక్టర్లు ఉన్న రైతులను గుర్తించి వారిని ఒక చోటకు చేర్చి వారికి ముందుగా దమ్ముచక్రాల వలన కలిగే నష్టాల గురించి వివరించాలి. రైతుల సమస్యలను కూడా అధికార్లు విని వారికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది.

కూటమి ప్రభుత్వం రాగానే రహదారుల అభివృద్ధి

టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే గతంలో దెబ్బతిన్న పలు రోడ్లను కోట్ల రూపా యల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచారు. చెన్ను పల్లి వైదన రోడ్డును రూ.3 కోట్లతో, బల్లికురవ సంతమాగులూరు రోడ్డును, అంబడిపూడి గోవాడ రోడ్డును అభివృద్ధి పరిచారు. దీనికి తోడు పలు రోడ్లు ఇప్పుడే అభివృద్ధి చేస్తున్నారు. ఈ రోడ్లు దమ్ము చక్రాల ట్రాక్టర్లతో దెబ్బతినకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బంగారం వ్యాపారిపై కత్తితో దాడి

- రూ.4 లక్షల నగదు, సెల్‌ఫోన్ అపహరణ
- చీరాల ప్రాంతీయ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు
- తాకట్టులో ఉన్న బంగారం కొనేందుకు విజయవాడ నుంచి చీరాలకు
- నిందితులంతా పాత నేరగాళ్లే

లక్ష్మీపురం(చీరాల), ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి) : తాకట్టులో ఉన్న పాత బంగారం అమ్మతామని ఓ వ్యాపారిని నమ్మిం చి అతని వద్ద ఉన్న నగదు దోచుకున్న ఘటన చీరాలలో వెలుగు చూసింది. విజయవాడ చిట్టినగర్‌కు చెందిన ఎస్‌కే రెహమాన్ తాకట్టులో ఉన్న బంగారం కొనుగోలు వ్యాపారం చేస్తుంటాడు. ఆ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో చీరాలకు చెందిన పలువురు పాతనేరస్థులు మల్లెల రాజేష్, ఆయన బంధువులు కావాటి నాగరాజు, మున్నా, ఇంద్ర, మౌనిక ఈ ప్రకటనపై స్పందించారు. వీరంతా పాత నేరస్థులు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రకటన ఆధారంగా విజయవాడ చిట్టినగర్‌కు చెందిన ఎస్‌కె రెహమాన్‌ను ఫోన్ ద్వారా సంప్ర దించారు. తమ బంగారం చీరాల్లోని ఓ బ్యాంకులో ఉందని నమ్మించారు. విడిపించి కొనుగోలు చేయాలని చెప్పారు. దీంతో నిజమని నమ్మిన అతను బుధ వారం మధ్యాహ్నం రూ.4 లక్షల నగదుతో చీరాలకు చేరుకున్నాడు. ఈ క్రమంలో పథకం ప్రకారం వీరంతా అతడిని లక్ష్మీపురం ఇంటికి ఆటోలో పిలిపించుకున్నా రు. అక్కడి నుంచి ఇంట్లోకి రమ్మని పలువగా అప్పటికే స్వల్ప అనుమానం చెందిన వ్యాపారి రెహమాన్ ఇంట్లోకి వెళ్లేందుకు నిరాకరించాడు. అయితే బలవంతంగా వారంతా ఇంట్లోకి తీసుకువెళ్లి కాళ్లతో, చేతులతో దాడి చేసి గాయపరిచారు. అప్పటికీ అతను ఎదురు తిరుగుతండడంతో కత్తితో తలపై కుడి భాగం లో గాయపరచారు. అలాగే రూ.4 లక్షలు నగదు, సెల్‌ఫోన్ లాక్కుని పంపించేశారు. ఆ సమయంలో బాధితుడు వారి కళ్లుగప్పి దాడికి పాల్పడిన కత్తితో చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందాడు. అలాగే వేటపాలెం పోలీసులకు, బంధువులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి నేరస్థుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



గాయపడిన ఎస్‌కే రెహమాన్

దొంగబంగారం ఇస్తామని అనేక ప్రాంతాల వారిని ఆశచూపి చీరాల ప్రాంతంలో చోరీ చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. అయితే సామాజిక మాధ్యమాలను వినియోగించుకొని ఈ తరహా దోపిడీ చేయడం మారిన నేరాల తీరుకు దర్పణం పడుతోంది. ఇదే తరహాలో నిందితులు పలుమార్లు నేరాలు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ప్రజావేదికలో వెలుగు చూసిన అవకతవకలు

దర్శి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలో జరిగిన ఉపాధిపనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. జిల్లా డ్వామా పీడీ జి.జోషప్ కుమార్‌ఆధ్వర్యంలో ప్రజావేదిక జరిగింది. 15 రోజులుగా సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి పనుల్లో జరిగిన అవకతవకలను గుర్తించింది. ఆవివరాలను ప్రజావేదిక సభలో పంచాయతీల వారీగా వివరించారు.మండలంలో 2024ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మొత్తం1,444 పనులను రూ. 19.21కోట్ల విలువైన పనులుజరిగాయి. మొత్తం 5లక్షల 35వేల పనిదినాలు కల్పించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం పలుగ్రామాల్లో ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలను వివరించారు. తొలి రోజు పోతవరం, తూర్పుచవటపాలెం, కొర్లమడుగు,సామంతపూడి, వెంకటాచలంపల్లి, జముకులదిన్న, పెద్దఉయ్యాలవాడ, రాజంపల్లి, మారెడ్డిపల్లి తదిరత గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా మస్టర్లలో అవకతవకలు, పనులకొలతల్లో తేడాలు గుర్తించారు. పలు చోట్ల పని తెలుపు బోరుల్డు ఏర్పాటు చేయలేదని, కూలీలకు నీడ,మంచి నీటి వసతి ఏర్పాటు చేయని విషయాన్ని గుర్తించి వివరాలను ప్రజా వేదికలో వెల్లడించారు. ప్రస్తుతం వెలుగు చూసిన అవకతవకలకు ఎవరు బాధ్యులో సామాజిక తనిఖీ విచారణలో వెల్లడికావాల్సి ఉంది. అవకతవకల వివరాలను వివరించారు. మిగిలిన పంచాయతీలకు ప్రజావేదిక గురువారం నిర్వహిస్తారు. సోషల్ అడిట్‌ప్రొగ్రాం మేనేజర్ ఈశ్వర్, ఆడిటర్ నాగరాజు, ఎంపీపీ సుధారాణి, ఎంపీడీవో వసంతరావునాయక్, ఏపీవో కల్యాణి, మురళి,ఈసీ ప్రసాద్, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మధాతు లోపాలను నివారించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

కావూరివారిపాలెం(చీరాల), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సాగు సమయంలో సూక్ష్మపోషకాల లోపాల నియంత్రణకు రైతులు సన్నద్ధం కావాలని జిల్లా వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్త కృష్ణవేణి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కావూరివారిపాలెంలో ఎన్‌ఎంఈవో(జాతీయ నూనె గింజల మిషన్) పథకం ద్వారా వేరుశనగ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి నిర్మలాదేవీ ఆధ్వర్యంలో శిక్షణలో శాస్త్రవేత్త పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. పైరులో జింకు, జిప్సంలను వినియోగించి సాగు చేయాలన్నారు. అలాగే రసం పీల్చే పురుగుల నియంత్రణకు 5 శాతం వేప గింజల కాషాయాన్ని వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి, ఏఈవో రామారావు, విఏఏ జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

350 మందికి అన్నదానం



శింగరకొండలోని శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలో నిర్వహిస్తున్న అన్నదానం

అద్దంకి, ఆగస్టు20 (ఆంధ్ర జ్యోతి): శ్రీరాముడు జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రం ను పురష్కరించుకొని శింగరకొండలోని శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలో బుధవారం 350 మంది వృద్ధులు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు రామమందిరంలో హరేరామ సంకీర్తనలు ఆలపించారు. శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామవృద్ధుల ఆశ్రమం అధ్యక్షుడు రావూరి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంగా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం

ఘనంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రథమ మహాసభ



జెండాను ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

చీరాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు సంఘటితంగా ఉండి పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం చీరాల పట్టణంలో ఆ సంఘం జిల్లా ప్రథమ మహాసభను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. జెండావిష్కరణ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సామ్రాజ్యం, ప్రాంతీయ నాయకులు ఎన్ బాబురావు, రేఖ ఎలిజబెత్, నెల్లూరు డివిజన్ కార్యదర్శి రామిరెడ్డి, సాగర్, సామేలు, రాజు, సింగయ్య, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, రాజేశ్వరి, సంధ్య తదితర కార్మికులు పాల్గొన్నారు.

నీట్ జాతీయ స్థాయిలో దీప్తికి 3,100ర్యాంక్

మర్రిపూడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నీట్ పీజీ పరీక్షలలో మర్రిపూడికి చెందిన ఇనుకొళ్ల దీప్తిరెడ్డి జాతీయస్థాయిలో 3100ర్యాంక్, రాష్ట్రస్థాయిలో 161వ ర్యాంక్ సాధించింది. రైతు కుటుంబం నుంచి వచ్చన ఆ యువతి పొదిలిలోని ప్రైవేటు పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించింది. విజయవాడలోని ప్రైవేటు పాఠశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. అనంతరం నీట్ పరీక్షలో నెగ్గి గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోసం నిర్వహించిన నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంక్ సాధించింది. దీప్తిరెడ్డిని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెంకటరెడ్డి తహసీల్దార్ జనార్దన్, ఎంపీడీవో ఖాశింపీరా, ఎస్ఐ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి, దీప్తిరెడ్డి తండ్రి మాదిరెడ్డిలు సత్కరించారు. దీప్తిరెడ్డి మాట్లాడుతూ రేడియాలజీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తానని చెప్పారు.

అక్రమాల నిగ్గు తేలేనా?

- డీసీసీబీలో అవకతవకలపై సెక్షన్ 51 విచారణ
- విచారణాధికారిగా గౌరీశంకర్
- 4 నెలల్లో నివేదికకు ఆదేశం

డీసీసీబీలో చోటుచేసుకున్న అవకతవకలపై సెక్షన్ 51 విచారణ సజావుగా సాగేనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకులో వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు ఏ మేరకు వెలుగులోకి వస్తాయన్న సంశయం సహకార శాఖ వర్గాల్లో నెలకొంది. అందుకు గతంలో జరిగిన పరిణామాలు ఊతం ఇస్తున్నాయి. ఒక అధికారిని నాలుగు నెలల క్రితమే విచారణాధి కారిగా నియమించుకోవాలని సహకారశాఖ ఉన్నతాధికారులు సూచించగా జిల్లా ప్రజాప్రతినిధులు వ్యతిరేకించడం, ప్రత్యామ్నాయంగా మరొకరిని వారు సూచిం చినా పట్టించుకోకపోవడం, పైగా తొలుత జిల్లా నేతలు వ్యతిరేకించిన అధికారినే విచారణాధికారిగా నియమిం చడం లాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అక్ర మాలకు పాల్పడ్డ బ్యాంకు ఉద్యోగులు ఇప్పటికే సదరు అధికారికి టచ్‌లోకి వెళ్లారని, ఇక విచారణ అటకెక్కినట్లేనన్న ప్రచారం విస్తృతంగా సాగుతోంది.

ఒంగోలు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. వీటిపై ఎట్టకేలకు కీలకమైన సెక్షన్ 51 విచారణకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం సహకారశాఖ కమిషనర్ కార్యాలయంలో అదనపు రిజిస్ట్రార్ హోదాలో పనిచేస్తున్న వి.గౌరీశంకర్ విచారణాధికారిగా నియమితులయ్యారు. నాలుగు నెలల్లో ఆ విచారణ పూర్తిచేసి ఇవ్వాలని ఆ అధికారిని ఆదేశిస్తూ సహకార శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు ఇచ్చారు.

త్రీమెన్ కమిటీతో విచారణ

బ్యాంకుపై విచారణ విషయంలో తొలుత సహకారశాఖ ఉన్నతాధికారులు అయిష్టంతో ఉండి జాప్యం చేయగా ఉన్నతస్థాయి జోక్యంతో ప్రాథమిక విచారణ చేయించాలని కలెక్టర్‌కు వారు సూచించారు. తదనుగుణంగా గత ఏడాది అక్టోబరులో అప్పుడు ఇక్కడ ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీ సర్‌గా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో జిల్లా ఆడిట్ అధికారి, ఎల్‌డీఎంలతో కూడిన త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమిం చారు. ఆ కమిటీ 15 రోజులపాటు పలు అంశాలపై విచారణ చేసి అనేక అవకతవకలు, భారీగా అవినీతి, అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. కొందరు బ్యాంకు ఉద్యోగుల పాత్ర ఆయా అక్రమాల్లో ఉన్నట్లు తేల్చి నివేదికను ఇచ్చింది. సమగ్ర విచారణ కోసం బ్యాంకుపై సెక్షన్ 51 విచారణ చేయించాలని నవంబరులో కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. దానిపైనా సహకార శాఖ ఉన్నతాధికారులు స్పందించకుండా జాప్యం చేశారు.

విచారణకు సహకరించని ఉన్నతాధికారులు

సక్రమంగా విచారణ పూర్తి కావాలంటే పల్నాడు జిల్లాలో అప్పుడు డీసీసీవో కేడర్‌లో పనిచేస్తున్న ఒక అధికారిని నియమించాలని జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులకు సూచించారు. అయితే కొంతజాప్యం తర్వాత వారి సూచనలకు విరుద్ధంగా జిల్లాలో అందుబాటులో ఉన్న అధికారితో విచారణ చేయించాలని, వీలు కాకపోతే కమిషనర్ కార్యాలయలోని అదనపు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గౌరీశంకర్‌ను వినియోగించుకోవాలని డిసెంబరులో సహకార శాఖ ఉన్నతాధికారులు కలెక్టర్‌కు సూచిస్తూ సెక్షన 51 విచారణకు అనుమతించారు. తాము సూచించిన అధికారిని విచారణకు నియమించకపోవడంపై జిల్లా కీలక ప్రజాప్రతినిధులు అభ్యంతరం చెప్పగా జిల్లాలో సహకారశాఖ అధికారుల పనితీరు పట్ల అప్పటికే తీవ్ర అసంతృప్తితో ఉన్న కలెక్టర్ ఇక్కడే ఆ శాఖ అధికారులతో విచారణకు ఇష్టపడలేదు.

డీసీవోపై వేటు.. పైన అసంతృప్తి

విచారణ ప్రక్రియ అంతటితో ఆగిపోగా అనంతరం ఇక్కడ డీసీవోగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి వ్యవహారంపై ఇటు కీలక ప్రజాప్రతినిధులు, అటు కలెక్టర్ అసంతృప్తితో ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఈ పరిణామాలన్నింటిపైనా సహకారశాఖ ఉన్నతాధికారులు అసంతృప్తితో ఉండి సకాలంలో ఇక్కడ డీసీవో నియామకం చేయకుండా డీసీసీబీలో ఓఎస్‌డీగా ఉన్న డీసీసీవో హోదా కలిగిన ఇందిరాదేవిని ఇన్‌చార్జి డీసీవోగా కలెక్టర్ నియమించారు. దీనిపై ఉన్నతాధికారులు మరింత ఆగ్రహం చెందడం, ఇన్‌చార్జి డీసీవోగా ఇందిరాదేవికి శాఖాపరంగా అవసరమైన గుర్తింపు ఇవ్వకపోవడంతో దాదాపు మూడునెలల పాటు ఆ జిల్లా కార్యాలయ ఉద్యోగులకు జీతాలు కూడా ఆగిపోయి వారు రోడ్డెక్కారు. ఈ అంశాలను వెలుగులోకి తీసుకు వస్తూ ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించడంతో జిల్లా మంత్రి డాక్టర్ స్వామి స్పందించి ఉన్నత స్థాయిలో మాట్లాడటంతో గత నెలలో ఇందిరాదేవికి ఇన్‌చార్జి డీసీవోగా అధికారాలను ఉన్నతాధికారులు ఇచ్చారు. అనంతరం సిబ్బందికి జీతాలు రావడం, ఇతర శాఖపరమైన వ్యవహారాలు సాగుతున్నాయి.

వద్దు అన్న వారినే నియమించారు..



పీడీసీసీ బ్యాంకు కార్యాలయం

డీసీసీబీపై ప్రభుత్వం ఆదేశించిన సెక్షన్ 51 విచారణపై ఈ పరిణామాల అనంతరం మళ్లీ కదలిక వచ్చింది. ఆ విచారణను కమిషనరేట్‌లో అదనపు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గౌరీశంకర్‌ను నియమించుకోవాలని సహకారశాఖ కమిషనర్ కలెక్టర్‌కు సూచిస్తూ సహకార శాఖ ముఖ్య కార్యదర్శి గత నెలలో సర్క్యులర్ ఇచ్చారు. అయితే తదనుగుణంగా సహకారశాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉండగా కలెక్టర్ ద్వారా ఆ ఉత్తర్వులు ఇవ్వాలని జిల్లా అధికారులకు సూచించినట్లు సమాచారం. చివరకు తొలుత జిల్లా ప్రజాప్రతినిధులు వద్దన్న గౌరీశంకరనే విచారణాధికారిగా నియమిస్తూ సెక్షన్ 51 విచారణకు నాలుగు మాసాల్లో పూర్తిచేసి నివేదించాలని కోరుతూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఈ విషయాన్ని ముందుగానే గుర్తించిన కొందరు ఉద్యోగులు ఇప్పటికే విచారణాధికారికి టచ్‌లోకి వెళ్లినట్లు సహకారశాఖ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అలా సంప్రదింపులు జరిపిన వారిలో కొందరిపై లోకేశ్వరరావు కమిటీ నివేదికలో అభియోగాలు ఉన్నాయని అలాంటి వారు ముందుగానే విచారణాధికారిని కలవడం వల్ల ఇక విచారణ ఏ మేరకు పారదర్శకంగా జరుగుతుంది, ఎంతవరకు గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు వెలుగుచూస్తాయన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అసలు విషయమిదీ

బ్యాంకులో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదుల నుంచి ఇప్పటి వరకు అనేక మలుపులతో పెద్ద తతంగమే జరిగింది. గత వైసీపీ పాలనలో డీసీసీబీలకు, పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహించకుండా నామినెటెడ్ కమిటీలతో కాలం వెళ్లబుచ్చారు. ఆ సమయంలో డీసీసీబీ పాలక మండలిగా ఉన్నవారు కొందరు ఉద్యోగులతో కలిసి భారీగా అవినీతి, అక్రమాలకు, నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు ప్రస్తుత ప్రజాప్రభుత్వం వచ్చాక ఉన్నత స్థాయికి ఫిర్యాదులు వెళ్లాయి. సమగ్ర విచారణ చేయించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి కోరారు. జిల్లా మంత్రి డాక్టర్ స్వామి కూడా ఉన్నత స్థాయిలోని వ్యవహారంపై మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

● కారు- ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఘటన

చినగంజాం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం కడవకుదురు గ్రామ సమీపంలోని ఆట్ల ఫ్యాక్టరీ ఎదురుగా చీరాల- ఒంగోలు ఆర్‌అండ్‌బీ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం సోపిరాల గ్రామానికి చెందిన శిఖరం రాము, గంటా నానిలు తమ ద్విచక్ర వావాహంపై నుండి కడవకుదురులోని అట్ల ఫ్యాక్టరీ నుంచి చీరాల, ఒంగోలు ఆర్‌అండ్‌బీ రహదారి మీదగా తమ స్వగ్రామానికి వెళ్లేందుకు వస్తున్నారు. అదేసమయంలో ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామానికి చెందిన రసాని మీరయ్య ఒంగోలు నుండి చీరాల వైపు తన కారులో వెళ్తూ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో శిఖరం రాముకు కుడి కాలుకు తీవ్ర గాయమైంది. గంటా నానికి మొఖం మీద గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన రాముని 108 వాహనంలో చీరాలలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని చినగంజాం పోలీసులు పరిశీలించారు.

ఎరువులు ఉన్నా ఇవ్వరేమిటి..?

● వలపర్ల సొసైటీ పరిధిలో రైతుల ఇక్కట్లు ● నేటి నుంచి పంపిణీ చేస్తామంటున్న సీఈవో ● బయట మార్కెట్‌లో ధరలు అధికం

మార్టూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇవ్వడానికి మండలంలోని వలపర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో యూరియా, డీఏపీ 20-20 ఎరువులు ఉన్నాయి. కాని ఎరువులు కావాలని సొసైటీ భవనం వద్దకు వెళ్లిన రైతులకు మాత్రం ఎరువులను సరఫరా చేయడం లేదు. సొసైటీ సీఈవో అందుబాటులో ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. ఒక వేళ ఆయన ఉన్నా కూడా ఏదో ఒక సాగు చెబుతూ రైతులకు ఎరువులు ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. దాదాపుగా 15 రోజుల నుండి ఎరువులు కోసం రైతులు తిరుగుతున్నారు. ఈ సొసైటీ పరిదిలో వలపర్ల, ద్వారకపాడు, జే.పంగులూరు మండలం రామకూరుకు చెందిన రైతులు ఉన్నారు. వారం రోజులు నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ఈ ఏడాది సాగుకు పొలాలను రైతులు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మొక్కజొన్న, ఇతర పంటలను సాగుచేసే రైతులు పొలాలకు ఎరువుల కోసం సొసైటీ వద్దకు వెళుతున్నారు. వారికి ఎరువులు లేవని చెప్పడంతో ఎరువుల కొరత ఏర్పడుతోందని వాపోతున్నారు.

బయట మార్కెట్‌లో ధర అధికం

ఇక యూరియా బస్తా బహిరంగ మార్కెట్లో సుమారు రూ.350 వరకు ధర పలుకుతోంది. సొసైటీలో రూ.268 రులకే రైతుల చేతికి వస్తోంది. దీంతో ఒక బస్తా యూరియా కొనుగోలులోనే రైతుకు రూ.80లకు పైగానే డబ్బులు ఆదా అవుతున్నాయి. అందువలన రైతులు యూరియా బస్తాలు కోసం సొసైటీకి వస్తున్నారు. కాని సొసైటీ సీఈవో రైతులకు ఎరువులను ఇవ్వకుండా వాటిని పక్కదోవ పట్టించారని కొంతమంది రైతులు ఆరోపిస్తున్నారు. గురువారం ఈ సొసైటీలో కొత్తపాలక వర్గం (త్రిమెన్ కమిటి) పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో మంగళవారం ఏవో లావణ్య సొసైటీలో ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈ రికార్డులలో ఎరువులను రైతులు కొనుగోలు చేసినట్లు సవ్యంగానే ఉందని, ముఖ్యంగా ఈ నెలలో యూరియా బస్తాలను కొనుగోలు చేసి తీసుకువెళ్లిన రైతుల వివరాలను నమోదు చేసిన రికార్డులను సీఈవో తమకు చూపించారన్నారు. ఇదిలా ఉండగా ఈ యూరియా బస్తాలును కొనుగోలు చేశారంటూ బిల్లులలో పేర్లు ఉన్న రైతులను విచారిస్తే నిజానిజాలు బయట పడతాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు.



వలపర్ల సొసైటీ భవనం

ఎరువుల కోసం మూడు రోజులుగా తిరుగుతున్నా

మూడు రోజుల నుంచి డీఏపీ ఎరువులు కోసం జేబులో డబ్బులు పెట్టుకొని సొసైటీ చుట్టూ తిరుగుతున్నాను. కాని ఇంతవరకు ఎరువులు ఇవ్వలేదు. బయట మార్కెట్లో యూరియా బస్తా కొనాలంటే బస్తాకు వంద రూపాయలు ఎక్కువగా పెట్టి కొనాల్సి వస్తోంది.

ప్రత్తిపాటి హనుమంతరావు వలపర్ల



నేటి నుంచి ఎరువులు రైతులకు ఇస్తాం

సొసైటీకి కొత్తపాలకవర్గం వచ్చిన తర్వాత ఎరువులను ఇవ్వాలని అనుకున్నాము. గురువారం కొత్త పాలకవర్గం బాధ్యతలు స్వీకరి స్తోంది. రైతులకు ఎరువులను అందజేస్తాము.

ఈదర నాగేశ్వరరావు, సొసైటీ సీఈవో

నేడు హనుమంతరావు బాధ్యతల స్వీకరణ



మార్టూరు : మండలంలోని వలపర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా కంభంపాటి హనుమంతరావు గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. అదేవిదంగా త్రిమెన్ కమిటీలో మిగిలిన ఇద్దరు డైరెక్టర్లుగా నాతాని మునిబాబు, తన్నీరు అంకమ్మరావులు బాధ్యతలు స్వీకరించనున్నారు. వలపర్లలోని సొసైటీ భవనంలో ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి అదాలత్

మేదరమెట్ల, ఆగస్టు 20,(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యల పరిష్కారానికి అదాలత్ కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు విశ్రాంత జడ్జి, సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎం.విక్టర్ ఇమ్మానుయేల్ అన్నారు. మండలంలోని మేదరమెట్ల నిర్వహించిన అదాలత్ అవగాహన సదస్సులో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. వినియోగదారుల నుంచి సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరించారు. మొత్తం 12 అర్జీలు రాగా అందులో 10 పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామాల్లో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించేం దుకు అదాలత్ చక్కని అవకాశం అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సీజీఆర్ఎఫ్ తరపున విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తు న్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యుడు ఎస్ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ జిల్లా పర్యవేక్షక అధికారి జి ఆంజనేయులు, ఆర్థిక సభ్యులు ఆర్‌సిహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు సునీత, ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న జడ్జీ

నేడు ప్రమాణ స్వీకారోత్సవం



గొట్టిపాటి లక్ష్మయ్య

బల్లికురవ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ పీఏసీఎస్ చైర్మన్‌గా గొట్టిపాటి లక్ష్మయ్య గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు. బల్లికురవ గ్రామానికి చెందిన గొట్టిపాటి లక్ష్మయ్య టీడీపీ పార్టీ సీనియర్ నాయకుడిగా, గతంలో టీడీపీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. టీడీపీ విజయానికి కృషి చేసిన లక్ష్మయ్యను మంత్రి గొట్టిపాటి రవికుమార్ సొసైటీ చైర్‌పర్సన్‌గా నియమించేందుకు సిఫార్సు చేశారు. 14 గ్రామాలకు సంబందించిన బల్లికురవ సొసైటీకి లక్ష్మయ్యను నియమించడంతో బాధ్యతల స్వీకరణ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించేందుకు టీడీపీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు.

నల్ల, తెల్ల బర్లీసాగు చేపడితే చర్యలు : ఏవో

పంగులూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు ఈ వ్యవసాయ సీజనులో నల్ల, తెల్లబర్లీ నారుమడులు పోసినా, సాగుచేపట్టినా చట్టపరంగా చర్యలుంటాయని ఏవో డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని చినమల్లవరం, పంగులూరు గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం నల్ల, తెల్లబర్లీ పొగాకు సాగుపై నిషేదం విధించిందన్నారు. రైతులు ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల వివరాలు ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. కౌలురైతులు సంబందిత అధికారులను సంప్రదించి గుర్తింపుకార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వినయ్, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించాడని కేసు నమోదు

నాగులుప్పలపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించాడంటూ యువకుడిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రేమ వివాహం చేసుకున్న యువకుడికి కోసం మంగళవారం నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన చినగంజాం గ్రామంలోని మార్కెట్ సెంటర్‌కు చెందిన సూదనగుంట ప్రేమ్‌కుమార్ అనే యువకుడు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడు. దూషించి విధుల కు ఆటంకం కలిగించడంతో కానిస్టేబుల్ వెంకటేష్ ఫిర్యాదు మేరకు సదరు యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రజియాసుల్తానా తెలిపారు.

ఎన్నికల హామీలను మరచిన చంద్రబాబు

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి

అద్దంకి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మోసపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభు త్వం ఎన్నికల హామీలను విస్మరించిందని వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం చిన్న హనిమిరెడ్డి అన్నారు. 'రీ కాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టోను' గుర్తుచేస్తూ బుధవారం సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెంలో సంతమాగులూరు మండల నేతలతో, అద్దంకిలోని వైసీపీ కార్యాలయంలో అద్దంకి పట్టణ, మండల నాయకుల తో వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం చిన్నహనిమిరెడ్డి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'బాబుష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను రిలీజ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు జ్యోతి హనుమంతరావు, కాకాని రాధాకృష్ణమూర్తి, కోయి అంకారావు, గునుపూడి రఘురామగుప్తా తదితరులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న హనిమిరెడ్డి

సంతమాగులూరు : మండలంలోని పుట్టా వారి పాలెం అడ్డరోడ్డు జంక్షన్‌లోని ఓ కల్యాణ మండపంలో జరిగిన 'బాబు షూరిటీ, మోసం గ్యారెంటీ' సభను మండల కన్వీనర్ పూట్ల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అద్దంకి నుంచే పోటీ చేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అడవి శ్రీనివాసరావు, ఈదా శ్రీనివాసరెడ్డి, గోలి రమణబాబు, తేలకుట్ల మురహరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశాలల సిబ్బంది సమయపాలన కరువు

● ఒంటిపూట వైద్యంతోనే సరిపెడుతున్న సిబ్బంది
● ఉదయం 10 గంటల తర్వాతే సేవలు

బల్లికురవ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పశువైద్యశాలల సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ప్రతిరోజు పశువులకు ఉదయంపూట వైద్యం అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగులు పట్టణ ప్రాంతాల నుంచి వచ్చి, కొద్దిసేపు ఇక్కడ వైద్యం చేసి వెళ్లిపోతున్నారు. కొన్ని చోట్ల అయితే ఒంటిపూట వైద్యం మాత్రమే అందుబాటులో ఉంటోంది. దీంతో రైతులు తమ పశువులకు అవసరమైన చికిత్సల కోసం ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

బల్లికురవ మండలం కూకట్లపల్లి గ్రామంలోని పశువైద్యశాల బుధవారం ఉదయం 10 గంటలు దాటిన తెరుచుకోలేదు. ఇక్కడ పనిచేసే ఇరువురు ఉద్యోగులు అద్దంకి, నర్సారావుపేట పట్టణాలను నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం 10 గంటల తర్వాత వచ్చి రెండు గంటలు ఉండి వెళుతున్నారని రైతులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం మాత్రమే పశువులకు వైద్యసేవలు చేయాల్సి ఉందని కాని ఒక పూటకే వైద్యశాలలు మూతవేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పొలాలకు వెళ్లిన పశువులు వచ్చే సమయానికి వైద్యశాలలు మూసి ఉంటున్నాయని ఉదయం అయితే పశువులు పోలాలకు వెళ్లాక వైద్యశాలలు తెరుస్తున్నారని సిబ్బంది సకాలంలో వైద్యశాలలు తెరవడం లేదని రైతులు అంటున్నారు. మండలంలోని బల్లికురవ, కె.రాజుపాలెం, ఉప్పుమాగులూరు, అంబడిపూడి గ్రామాలలో పశువైద్యశాలలు ఉన్నాయి. ఈ వైద్యశాలలు కూడా ఒంటిపూటే తెరిచి ఉంటున్నాయని రైతులు అంటున్నారు. గ్రామాలలో ఉన్న సబ్ సెంటర్లు కూడా సిబ్బంది లేక మూసి వేసి ఉంటున్నాయని వెంటనే ఉన్నత అధికారులు స్పందించి పశువైద్యశాలల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



కూకట్లపల్లిలో ఉదయం 10 గంటల తర్వాత మూసే ఉన్న వైద్యశాల

ఎయిడ్స్ రహిత సమాజం లక్ష్యం కావాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి బాలరాజేశ్వరి

పంగులూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, మత్తుపదార్థాల వినియోగ రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బాలరాజేశ్వరి అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులోని ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం. జూనియర్ కళాశాల, స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్ఐవీ, మత్తుపదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్తమార్పిడి, లోపభూయిష్ఠంగా సిరంజీల వినియోగం, అక్రమ లైంగిక సంబధాలతో యువత హెచ్ఐవీ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా చైల్డ్ ఫండ్ ఇండియా, లింక్ వర్కర్స్ యూనియన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, సంస్థ ప్రతినిధి డాక్టర్ విజయశ్రీ, హెచ్ఎం. సోమేపల్లి శ్రీనివాసరావు, పీడీ సీతారామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ టవర్ల నిర్మాణం కారణంగా కమటేశ్వర స్వామి గుడి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు నామ్‌రోడ్డుకు ఇరువైపులా గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు.

‘సాధారణ’ భక్తులకు టికెట్!

- రూ.100 ఇవ్వాలని కోన సిబ్బంది ఒత్తిడి
- ధ్వజస్తంభం వద్ద నగదు వసూలు
- భక్తులు తిరగబడటంతో జారుకున్న వైనం
- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

8 లో..

- వైసీపీ హయాంలో మితిమీరిన రౌడీయిజం
- సుఫారీ తీసుకునే స్థాయికి ఎదిగిన రౌడీలు
- తాజా పరిణామాలతో దృష్టంతా నెల్లూరుపైనే!

రాష్ట్రంలోనే ప్రశాంతతకు నిలయమైన నెల్లూరు జిల్లా అశాంతికి, అరాచకాలకు అడ్డాగా మారిపోయింది. మరీ ముఖ్యంగా ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రౌడీయిజం పతాక స్థాయికి చేరుకుంది. రాజకీయ నాయకులే రౌడీలను పెంచి పోషించడంతో వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. రాత్రి పూట ఒంటరిగా వెళుతున్న వారిని కత్తులతో బెదిరించి డబ్బులు లాక్కొని వెళ్లే స్థాయికి రౌడీయిజం చేరుకుంది. ఇటీవల నమోదవుతున్న కేసులే ఇందుకు నిదర్శనం. తాజాగా జరుగుతున్న పరిణామాలతో రాష్ట్రంలోని అందరి చూపు నెల్లూరుపైనే పడింది. అసలిక్కడ ఏం జరుగుతోందన్న చర్చ మొదలైంది. ఈ పరిస్థితులను పోలీసు శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. నెల్లూరులో అలజడులు రేపుతున్న అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమవుతోంది. రౌడీయిజంపై ప్రధానంగా దృష్టి సారించి, రౌడీమూకల ఆగడాలను అణచివేసేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది.

రౌడీయిజంపై ఉక్కుపాదం!

- ప్రణాళిక రూపొందించిన పోలీసు శాఖ
- ఎస్పీని పిలిచి మాట్లాడిన డీజీపీ





గడిచిన కొన్నేళ్లుగా నెల్లూరులో రౌడీయిజం పెచ్చుమీరుతోంది. వైసీపీ హయాంలో నాయకులకు ప్రధాన అనుచరులుగా ఈ రౌడీలు చలామణి అయ్యారు. వారి అండతో కొత్తగా అనేక మంది ఈ రౌడీ గ్యాంగుల్లో చేరుతూ వస్తున్నారు. మైనర్లు కూడా ఈ జాబితాల్లో ఉండటం గమనార్హం. జిల్లా మొత్తం సుమారు వెయ్యి మంది రౌడీషీటర్లు ఉండగా, వారిలో ఒక్క నెల్లూరు నగర పరిధిలోనే 500 మందికిపైగా ఉన్నారు. సస్పెక్ట్ షీట్లు ఉన్న వారు ఇంతకు రెట్టింపు ఉండడం గమనార్హం. ఈ రౌడీషీటర్ల మూలంగా గడిచిన రెండు, మూడేళ్లలో పదుల సంఖ్యలో హత్యలు జరిగాయి. చిన్న వివాదాలకు కూడా సామాన్యులను చంపేయడం సంచలనం సృష్టించింది. నెల్లూరు రౌడీలు జిల్లా దాటి పక్క రాష్ట్రాల్లో కూడా సుఫారీ హత్యలు చేసే స్థాయికి ఎదిగారంటే పరిస్థితులు ఎంతలా దిగజారాయో అర్థం చేసుకోవచ్చు. ఒంగోలులో టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య, హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగి నాయక్ హత్య కేసుల్లో ప్రధాన నిందితులు నెల్లూరుకు చెందిన ముఠాలే కావడం గమనార్హం. ఈ రౌడీషీటర్లకు అనుచరులుగా చేరుతున్న వ్యక్తులు తొలి దశలో దారి దోపిడీలతో మొదలుపెడుతున్నారు. కొందరు ఆకతాయిలు అయితే ఏకంగా కత్తులు వెంట బెట్టుకొని తిరుగుతూ సామాన్యులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో పోలీసు శాఖ కఠినంగా వ్యవహరించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

ఎస్పీకి డీజీపీ పిలుపు

జిల్లాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఎస్పీ కృష్ణకాంత్‌కు డీజీపీ కార్యాలయం నుంచి పిలుపు అందింది. బుధవారం ఆయన డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను కలిసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా శాంతిభద్రతలకు సంబంధించి అనేక అంశాలపై వారు చర్చించినట్లు సమాచారం. ప్రధానంగా రౌడీషీటర్లు, రౌడీగ్యాంగ్‌ల ఆగడాలు, సెటిల్‌మెంట్లపై దృష్టి పెట్టాలని డీజీపీ సూచించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో నిడిగుంట అరుణ, జీవిత ఖైదీ శ్రీకాంత్ వ్యవహారాలపై కూడా తాజా పరిస్థితులను డీజీపీకు ఎస్పీ వివరించినట్లు సమాచారం. ఈ సమావేశం తర్వాత పోలీసు శాఖలో పరిస్థితులు వేగంగా మారే అవకాశాలు ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

గోదాములో ‘ఇంటి’ దొంగలు

- 900 కిలోల స్టీల్ తరలింపు
- వెంబడించి పట్టుకున్న పోలీసులు
- అధికారులపై అనుమానాలు

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే స్థానిక హౌసింగ్ శాఖ గోదాము వద్ద నిల్వ చేసిన స్టీల్ (ఇనుప చువ్వ)ను గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలో బుధవారం అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. దుత్తలూరు ఏసీ కాలనీ సమీపంలోని హౌసింగ్ గోదాము ఆవరణలో ఉన్న గృహ నిర్మాణాలకు ఉపయోగించే స్టీల్‌ను ఓ వాహనంలో గుర్తుతెలియని వ్యక్తులు లోడ్ చేస్తున్నారు. స్థానికులు వారిని ప్రశ్నించగా పొంతలేని సమాధానం ఇచ్చారు. దీంతో వారు హౌసింగ్ అధికారులకు సమాచారం ఇచ్చి ఫొటోలు పంపారు. వెంటనే అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చుట్టుపక్కల పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేయడంతో సీతారామపురం మండలం పోలంగారిపల్లి వద్ద వాహనాన్ని గుర్తించి స్టీలును స్వాధీనం చేసుకుని దుత్తలూరు స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను విచారించగా తనకేమీ తెలియదని, ఉదయగిరికి చెందిన హౌసింగ్ అధికారి తన వాహనాన్ని బాడుగకు పిలిస్తే వచ్చినట్లు చెప్పారు. కాగా వాహనంలో సుమారు 900 కిలోల బరువు కలిగిన రూ.60 వేలు విలువ చేసే 16 కట్టల స్టీల్‌ను గుర్తించారు. ఈ వ్యవహారం వెనుక హౌసింగ్ శాఖకు చెందిన అధికారుల ప్రమేయం ఉన్నట్లు బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ అధికారిని, మరికొంతమందిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా విషయం తెలుసుకున్న హౌసింగ్ ఈఈ నారాయణరెడ్డి, డీఈ పీరాన్ దుత్తలూరుకు చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్టీల్ తరలింపులో శాఖాపరంగా విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని వారు తెలిపారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు.



పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా స్టీల్ తరలిస్తున్న వాహనం

రూ.2 కోట్ల ఎర్రచందనం పట్టివేత

- కావలిలో పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు



పట్టుబడ్డ ఎర్రచందనాన్ని చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం/కావలి రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కావలి జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించి రూ.2 కోట్ల విలువ చేసే 83 ఎర్రచందనం దుంగలను పట్టుకున్నారు. ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసి, లారీని సీజ్ చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్, ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం, కావలి టూటౌన్, వన్‌టౌన్, రూరల్ పోలీసుల సహకారంతో మంగళవారం రాత్రి నుంచి విజయవాడ-చెన్నై రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో రెండు కార్లు, ఒక లారీ అటువైపు వేగంగా వచ్చాయి. టాస్క్‌ఫోర్సు పోలీసులను గమనించిన రెండు కార్లు యూటర్న్ చేసుకుని వెనక్కి వెళ్లిపోయాయి. టాస్క్‌ఫోర్సు పోలీసుల పైకి లారీ దూసుకురాగా.. అప్రమత్తమైన సిబ్బంది తప్పించుకుని లారీని వెంబడించారు. లారీలోని వ్యక్తులు దూకి పారిపోగా ఒకరిని పట్టుకోగలిగారు. ఆ స్మగ్లర్ హరియాణాకు చెందిన వాడిగా విచారణలో తేలింది. లారీలో పరిశీలించగా 83 ఎర్రచందనం దుంగలు లభించాయి. రెండున్నర టన్నుల బరువున్న ఈ దుంగల విలువ రూ.రెండు కోట్ల వరకు ఉంటుందని అంచనా. పట్టుబడ్డ స్మగ్లర్‌ను దుంగల సహా లారీని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎస్ఐ రఫీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనవరికల్లా అభివృద్ధి పనులు పూర్తవ్వాలి

- అధికారులకు డీఆర్ఎం ఆదేశాలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు జనవరికల్లా పూర్తిచేయాలని విజయవాడ డీఆర్ఎం (డివిజనల్ రైల్వే మేనేజర్) మోహిత్ సోనాకియా రైల్వే అధికారులను ఆదేశించారు. డీఆర్ఎంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి నెల్లూరుకు వచ్చారు. తొలుత ప్రధాన రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పథకం పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తిచేసి జనవరికల్లా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం బిట్రగుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా ఆయన పరిశీలించారు.

ఇసుక బుకింగ్‌లో అడ్డగోలు నిర్ణయాలు

ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో తీసుకొచ్చిన ‘ఉచిత ఇసుక పాలసీ’కి కొందరు మైనింగ్ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. సాఫీగా సాగిపోతున్న ఇసుక బుకింగ్ విధానంలో అడ్డగోలుగా మార్పులు చేసి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు. ఒక భవన నిర్మాణదారుడు నెలకు ఒక లోడ్ ఇసుక మాత్రమే తీసుకెళ్లాలంటూ నిబంధన విధించారు. రెండో లోడ్ బుకింగ్ చేసుకునేందుకు వీల్లేకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. మూడు రోజుల క్రితం ఈ మార్పులు చేయగా, అప్పటి నుంచి నిర్మాణదారులకు కష్టాలు మొదలయ్యాయి. ఈ కొత్త నిబంధనలతో ప్రజల నుంచి జిల్లా మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు క్యూ కడుతున్నాయి.




- ఒక్కొక్కరికి నెలకొక బుకింగ్ మాత్రమేనట!
- ఒక లోడ్‌ను నెల మొత్తం సర్దుకోవాలంటూ నిబంధన
- మైనింగ్ అధికారుల తీరుపై విమర్శలు
- ప్రభుత్వ ‘ఉచిత పాలసీ’కి తూట్లు

ఇసుక కష్టాలు మళ్లీ మొదలైనట్టే!

నెల్లూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) :చిన్నపాటి ఇళ్లు నిర్మించుకోవాలన్నా కనీసం పది ట్రాక్టర్ల ఇసుక అవసరమవుతుంది. అలానే పెద్ద నిర్మాణాలకు దాని స్థాయిని బట్టి ఇసుక వినియోగం జరుగుతుంటుంది. ప్రస్తుతం సీజన్ కావడంతో భవన నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. అక్టోబరు నుంచి వర్షాకాలం కావడంతో ఆలోపు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని చాలా మంది తొందరపడుతున్నారు. అయితే ఇప్పుడు ఇసుక బుకింగ్‌లో రాష్ట్ర మైనింగ్ అధికారులు చేసిన మార్పులతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటివరకూ ఇసుక అవసరమైన వ్యక్తులు వెబ్‌సైట్‌లో అన్ని వివరాలతో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. వారి ఇళ్లు లేదా భవనం ప్లాన్‌ను బట్టి ఇసుకను బుకింగ్ చేసుకునేందుకు ఇప్పటివరకూ అవకాశం ఉండేది. అంటే ఇంటి నిర్మాణదారుడు ఒక నెలలో తనకు సరిపడినంత ఇసుకను తీసుకెళ్లేందుకు అవకాశముండేది. కానీ కొత్త నిబంధనలతో ఒక వ్యక్తి నెలలో ఒక లోడ్‌ను మాత్రమే బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. అంటే ఒక ట్రాక్టర్ లేదా టిప్పర్ ఇసుకను ఇప్పుడు బుకింగ్ చేసుకుంటే, మరో నెల రోజుల వరకూ ఆ వ్యక్తికి ఇసుక దొరకదన్నమాట!

నిర్మాణ పనులకు ఆటంకం

కొత్త నిబంధనతో చాలా మంది నిర్మాణదారులకు ఇసుక దొరక్క నిర్మాణాలు ఆపేసుకుంటున్నారు. అత్యవసరమైన వారు ఎక్కువ ధరకు బ్లాక్‌లో కొనుగోలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం పోతిరెడ్డిపాడు, సంగం, విరువూరు, సూరాయపాలెం, పడమటికంభంపాడు ప్రాంతాల్లోని యార్డుల నుంచి ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు అక్టోబరు 15వ తేదీ వరకూ నదుల్లో ఇసుక తవ్వకాలు జరపకూడదు. దీంతో ట్రాక్టర్లు కూడా ఈ యార్డుల నుంచే ఇసుకను కొనుగోలు చేస్తున్నాయి. సాధారణంగా ప్రతి యార్డు నుంచి సరాసరి రోజుకు 300 నుంచి 400 టన్నుల ఇసుక విక్రయాలు జరుగుతుండగా, గడిచిన మూడు రోజుల నుంచి అది సగానికి పడిపోయినట్లు తెలుస్తోంది. ఇసుక కోసం యార్డుల వద్దకు వచ్చాక వారికి బుకింగ్ జరగకపోవడంతో తిరిగి వెనక్కు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. కాగా బుకింగ్ సమయంలో ఓటీపీ సమస్య కూడా తీవ్రంగా ఉన్నట్లు రవాణాదారులు చెబుతున్నారు. సకాలంలో ఓటీపీ రావడం లేదని, వచ్చినా వెంటనే సమయం మించిపోతోందని అంటున్నారు. కేవలం ఒక నిముషంలో ఓటీపీ ఎంటర్ చేయకపోతే ఆ బుకింగ్ రద్దవుతోందని వాపోతున్నారు. రాష్ట్రస్థాయిలోని కొందరు అధికారులు ఉచిత ఇసుక పాలసీను అబాసుపాలు చేయాలన్న కుట్రతోనే ఇటువంటి నిబంధనలు పెడుతున్నారంటూ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కాగా దీనిపై మైనింగ్ డీడీ శ్రీనివాసరావును వివరణ కోరగా, నెలకొక బుకింగ్ చేసుకోవాలన్న నిబంధన రెండు రోజుల క్రితమే వచ్చినట్లు చెప్పారు. దీనిపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, ఆ విషయాన్ని రాష్ట్ర అధికారులకు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వెల్లడించారు.



ఒక ఐడీతో నెలకు ఒక బుకింగ్ మాత్రమే చేసుకోవాలంటూ చూపుతున్న వెబ్‌సైట్

అనధికార పొగాకు పరిస్థితి ఏంటి!?

- త్వరలో ముగియనున్న కొనుగోళ్లు!
- అనధికార పొగాకుకు అనుమతి ఏదీ?
- నిలిచిన కలిగిరి.. అదేదారిలో కందుకూరు, డీసీ పల్లి
- అపరాధ రుసుముపైనా కొనసాగుతున్న సస్పెన్స్
- పొగాకు రంగు మారుతోందని రైతుల ఆందోళన

కందుకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్న పొగాకు రైతులను కొత్త సమస్య వెంటాడుతోంది. ధర లేక నోబిడ్‌లు, సీఆర్‌లతో పొగాకు వేలంలో విపరీతమైన జాప్యం జరిగి ఇప్పటికే రంగుమారి నష్టపోయిన రైతులకు అనధికారిక పొగాకు అమ్మకాలకు అనుమతులు రావడంలో జాప్యం జరుగుతోంది. ఏటా ఆగస్టు నెలాఖరు నాటికి పొగాకు విక్రయాలు అనధికారిక పొగాకుతో సహా దాదాపుగా పూర్తయ్యేవి. సెప్టెంబరు ద్వితీయార్థం నుంచి పొగనాట్లు సీజన్ మొదలయ్యేది. కానీ ఈ ఏడాది నేటికీ అధికారిక పొగాకు విక్రయాలే పూర్తికాకపోగా మార్గదర్శకాలు కూడా విడుదలకాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతు న్నారు. జిల్లాలో ఇప్పటికే కలిగిరి వేలం కేంద్రంలో అధికారిక పొగాకు అమ్మకాలు పూర్తవ డంతో ఆ వేలం కేంద్రం ప్రస్తుతం నిలిచిపోయింది. కందుకూరు-2 వేలం కేంద్రంలోనూ ఈ వారంలో అధికా రిక పొగాకు అమ్మకాలు పూర్తవు తుండగా డీసీ పల్లిలో కూడా రెండు మూడు రోజుల్లో అధికారిక పొగాకు అమ్మ కాలు పూర్తవుతాయని, కందుకూరు-1లో మరో పది రోజుల్లో పూర్తవుతుందని బోర్డు అధికారులు తెలిపారు.



కందుకూరులో వేలానికి ఉంచిన పొగాకు బేళ్లు

60 శాతంపైగా అనధికారిక పొగాకు

గత రెండేళ్లలో పొగాకు సాగు లాభసాటిగా ఉండటంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరగటం, వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు పెరిగి అనుమతించిన పొగాకు కన్నా దాదాపు 60శాతం వరకు అదనంగా పొగాకు ఉత్పత్తి జరిగింది. కందుకూరు-1లో 11 మిలియన్లకు పొగాకు బోర్డు అనుమతించగా 18 మిలియన్ల వరకు పొగాకు ఉత్పతి జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు 10.2 మిలియన్ల పొగాకు అమ్ముడవగా, కిలోకు రూ.248 సరాసరి ధర రైతులకు లభించింది. వారం, పది రోజుల్లో అధికారిక పొగాకు అమ్మకాలు పూర్తికానున్నాయి. అలాగే కందు కూరు-2లో 9.5 మిలియన్లకు అనుమతించగా ఇప్పటి వరకు 8.5 మిలియన్ల అమ్మకాలు పూర్తవగా కిలోకు రూ.243.92 సరాసరి ధర లభించింది. ఈ వేలం కేంద్రంలోనూ 14.5 మిలియన్ల పొగాకు ఉత్పత్తి అయినట్లు అంచనా. అంటే దాదాపు 5 మిలియ న్లు అదనంగా పండించారు. అలాగే కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాల పరిధిలోనూ 50శాతం వరకు అదనంగా పండించిన పొగాకు ఉన్నట్లు బోర్డు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో

- మిగతా 7లో..

సీతారామపురం తహసీల్దార్ సస్పెన్షన్

సీతారామపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా సమస్యాత్మక భూమిని మ్యూటేషన్ చేశారన్న ఆరోపణలపై తహసీల్దార్ వీవీ కృష్ణారెడ్డి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీతారామపురంలోని సర్వే నెం.68-5లో 0.81 సెంట్ల భూమికి సంబంధించి తోట నరసింహులు, ఈయన బంధువుల మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి నిబంధనలకు విరుద్ధంగా ఒకవర్గం వారికి 0.40 సెంట్ల భూమిని మ్యుటేషన్ చేశారని ఆరోపిస్తూ మరోవర్గం వారు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో వాస్తవమని తేలింది. దీంతో తహసీల్దారును సస్పెండ్ చేస్తూ బుధవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నిధుల దుర్వినియోగంపై ఏటూరు సర్పంచుకు షోకాజ్ నోటీసు

చేజర్ల: పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు చేజర్ల మండలం ఏటూరు సర్పంచ్ వై.నాగభూషణమ్మకు డీపీవో శ్రీధర్ రెడ్డి షోకాజ్ నోటీసు అందజేశారు. వాస్తవానికి ఈ నెల 11వ తేదీన షోకాజ్ నోటీసు జారీ చేసినా మండల అధికారులు గోప్యంగా ఉంచారు. అనూహ్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. ఏటూరు పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ జూన్ 10వ తేదీన గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. డివిజన్ పంచాయతీ అధికారి విచారించి తుది నివేదికను జూలై 28న డీపీవోకు అందజేశారు. రూ.44 వేలు దుర్వినియోగం చేయడంతో పాటు రూ.23,36,319 అభ్యంతకర రీతిలో ఖర్చు చేసినట్లు గుర్తించారు. వారం రోజుల్లోపు వివరణ ఇవ్వాలని సర్పంచుకు డీపీవో షోకాజ్ నోటీసు ఇచ్చారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 525

హెచ్ఐవీ సంబంధిత వ్యాధులపై అవగాహన

అల్లూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ సంబంధిత వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ జే.రూత్‌బేనోమి అన్నారు. జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సార్ప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా అల్లూరు రామకృష్ణ డిగ్రీ కళాశాల, నాగాలమ్మ కాలువ కట్ట ప్రాంతాల్లో బుధవారం హెచ్ఐవీ అనుబంధ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది, ఎలా వ్యాపించదు అనే అంశంతోపాటు అనుబంధ వ్యాధులైన క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఫీల్డ్ స్టాఫ్ జయమ్మ, అనిత, కృష్ణవేణి, రేవతి తదితరులు పాల్గొన్నారు.



జలదంకి ఎంఈవో-1గా పద్మనాభరావు



ఎంఈవో-1గా బాధ్యతలు స్వీకరిస్తున్న పద్మనాభరావు

జలదంకి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఎంఈవో-1గా నందనవనం పద్మనాభరావు బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న శ్రీధర్ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పద్మనాభరావును ఎంఈవో-2 నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

పీఏసీఎస్ అధ్యక్షుడు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన అధ్యక్షుడితో సభ్యులు, అధికారులు

కొండాపురం,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడవల్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడు, సభ్యులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాయిపేటలో ఉన్న సొసైటీ కార్యాలయంలో అధ్యక్షుడిగా కుంకు మోహనరావు, కార్యవర్గ సభ్యులుగా మాలేపాటి స్రవంతి, కాకుటూరు రాఘవులు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మోహనరావు మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని రైతులకు ప్రభుత్వం ద్వారా అందే అన్ని పథకాలను అందేలా చూస్తానన్నారు. ఈసందర్భంగా పలువురు రైతులు అధ్యక్షుడిని, సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ. బీజేపీ. జనసేన నాయకులు, సొసైటీ సీఈవో మాల్యాద్రి, వీపీఏ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విట్స్‌లో మెగా వైద్య శిబిరం

కావలి(టౌన్), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నెల్లూరు మెడికవర్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుండె వైద్యనిపుణులు డాక్టర్ బాలకృష్ణ మాట్లాడారు. ప్రతిఒక్కరూ గుండె ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. గైనకాలజిస్ట్ మన్నెం అనూష మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్ రాకుండా వ్యాక్సినేషన్ చేయించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు, అధ్యాపకులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా ది ఫూర్ పీపుల్స్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో మెడికవర్ ఆసుపత్రి అంకాలజిస్ట్ డాక్టర్ హరిప్రియ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చేవూరి చిన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో చెప్పారు.ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని తెలిపారు.

పరిమితికి మించితే ప్రమాదం జరగదా..!?

● కిక్కిరిసి ఆటోల్లో ప్రయాణం ● బస్సు సౌకర్యం లేక విద్యార్థుల అగచాట్లు

కలిగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలలకు ప్రయాణించే ఆటోలు పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళుతున్నా యి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణానికి దూరంగా ఉన్న హైస్కూల్, ఏపీ మోడల్‌స్కూల్‌కి వెళ్లే విద్యార్థులకు సరైన రవాణా సౌకర్యంలేదు.దీంతో ఆటోల్లో ప్రయాణాలు చేయాల్సి వస్తున్నది. జడ్పీ, మోడల్ స్కూల్‌కి సుమారు 1000మంది విద్యార్థులు నిత్యం వెళుతుంటారు. పట్టణప్రాంతంలోని విద్యార్థులను వారి తల్లిదండ్రులు సైకిళ్లపై పంపడమో లేదా మోటార్‌సైకిళ్లపై తీసుకువెళ్లి వదలేసి రావడమో చేస్తారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఆటోలపై ఆధారపడాల్సి వస్తుంది. ఈ క్రమంలో ఆటోవాలాలు ముగ్గురు, నలుగురు విద్యార్థులను తీసుకువెళితే.. తమకు గిట్టుబాటు కాదని, సుమారు 10 నుంచి 15మందిని తీసుకువెళుతున్నారు. ఇలా తీసుకువెళ్లే క్రమంలో ఆటోలో డ్రైవరుకు ఇరుపక్కల విద్యార్థులు కూర్చోవడంతోపాటు. పుస్తకాల బ్యాగులతో ఆటోల వెనుక ప్రమాదకంగా ప్రయాణించడం కనిపిస్తున్నది. తమ చిన్నారులు క్షేమంగా ఇళ్లకు చేరాలంటే సాయంత్రం సమయంలో ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు

అల్లూరులో ప్రతాప్ దిష్టిబొమ్మ దహనం



అల్లూరులో ప్రతాప్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు



కావలి ఎంపీడీవో కార్యాలయంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు

అల్లూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే అనుచరులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై అల్లూరులో బుధవారం సాయంత్రం కూటమి నేతలు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సోమశిల ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ మాట్లాడుతూ ప్రతాప్ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టి పాతబస్టాండు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, సామంతుల పరంధామిరెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, రేబాల శంకర్‌రెడ్డి, పాపనబోయిన రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

● హత్యాయత్నం కోసమే డ్రోన్ చిత్రీకరణ

కావలి,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిపై హత్యాయత్నం కోసమే అన్నవరంలోని ఆయన క్వారీలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ డ్రోన్ చిత్రీకరణ చేయించారని కూటమి నేతలు ఆరోపించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కండ్లగుంట మధుబాబునాయుడు, పోట్లూరు శ్రీనివాసులు, తటవర్తి వాసు, తిరువీధి ప్రసాద్, జనిగర్ల హేంద్ర, దేవకుమార్, అయేషా బేగం, యల్లంటి వెంకటేశ్వర్లు, బీజేపీ నేతలు బెల్లంకొండ మాల్యాద్రి, జనసేన నేతలు పొబ్బాసాయి విఠల్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. చిత్రీకరణకు వెళ్లినవారు మారణాయుధాలతో వెళ్లటమే కాకుండా, రౌడీషీటర్లను ఎందుకు తీసుకుపోయారని ప్రశ్నించారు. ఎవరి పాలనలో అక్రమకేసులు పెడతున్నారో అందరికీ అర్థమవుతోందని వారన్నారు.

● ఎమ్మెల్యేపై హత్యాయత్నం దుర్మార్గపు చర్య

అల్లూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యేపై హత్యాయత్నం దుర్మార్గపు చర్య అని టీడీపీ సీనియర్ నాయకుడు బండి అమర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనను ఖండిస్తూ సింగపేటలో బుధవారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పదేళ్ల ఎమ్మెల్యేగా ఉంటూ ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఇదేనా నేర్చుకున్నదని మండిపడ్డారు. ఇటువంటి దుర్మార్గపు ఆలోచనలు కలిగి ఉండటాన్ని ప్రజలు విశ్వసించరని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లపోలు రామకృష్ణారెడ్డి, చాగంటి రామకృష్ణారెడ్డి, దివి ప్రసాద్, శ్రీహరి, గంటా కుమార్, పులి వెంకట రమణయ్య, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేను హతమార్చేందుకే రెక్కీ

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డిని హతమార్చేందుకే అన్నవరం క్రషర్ వద్ద మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అనుచరులు డ్రోన్‌తో రెక్కీ నిర్వహించారని టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ పేర్కొన్నారు. పట్టణ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం రూరల్ మండల టీడీపీ నేతలు నల్లబ్యాడ్జీలతో నిరసన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉప్పాల వెంకట్రావు, చింతం బాబుల్ రెడ్డి, మక్కి శ్రీహరి, నూరె జయశ్రీ, సోమయ్యగారి రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే చలంచర్ల గ్రామంలో గుర్రం సునీల్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమం లో స్థానిక టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలు బయటపడతాయనే ఆరోపణలు : వైసీపీ

కావలి(టౌన్), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి చెందిన అన్నవరం క్వారీలో అవినీతి, అక్రమాలు బయటపడతాయనే హత్యాయత్నం ఆరోపణలు చేస్తున్నారని వైసీపీ నేతలు ఆరోపించారు. బుధవారం ముసునూరులోని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో వైసీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి నారాయణ, గంధం ప్రసన్న, పందిటి కామరాజు, కుందుర్తి కామయ్య, వీరరఘు తదితరులు విలేకరులతో మాట్లాడారు. క్వారీలో జరిగిన అవినీతి, అక్రమాలు వెలికితీసేందుకు వైసీపీ మీడియా చూస్తున్న వేణు డ్రోన్ ఆపరేటర్‌తో కలిసి ఫొటోలు చిత్రీకరించడం తప్పా అని ప్రశ్నించారు. వారిని పట్టుకుని చితకబాదడం అప్రజాస్వామ్యమన్నారు. ఇలాంటి బెదిరింపులకు భయపడమని, న్యాయపోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.

సబ్ కలెక్టరును కలిసిన మాజీ ఎమ్మెల్యే



సబ్‌కలెక్టర్‌కి పుష్పగుచ్ఛం అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

కందుకూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టరుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన దామెర హిమవంశీని మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం, కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి మండలి సభ్యులు బుధవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను వారు సబ్ కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. శివరాం వెంట అభివద్ధి మండలి సభ్యులు పాలేటి కోటేశ్వరరావు, తోకల వెంకటేశ్వర్లు, కాకుమాని మాధవరావు తదితరులున్నారు.

సర్ రోనాల్డ్‌రాస్‌కి నివాళి

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో బుధవారం వైద్యశాస్త్రంలో నోబెల్‌బహుమతి పొందిన డాక్టర్ సర్ రోనాల్డ్‌రాస్ చిత్రపటానికి వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, వైద్యసిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సాయిలక్ష్మి, సీహెచ్ఎన్ఎఫ్ మేరి సిబ్బంది పాల్గొన్నారు.

తీగలు మార్చారు.. స్తంభాన్ని అలా ఉంచేశారు!

కావలి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ రోడ్డులో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉండేది. స్థానికుల ఫిర్యాదుల మేరకు స్తంభాన్ని మార్చేందుకు దానికి ఉన్న తీగలను అధికారులు తొలగించారు. అయితే అక్కడ ఉన్న స్తంభాన్ని తొలగించకుండా అలాగే వదిలి వేశారు. దీంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి వెంటనే రోడ్డుపై ఉన్న స్థంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



రథం నిర్మాణ పనుల ప్రారంభం



రథం నిర్మాణ పనులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

ఉలవపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో రథం నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాల నాటికి పనులు పూర్తి చేసి, రథోత్సవం నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ముందుగా స్వామివారి దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్. సుబ్బారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రసాయనిక ఎరువుల వాడకంతో తగ్గనున్న భూసారం

● బిట్రగుంట మండల వ్యవసాయ అధికారిణి శైలజ

బిట్రగుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గి పంటకు సాగుకు అధికంగా ఖర్చు అవుతుందని మండల వ్యవసాయ అధికారిని బీ.శైలజ తెలిపారు.

? : పంటల సాగుకి పెరుగుతున్న పెట్టుబడులకు రైతులకు ప్రభుత్వం ఎటువంటి సహాయం అందిస్తుంది.

! : రైతుల వ్యవసాయానికి సంబంధించి అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం ద్వారా మూడు విడతలుగా 20 వేల రూపాయలు పెట్టుబడికి ప్రభుత్వం అందచేస్తుంది. ప్రభుత్వం రాయితీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందచేస్తు వ్యవసాయాని ప్రోత్సహిస్తుంది.

? : ప్రభుత్వ పథకాలు రైతులు పొందాలంటే ఏం చేయాలి.

! : ప్రతి రైతు విధిగా పంటసాగు వివరాలను ఈ పంట యాప్‌లో నమోదు చేసుకోవాలి, దానిని ప్రామాణికంగా తీసుకొని రైతులకు ప్రభుత్వ పథకాలు అందచేయడం జరుగుతుంది.

?: వ్యవసాయంలో కూలిల కొరతను ఎలా అధిగమిస్తారు.

! : వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా తక్కువ సమయంలో కూలిలు లేకుండా సులభంగా పనులు చేసుకోవచ్చు

? : కౌలు రైతుల పథకాలు వివరించండి

! : ప్రతీ కౌలు రైతు సీసీఆర్‌సీ కార్డు తీసుకుంటే, వారికి రూ. 20 వేల పెట్టుబడి సాయం అందుతుంది. మద్దతుకు ధాన్యం అమ్ముకునేందుకు వీలుంటుంది.

? : భూసారం పెంచుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలి.

! : రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, పంటకు ముందు భూమిలో సారం పెంచేందుకు పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలి. పశువుల ఎరువును నేలకు అందించాలి.

ఖాతాల్లో నగదు జమ కాకుంటే
ఆర్ఎస్‌కేలో సంప్రదించాలి



లింగసముద్రం : వరి పైరును పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి హర్షవర్థన్ తదితరులు

కందుకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం నగదు ఖాతాకు జమకాని రైతులు తగిన ఆధారాలతో ఆర్ఎస్‌కేలో సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి ఎస్‌కె అబ్దుల్‌రహీం కోరారు. మండలంలోని కొండికందుకూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌కేలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏవో మాట్లాడారు. ప్రతిరైతుకు అన్నదాత సుఖీభవ పథకం నిధులు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో నరిశెట్టివారిపాలెం సర్పంచి ముప్పా శ్రీనివాసులు, వీపీఏ శిరీష తదితరులు పాల్గొన్నారు

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : రైతులు తాము సాగు చేసిన పైర్ల వివరాలను తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి కే. హర్షవర్ధన్ చెప్పారు.బుధవారం ఆయన మండలంలోని చినపవని, పెదపవని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో సాగు చేసిన వరి పైరును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏ హరికృష్ణ, ఏఎంసీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● పచ్చిరొట్ట విత్తనాలతో ప్రయోజనం

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలతో రైతుకు ప్రయోజనం చేకూరుతుందని వింజమూరు ఏడీఏ శేషగిరిరావు పేర్కొన్నారు. బుధవారం నాగసముద్రంలో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జహీర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటరత్నం, ఏఈవో చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.

త్వరలో ముగియనున్న పొగాకు కొనుగోళ్లు!

(5వ పేజీ తరువాయి)

మొత్తం పొగాకు అమ్మకాలు పూర్తవ్వాలంటే ఈ ఏడాది నవంబరు వరకు వేలం కేంద్రాలు నిర్వహించాల్సి రావచ్చని, అయితే నేటికీ అనధికారిక పొగాకు కొనుగోళ్లకు బోర్డు, కేంద్ర వాణిజ్యశాఖల నుంచి అనుమతులు రాకపోవడం ఆందోళన కలిగిస్తోందని రైతులు వాపోతున్నారు.

● అపరాధ రుసుముపైనా సస్పెన్స్

అనధికారిక పొగాకు విక్రయాలపై గతంలో ఉన్న అపరాధ రుసుమును కేంద్ర వాణిజ్య శాఖ రద్దు చేయడం రైతులకు ఊరటనిచ్చింది. బోర్డు అనుమతికి మించి పండించిన పొగాకు అమ్ముకోవాలంటే రైతులు క్వింటాకు రూ.200, మొత్తం విలువలో 5 నుంచి 15 శాతం వరకు బోర్డుకు అపరాధ రుసుము చెల్లించే విధానం గతంలో అమలులో ఉండేది. గత రెండేళ్ల అపరాధ రుసుము పూర్తిగా మినహాయింపు ఇవ్వటంతో రైతులకు లక్షలాది రూపాయలు లబ్ధి చేకూరింది. ఈ తరుణంలో ఈ ఏడాది అనధికారిక పొగాకు దిగుబడి అధికంగా ఉన్నందున అపరాధ రుసుము చెల్లించాలంటే ప్రతి రైతుకు వేలాదిరూపాయలు అదనపు భారం పడే అవకాశం ఉంది. ఈ స్థితిలో ఈ ఏడాది కూడా అపరాధ రుసుము మినహాయింపు ఇస్తూ అనధికారిక పొగాకు కొనుగోళ్లకు తక్షణం అనుమతులు వచ్చేలా చూడటం ద్వారా వేలం కేంద్రాలు నిలిచిపోకుండా వేలం ప్రక్రియ జరిగేలా చూడాలని రైతులు కోరుకుంటున్నారు.

● ధరలో కదలిక.. చిగురిస్తున్న ఆశలు

పొగాకు వేలం కేంద్రాల్లో అధికారిక పొగాకు విక్రయాలు పూర్తయ్యేదశలో ధరల్లో కదలిక ప్రారంభం కావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కొన్ని నెలలుగా అత్యధిక ధరపై కిలోకు రూ.280 వద్ద సీలింగ్ పెట్టి కొనుగోళ్ల చేస్తూ వచ్చిన వ్యాపారులు 2, 3 రోజులుగా సీలింగ్ పరిధి దాటి నాణ్యమైన పొగాకు బేళ్లకు రూ.281 ధర వేస్తుండటం విశేషం. అలాగే లో గ్రేడ్‌లు, మీడియం గ్రేడ్‌ల పొగాకుకు కూడా క్వింటాకు రూ.వెయ్యి వరకు ధరపెంచి కొనుగోళ్లు చేస్తున్నారు. సీలింగ్ పరిధి దాటి ధర పెట్టినందున రానున్న రోజుల్లో ధర పెరిగే అవకాశాలు లేకపోలేదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆశతో రైతులు ప్రస్తుతం నాణ్యమైన పొగాకును వేలంకు పెట్టకుండా లో గ్రేడ్‌లు, మీడియం గ్రేడ్‌లనే అధికంగా తెస్తున్నారని హైగ్రేడ్ పొగాకు బేళ్లను కోల్డ్‌స్టోరేజీల నుంచి బయటకు తీస్తే ధర మరికొంత పెరిగే అవకాశం లేకపోలేదని బోర్డు అధికారులు సైతం అభిప్రాయపడుతున్నారు. అనుమతుల కోసం వేలం కేంద్రాలను నిలిపివేయాల్సిన పరిస్థితి రాకుండా అధికారిక పొగాకు విక్రయాలు పూర్తయ్యేలోపే అనధికారిక పొగాకు విక్రయాలపై మార్గదర్శకాలు వస్తే రైతుకు మేలు జరుగుతుందని ఆ దిశగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డీటీసీకి కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లు అందచేస్తున్న కరస్పాండెంట్ విజయ్‌శ్రీనివాస్

కందుకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శిక్షణ కళాశాల(డీటీసీ)లో కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభం కాబోతున్న సందర్భంగా స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం రెండు కంప్యూటర్లను ఉచితంగా అందజేసింది. కరస్పాండెంట్ కే. విజయ్‌శ్రీనివాస్ బుధవారం ఈ కంప్యూటర్లను రూరల్ ఎస్ఐకు అందజేసి డీటీసీకి చేర్చాలని కోరారు. కానిస్టేబుళ్లకు సైబర్‌క్రైంపై అవగాహన, నూతన సాంకేతికతపై శిక్షణ నిచ్చేందుకు ఈ కంప్యూటర్లు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థుల స్థాయికి తగ్గట్టు బోధన

దగదర్తి, (బిట్రగుంట), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్థాయికి తగిన విధంగా విద్యాబోధన అందించాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు ఉపాధ్యాయులకు సూచించారు. దగదర్తి మండల కేంద్రం, ఉచగుంటపాలెం జడ్పీహైస్కూళ్లను, దగదర్తి బీసీ, భవితా సెంటర్, తడకలూరు మోడల్ పాఠశాలలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. అలాగే దగదర్తి జడ్పీహైస్కూల్‌లో మధ్యాహ్న భోజన మెనూ నిర్వహణను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంఈవో భాస్కర్‌కు గ్రంథాలయ పుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవో భాస్కర్‌కు పుస్తకాలు అందచేస్తున్న ఏఎంవో సుధీర్‌బాబు

గణేష్ విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

కావలి(టౌన్), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి) : పట్టణ బ్రిడ్జి కూడలిలో బుధవారం గణేష్ విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు సిద్ధు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు విక్రమ్ రెడ్డి, అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కందుకూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరురోడ్డులో 11కేవీ ఫీడర్‌లో లైన్‌వర్క్ ఉన్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పట్టణ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. గాయత్రీనగర్, కొత్తకుమ్మరిపాలెం, ప్రశాంతినగర్, సింహాద్రినగర్, ఎర్రవడ్డిపాలెం, పామూరుబస్టాండ్ ఏరియా, వెంకటేశ్వరనగర్ ప్రాంతాలకు ఉదయం గం. 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

అర్థం అయ్యేలా బోధించాలి

లింగసముద్రం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : 1, 2 తరగతుల విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని ప్రకాశం జిల్లా షైనంపాడు డైట్ లెక్చరర్ విజయకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని వెంగళాపురం ప్రాథమిక పాఠశాలను, పెదపవనిలోని జడ్పీ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయా రికార్డులను పరిశీలించారు.మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 కే. మాల్యాద్రి, ఎంఈవో-2 ఎంవీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బార్‌లకు ఎవరెన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు

కావలి,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): బార్‌లకు ఓ వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని కావలి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం బార్ అండ్‌రెస్టారెంట్ నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. నూతన బార్ పాలసీ గురించి వివరించారు. ఈనెల 26 వరకు బార్‌లకు ఆన్‌లైన్ ద్వారా కానీ, ఆఫ్‌లైన్ ద్వారా కానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మద్యం దుకాణదారులు కూడా బార్‌లకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన వివరించారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ కార్యాలయం ఫోన్ 9440902521 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



బార్, రెస్టారెంట్ నిర్వాహకులతో సమావేశమైన ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు



పింఛనుకు అనర్హత.. నోటీసులతో కలత

పింఛన్ పునఃపరిశీలన ప్రక్రియపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. పింఛన్‌కు అన్ని అర్హతలు ఉన్నవారిని కూడా అనర్హులుగా తేల్చి నోటీసులు జారీ చేయడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు అందుకున్న లబ్ధిదారులు సచివాలయం, ఎంపీడీవో కార్యాలయం, వైద్యశాలల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. బుధవారం మండలంలో నోటీసులు అందుకున్న పలువురు లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని అక్కడి అధికారులకు తమ గోడు వినిపించారు. నోటీసు అందుకున్న వారు అప్పీలు చేసుకుంటే మరలా వైద్యాధికారి పరిశీలించి మీ అర్హతను బట్టి సదరం సర్టిఫికెట్ మంజూరు చేస్తారని, మరలా పింఛన్ పొందవచ్చని అధికారులు తెలుపుతున్నారు. దివ్యాంగులమైన తమను ఈవిధంగా బాధపెట్టడం తగదని మదనపడుతూ ఊసూరుమంటూ వెనుతిరుగుతున్నారు.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)



హనుమంతుడిపై కలువుదీరిన వెంకయ్యస్వామి రథం ముందు భక్తులు



వెంకయ్యస్వామికి హనుమంతసేవ

వెంకటాచలం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : గొలగమూడి వెంకయ్య స్వామి 43వ ఆరాధనోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. 3వ రోజు బుధవారం ఉదయం స్వామివారు హనుమంతుడిపై విహరించారు. రాత్రికి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గొలగమూడి గ్రామ వీధుల్లో వేసిన చలువ పందిళ్ల కింద వెంకయ్య రాక కోసం మహిళలు తమ ఇళ్ల ముందు రంగవల్లులను తీర్చిదిద్దారు. స్వామికి కర్పూర నీరాజనాలు అందించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాగా, గురువారం దుయం చిన శేషవాహనం, రాత్రి గజవాహన సేవలు జరుగుతాయని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

చిన్నపాటి వర్షానికే చిత్తడి



మండలంలోని వంగల్లు జెండా వీధిలో చిన్నపాటి వర్షానికే సిమెంట్ రోడ్డు మీద నీరు నిలిచి చిత్తడిగా మారుతోంది. సిమెంట్ రోడ్డు వేసి డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో దోమలకు నిలయంగా మారింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వ చేరకుండా డ్రైనేజీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

రం'డబ్బా'.. ఎరువులొచ్చేశాయ్!

- మార్కెట్లోకి నానో ఎరువులు
- ఖర్చు తక్కువ.. పర్యావరణానికీ మేలు..
- 'బరువు' భారం లేదు.. జేబులో తీసుకెళ్ళొచ్చు..
- అయినా.. వాడకంపై మొగ్గు చూపని రైతులు
- అవగాహన కల్పిస్తే 'అన్నదాత'కు వరమే...

ఒకప్పుడు ఎరువులు కొనాలంటే.. వాటి ధరలు విని 'ఓరి నాయనో..' అని రైతులు ఆశ్చర్యపోయేవారు. ఇక.. ఆ బెంగ అవసరం లేదు. ఎందుకంటే.. పర్యావరణ హితమైన నానో ఎరువులు మార్కెట్లోకి వచ్చేశాయి. వీటిని వినియోగించడం వల్ల రైతులకు ప్రధానంగా 'బరువు' భారం తగ్గుతుంది. బస్తాతో పోలిస్తే ధర కూడా చాలా తక్కువే. మారుతున్న కాలానికి అనుగుణంగా, నానో ఎరువుల వినియోగాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న తరహాలో కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. సర్కారు ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ మార్కెట్లోకి 'నానో' ఎరువుల డబ్బాలను సరఫరా చేస్తోంది. వీటిని రైతులు సులువుగా జేబులో ఉంచుకుని పొలాలకు వెళ్లొచ్చు. రైతన్నలకు ఎంతో లాభం.. సౌలభ్యం కలిగించే 'నానో' ఎరువులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)



యూరియా బస్తాలు

అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు అనేక రసాయన ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు వినియోగిస్తున్న ఎరువుల బస్తాల బరువు దాదాపు 50 కిలోలు. మార్కెట్ నుంచి ఇంటికీ.. అక్కడినుంచి పొలానికి ఈ బస్తాలను మోసుకెళ్ళేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. అంతేగాక ఎరువుల బస్తాలను తరలించేందుకు కూలీలు, వాహన ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. అదనపు ఆర్థిక భారాన్ని మోయలేక రైతులు అప్పులపాల వుతున్నారు. బస్తాల్లోని ఎరువులను పంట పొలా లకు చల్లిన తరువాత, నీటి తడులు ఎక్కువైనా, సరిగా నీరు అందకపోయినా చల్లిన ఎరువు వృథా అవుతుంది. అయితే నానో ఎరువులతో ఆ పరిస్థితి మారబోతోంది.



మార్కెట్లో లిక్విడ్ రూపంలో ఉన్న నానో యూరియా

'నానో' గురించి అవగాహన లేకనే...

రాష్ట్ర ప్రభుత్వం నానో ఎరువుల వినియోగంపై ప్రధానంగా దృష్టి సారించింది. రైతులు నానో ఎరువులు వినియోగించేలా చర్యలు చేపట్టాలని ఇప్పటికే ప్రభుత్వం నుంచి వ్యవసాయశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. దీంతో జిల్లా వ్యవసాయాధికారులు నానో ఎరువులను, నానో డీఏపీలను జిల్లాలోని పలు వ్యవ సాయ సహకార ప్రాథమిక సంఘాలకు పంపి రైతులకు అందుబాటులో ఉంచారు. అయితే నానో ఎరువుల వల్ల కలిగే లాభాలపై మాత్రం ఇప్పటికీ రైతులకు అవగాహన కల్పించడం లేదు. దీంతో పాపం.. రైతులు ఇంకా యూరియా బస్తాలనే భారంగా మోసుకుని వెళుతున్నారు. 'పక్క రైతులు ఎవరైనా నానో యూరియా వాడితే.. అప్పుడు మనమూ వాడదాంలే' అన్న భావనలోనే రైతులు ఉన్నా రు. వ్యవసాయాధికారులు ఇందుకోసం ప్రత్యేక అవగా హన సదస్సులు ఏర్పాటు చేయాల్సి ఉంది. 'పొలం పిలుస్తోంది' వంటి కార్యక్రమాల్లో పల్లె పల్లెకూ వెళ్లి విస్తృత స్థాయిలో తెలియజేయాల్సిన అవసరం చాలా ఉంది.

ధరలు తక్కువ... లాభాలు ఎక్కువ

మార్కెట్‌లో 50 కేజీల యూరియా బస్తా ధర రూ.266 ఉంది. డీఏపీ బస్తా ధర రూ. 1350. వీటిని పొలాల వద్దకు మోసుకెళ్ళేందుకు రైతులకు అదనంగా ఖర్చువుతోంది. అదే నానో డీఏపీ 500 మి.లీ ధర కేవలం రూ. 625 మాత్రమే. నానో యూరియా ధర రూ. 265. వీటిని రైతులు సులువుగా తీసుకెళ్ళి పంటలకు పిచికారీ చేసుకోవచ్చు. డబ్బా సైజులో ఉండే నానో ఎరువుల కొనుగోలు వల్ల రైతులకు అదనపు భారం తగ్గిపోతుంది.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



నానో ఎరువుల వాడకం వల్ల నేలకు ఏ విధమైన నష్టమూ జరగదు. పర్యావరణానికి ఎలాంటి హానీ కలగదు, వీటిని డ్రోన్ల ద్వారా, స్ప్రేయర్ల ద్వారా పంటపై సులువుగా పిచికారీ చేసుకోవచ్చు. తద్వారా మొక్కకు నేరుగా 46 శాతం నత్రజని అందుతుంది. రైతులకు ఆర్థిక భారంతో పాటు శారీరక శ్రమ తగ్గుతుంది. రైతులకు అందుబాటులో ఉంచేలా గత వ్యవసాయ సీజన్‌లోనూ మనుబోలు పీఏసీఎస్‌లో ఉంచాం.

- వెంకటకృష్ణయ్య, మండల వ్యవసాయాధికారి

'సాధారణ' భక్తులకు టికెట్!

- రూ.100 ఇవ్వాలని కోన సిబ్బంది ఒత్తిడి
- భక్తులు తిరగబడటంతో జారుకున్న వైనం

రాపూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో అధికారుల వ్యక్తిగత నిర్ణయాలు భక్తులు తీవ్ర ఆగ్రహావేశాలకు గురి చేస్తోంది. ఎక్కడా లేని విధంగా క్షేత్రంలోని ఓ ఉన్నతాధికారి కొత్త నిబంధనలు అమలు చేస్తుండటంతో ఆలయ ఉద్యోగులు, అర్చకులకు ఇబ్బందులు తప్పడంలేదు. సాధారణంగా స్వామివారి దర్శనానికి ఉచితం, శీఘ్రదర్శనం కోసం రూ.100 టికెట్టు తీసుకోవాలి. ఇది భక్తుల ఇష్టం. అయితే, క్యూలైన్‌లో లక్ష్మీనృసింహుడి దర్శనం కోసం వేచి ఉన్న భక్తుల వద్దకు దేవస్థానం సిబ్బంది వెళ్లి రూ.100 లెక్కన చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. దీనిపై కొంతమంది భక్తులు తిరగబడి తాము టికెట్ ఎందుకు తీసుకోవాలని గట్టిగా నిలదీయడంతో సిబ్బంది అక్కడ నుంచి జారుకున్నారు. ఇదంతా తమ మొబైళ్ల ద్వారా వీడియో తీసిన భక్తులు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

విమర్శల వెల్లువ

ఆలయ ఉన్నతాధికారిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ఆ అధికారిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారంలో ఒక్కరోజు మాత్రమే కోనకు చుట్టపుచూపుగా వస్తుంటారనే విమర్శలు ఉన్నాయి. అలాగే దేవస్థానానికి విరాళాలు, వీఐపీలు వస్తే వారికి అంతరాలయ దర్శనం కల్పించడం ఆనవాయితీ. అయితే, దానిని పూర్తిగా విస్మరించారన్న అపవాదు ఉంది. అలాగే కోనలోని అంగళ్లలో టెంకాయ, కాయ కర్పూరం అధిక ధరలకు అమ్ముతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. దేవస్థానంలో జరిగే కొన్ని పనులు టెండర్లు పిలవకనే నామినేటెడ్ పద్ధతిలో తనకు కావాల్సిన వారికి కట్టబెట్టారనే గుసగుసలు వినవస్తున్నాయి. అంతేగాక ఎన్నడూ లేని విధంగా మీడియాకు సైతం ఆ అధికారి ఆంక్షలు విధించారు.

వారికి నోటీసులిచ్చాం

కొంతమంది భక్తులు రూ.100 టికెట్ తీసుకోకుండా క్యూలైన్‌లో వచ్చారు. వారిని మాత్రమే ఆలయ సిబ్బంది టికెట్ అడిగారు. ఇది మూడు రోజుల క్రితం జరిగిన సంఘటన. ఇలా చేయడం కూడా ఆలయ సిబ్బంది తప్పిదమే. ఆ సిబ్బందికి నోటీసులు జారీ చేశాం.

- పి.శ్రీనివాసులురెడ్డి, పెంచలకోన ఈవో

నూతన బార్ పాలసీతో ఔత్సాహికులకు అవకాశం

- ఎక్సైజ్ డీసీ

కందుకూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీతో ఔత్సాహిక వ్యాపారులకు అవకాశం వచ్చిందని, దీన్ని వారు సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎం. శంకరయ్య కోరారు. బుధవారం ఆయన కందుకూరు ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 55 బార్లకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం, డిపాజిట్ మొత్తాలను కూడా గణనీయంగా తగ్గించిందన్నారు. కందుకూరులో ప్రస్తుతం మూడు బార్‌లకు అనుమతి ఉండగా, వాటితోపాటు గీతకార్మికుల కోటాలో మరో బార్‌కు అనుమతి లభించిందన్నారు. కందుకూరు సర్కిల్ పరిధిలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై ఆయన స్పందిస్తూ ఇటీవల విజిలెన్స్ తనిఖీలు నిర్వహించామన్నారు. అవసరమైతే లైసెన్సు రద్దుకు సిఫార్సు చేసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ ఎస్. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ శంకరయ్య

రైల్వే డీఆర్ఎం విస్తృత తనిఖీలు

- స్టాపింగ్ ఎత్తేసిన రైళ్లను ఆపాలని వినతులు

బిట్రగుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని పలు కార్యాలయాలను విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ మోహిత్ సొనాకియ బుధవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన ప్రత్యేక రైల్లో నెల్లూరుకి చేరుకున్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం బిట్రగుంట రైల్వే స్టేషన్ చేరుకున్నారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయంలో సిగ్నెల్స్ ప్యానల్ బోర్డు, రికార్డులను తనిఖీ చేసి, క్రూకంట్రోల్ రూమ్ పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్రైవర్లు, గార్డుల విశ్రాంతి భవనానికి వచ్చిన ఆయన్ను క్రూకంట్రోల్ శేషయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. అక్కడ డ్రైవర్లు, గార్డుల ఉద్యోగ నియమావళి రికార్డులను పరిశీలించారు. పాత రన్నింగ్ రూమ్‌లో అదనపు నిర్మాణ పనులపై ఆరా తీశారు. నిర్మాణంలో ఉన్న నూతన రన్నింగ్ రూమ్‌లను కూడా పరిశీలించారు. విశ్రాంతి భవన ఆవరణంలో డీఆర్ఎం మొక్కలు నాటారు. అనంతరం ఆయన ప్రత్యేక రైల్లో విజయవాడకు బయలు దేరారు.



రన్నింగ్ రూమ్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న రైల్వే డీఆర్ఎం

సమస్యలపై వినతులు

విజయవాడ రైల్వే డీఆర్ఎంను పలువురు కలిసి శాలువాలు కప్పి పూలమాలతో సన్మానించారు. అనంతరం వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందచేశారు. బిట్రగుంట రైల్వేస్టేషన్ పరిధి బోగోలు మండలంలో 49,847 మంది ప్రజలు ఉన్నారని తెలిపారు. వారిలో రైల్వే కార్మికులు 800, విశ్రాంతి రైల్వే ఉద్యోగులు 2వేల మందికి పైగా ఉన్నారని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గోవిందరాజులు డీఆర్ఎంకు వివరించారు. కాబట్టి గతంలో నిలుపుతున్న రైళ్లను తిరి గి నిలిపేలా ఆదేశించాలని వినతి పత్రం అంద చేశారు. క్రూచేంజింగ్ కోసం అనధికారంగా ఆగు తున్న బొకోరో, తిరుమల, అండమాన్, లక్నో, కాకి నాడ ఎక్స్‌ప్రెస్‌లను అధికారకంగా నిలపాలని రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్.నూరుద్దీన్ వినతిపత్రం అందచేశారు. బిట్రగుంటలో రైల్వే స్థలం 600 ఎకరాలు వృథాగా ఉందని, అందులో రైల్వే సంబంధిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లాకార్యవర్గ సభ్యుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్, జైభీం అంబేద్కర్ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర తదితరులు కోరారు. సానుకూలంగా స్పందించిన డీఆర్ఎం ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

కారు బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉదయగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లి గ్రామ సమీపంలో 167-బీజీ జాతీయ రహదారిపై కారు బోల్తాపడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల మేరకు.. సీతారామపురం మండలం బసినేనిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు పని నిమిత్తం కారులో నెల్లూరుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈనేపథ్యంలో దాసరిపల్లి గ్రామ సమీపానికి రాగానే ఒక్కసారిగా అటవీ ప్రాంతం నుంచి పందులు రోడ్డుపైకి రావడంతో వాటిని ఢీకొని కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో వారికి తీవ్ర గాయాలు కాగా, కారు దెబ్బతింది. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీలకు షెడ్యూల్ విడుదల

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అంతర జిల్లా బదిలీలకు అవకాశం కల్పిస్తూ షెడ్యూల్ విడుదలైనట్లు డీఈవో బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జిల్లా పరిషత్, మునిసిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారి వారి మ్యానేజ్‌మెంట్లకు స్పౌజ్, మ్యూచువల్ ప్రాతిపదికన లీప్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 21 నుంచి 24వ తేదీలోపు మండల విద్యాశాఖాధికారి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 22 నుంచి 25వ తేదీ వరకు మండల విద్యాశాఖాధికారి పరిశీలన ఉంటుందని తెలిపారు. 23 నుంచి 26వ తేదీ వరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వారు పరిశీలించి జాబితాను పాఠశాల విద్యాశాఖ డైరెక్టరుకు పంపుతారని పేర్కొన్నారు. 28, 29తేదీల్లో జాబితాను పరిశీలించి తుది జాబితాను 30వతేదీన ప్రభుత్వానికి అందిస్తారని తెలిపారు.

యువతకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి, కలెక్టర్ ఆనంద్



పరిశ్రమల ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యం

- జాబ్‌మేళాలో కలెక్టర్ ఆనంద్
- ఇండోసోలార్‌లో 68 మందికి ఉద్యోగావకాశాలు

గుడ్లూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పాటవుతున్న పరిశ్రమలతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. చేవూరులో బుధవారం ఇండోసోల్ కంపెనీ ఏర్పాటు చేసిన ప్రత్యేక జాబ్‌మేళాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధి కోసం భూములు ఇచ్చిన ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారని అన్నారు. కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేందుకు సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. సబ్‌కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడచూసినా పోర్టు ఆధారిత పరిశ్రమలు ఉన్నచోటే అభివృద్ధి జరిగిందన్నారు. ఇండోసోల్ కంపెనీ స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి భారతి మాట్లాడుతూ ఇండోసోల్‌లో ఉద్యోగాల కోసం స్థానిక యువత దరకాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఇండోసోల్ కంపెనీలో 68 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండోసోల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కే. బాలచందర్, ఇతర అధికారులు కృష్ణన్, బైరెడ్డి రంగారెడ్డి, జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ కార్యవర్గ సభ్యుడిగా డాక్టర్ తపన్ కుమార్ సాహో

అమరావతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి అల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కార్యవర్గ సభ్యునిగా మేజర్ జనరల్ డాక్టర్ తపన్ కుమార్ సాహోను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీ అంకిత మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ నెల బాధ్యతలు స్వీకరించనున్నారు.

కష్టపడి పనిచేస్తే గుర్తింపు, గౌరవం

- విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి పనిచేస్తే గుర్తింపు, గౌరవం తప్పకుండా లభిస్తాయని విద్యుత్ శాఖ ఎస్ఈ వీ విజయన్ తెలిపారు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరుపతి, నెల్లూరులో అవార్డులు అందుకున్న విద్యుత్ శాఖ అధికారులను బుధవారం నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ అవార్డులనేవి పనితనం, కృషి, అంకితభావానికి కొలమానమని, అవార్డు గ్రహీతలు మరింత బాధ్యత, నిబద్ధతతో పని చేయాలని తెలిపారు. ఈఈలు శ్రీధర్, బెనర్జీ, రమేష్ చౌదరి, డీఈలు అశోక్, పవన్‌కు అభినందనలు తెలిపారు. పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ స్టాల్‌ను తక్కువ సమయంలో ఆకర్షణీయంగా రూపొందించిన ఏఈలు నస్రుల్లా, లక్ష్మీనారాయణను మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈలు సోమశేఖర్‌రెడ్డి, పరంధామయ్య, డీఈలు సునీల్, కిరణ్, మధు, ప్రభాకర్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎస్ఈ విజయన్

చేపల పెంపకంపై రేపటి నుంచి శిక్షణ

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి: నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో కార్ప్ చేపల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ జీ లలితా శివజ్యోతి, మత్స్య విభాగ శాస్త్రవేత్త శ్రీహరిసాదులు ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ఈ నెల 28వతేదీ వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని, ఆక్వా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9154806577 నెంబరును సంప్రదించాలన్నారు.

జీవనోపాధులు మెరుగుకు చర్యలు

- డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు లింకేజీ రుణాలను ఇతోధికంగా ఇప్పించటం ద్వారా పొదుపు మహిళల జీవనోపా ధుల పెంపుదలకు చర్యలు తీసుకుంటున్నామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి తెలిపారు. బుధవారం బ్యాంకు లింకేజీ రుణాలు, ఉన్నతి, స్త్రీనిధి, ఐబీ, ఫిషరీస్ తదితర కార్యక్రమాల అమలు తీరుపై డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏపీఎంలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జీవనోపాధుల కల్పనతో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. పథకాల అమలుకు సంబంధించి నిర్దేశిత లక్ష్యాలను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు.

వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి



మృతి చెందిన చుక్కల దుప్పి

ఉలవపాడు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరేపల్లి జాతీయ రహదారిపై బుధవారం ఉదయం రోడ్డు దాటుతున్న చుక్కల దుప్పిని గుర్తు తెలియని వాహనం ఢీకొనగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న తెట్టు డిప్యూటీ రేంజర్ అధికారి చెన్నయ్య సంఘటనా స్థలానికి చేరుకుని చనిపోయిన దుప్పికి పంచనామా నిర్వహించారు. ఉలవపాడు వ్యవసాయశాఖ ఏడీ సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం దహనం చేసినట్లు డీఆర్‌వో తెలిపారు.